9-1Pg1exHMNWJQE.qxdo/p:9-1Pg1exHMNWJQE.qxd 1/1/02 8:10 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం fb.com/vaartha

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

9-1-2025 గురువారం సంపుటి: 30 సంచిక: 342 పేజీలు: 16 వెల: 6.50

'ఆప్'కు బెంగాల్ టిఎంసి మద్దతు

ఇస్రో నూతన సారథిగా నారాయణన్

5లో

# దేశాభివృద్ధిలో ఎపి కీలకం



బుధవారం విశాఖలో జరిగిన బహిరంగసభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, గవర్నర్ నజీర్, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రి లోకేష్

ఆంధ్రుల అభిమానం మరువలేను..

విశాఖలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు చర్యలు

గ్రీన్ హైడ్రోజన్‌కు అధిక ప్రాధాన్యం

మొబైల్ తయారీలో శ్రీసిటీ ప్రపంచానికే దిక్సూచి

రాష్ట్రంలో 70 రైల్వేస్టేషన్ల అభివృద్ధి: ప్రధాని మోడీ

ఇన్ని ప్రాజెక్టులు ఒకేసారి చరిత్రలోనే అపూర్వం: సిఎం చంద్రబాబు

నిర్భర భారత్, స్వచ్ఛ భారత్ అభివృద్ధి మంత్రాలు: డి.సిఎం పవన్

2.08 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు 2లో

**విశాఖపట్నం, జనవరి 8, ప్రభాత వార్త:** 'ఆంధ్ర ప్రజల ప్రేమ మరియు అభిమానానికి నా కృతజ్ఞతలు. నా అభిమానాన్ని మీమీద చూపించడానికి అవకాశం ఇప్పుడు లభించింది. సింహాచల లక్ష్మీ నరసింహ స్వామికి నా నమస్కారాలు తెలియజేస్తున్నాను' అంటూ ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మీ ఆశీర్వాదంతో దేశంలో 40 సంవత్సరాల తర్వాత మూడోసారి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోడీ చెప్పారు. 'విశాఖ ప్రజల స్వాగతం చూశాను. చంద్రబాబు చెప్పిన విషయాలను గౌరవిస్తూ, రాష్ట్ర ప్రజలు నాపై చూపిన విశ్వాసాన్ని చెక్కుచెదరనీయనని' ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సహకారం అయితేనే దేశం బాగుపడుతుందని, ఆంధ్ర ప్రజలకు సహకారం అందించడమే తమ లక్ష్యం అని మోడీ అన్నారు. 2047 సంవత్సరానికి రెండున్నర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌తో భుజం భుజం కలిపి నడుస్తామని మోడీ చెప్పారు. ఈరోజు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులను శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశాను. ఇది ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్న ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఏపీలో ఐ.టి >>2



విమానాశ్రయం నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయందాకా జరిగిన భారీ రోడ్‌షోలో ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డి. సిఎం పవన్ కల్యాణ్

# ప్రధాని మోడీకి జన నీరాజనం

రోడ్‌షో పొడవునా ప్రధానికి బ్రహ్మరథంపట్టిన విశాఖవాసులు

**విశాఖపట్నం, జనవరి 8, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖలో నిర్వహించిన రోడ్‌షోలో విశాఖవాసులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం విశాఖపట్నం చేరుకున్న పిఎం ఐఎన్ఎస్‌డేగా నుంచి సాయంత్రం స్థానిక సిరిపురం జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రోడ్ షో >>2

# ఇంటర్ విద్యలో సంస్కరణలు

వచ్చే విద్యాసంవత్సరంనుండి ఫస్టియర్ పరీక్షలు తొలగింపు!

ఇంటర్నల్ మార్కులు, ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలు

తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడి



**విజయవాడ, జనవరి8, ప్రభాత వార్త ప్రతినిధి:** ఇంటర్ విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకొనున్నట్లు ఇంటర్ విద్యామండలి (బిఐఇ) కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌లో ఎన్‌సిఇఆర్టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెడుతున్నామన్నారు. ఇప్పటికే 15 రాష్ట్రాల్లో ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలను ఇంటర్‌లో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. సిలబస్, పాఠ్యపుస్తకాలను పూర్తిగా మార్చడంతోపాటు కొత్త సబ్జెక్టుల కాంబినేషన్‌లో మార్కుల విధానంలోనూ మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్నల్ మార్కుల విధానం ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. దీంతో నీట్, జెఇఇ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సులభమవుతుందని వివరించారు.

సైన్స్, ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా ఇంటర్మీడియేట్ విద్యలో సంస్కరణలు తీసుకురావాలని చూస్తున్నామని కృతికా శుక్లా తెలిపారు.. ఇంటర్మీడియేట్ విద్యా మండలి ప్రతిపాదిత విద్యా సంస్కరణలపై బుధవారం తాడేపల్లిలోని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యదర్శి కృతికా శుక్లా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో >>2



తిరుపతి విష్ణునివాసం వద్ద టోకెన్లకోసం తోపులాట దృశ్యం

# తిరుపతిలో తొక్కిసలాట: ఆరుగురు మృతి


దర్శనం టోకెన్ల కోసం విష్ణునివాసం వద్ద భారీ రద్దీ

నియంత్రణలో పోలీసుల వైఫల్యం

**తిరుపతి,జనవరి 8ప్రభాతవార్త:** వైకుంఠద్వార దర్శన టోకెన్లుకోసం భారీగా తరలివచ్చిన భక్తులను నియంత్రించి కట్టడిచేయడంలో అటు టిటిడి అధికారులు ఇటు పోలీసుయంత్రాంగం ఘోర వైఫల్యంతో ఆరుమంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. భారీగా తరలివచ్చిన భక్తులు తిరుపతిలోని శ్రీనివాసం, >>2

# అమరావతిలో రూ.11,467కోట్ల పనులకు ఆమోదం

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో రూ.11,467 కోట్లతో పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాలనామోదాన్ని ఇచ్చింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి కె. కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ నిర్వహించిన వేర్వేరు సిఆర్‌డిఎ అథారిటీ సమావేశాల్లో తీసుకున్న పనులను చేపట్టేందుకు గానూ ప్రభుత్వం ఈ పాలనామోదాన్ని జారీ చేసింది. మొత్తం 20 ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు సిఆర్‌డిఎకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని పరిధిలోని వివిధ నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు సిఆర్‌డిఎ కమిషనర్‌కు అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. రికార్డు స్థాయిలో అమరావతిలో భవన నిర్మాణం చేపట్టాలనే దిశలో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది.గతంలో నిర్మాణ దశలో ఆగిన పనులను ముందస్తుగా పూర్తి చేసే దిశలో కార్యాచరణ సాగుతుంది.ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకురుణం మంజూరు చేయటంతో అమరావతిలో పనుల్ని పరుగెత్తించేం >>2




# దేశానికి చారిత్రక అవసరం 'జమిలి'

జెపిసి ముందు ఎన్డీయె ఎంపీల వివరణ

**న్యూఢిల్లీ, జనవరి 8:** ఒకే దేశం ఒకే ఎన్నిక కోసం ప్రవేవపెట్టిన బిల్లు దేశానికి అత్యవసరమని విధిగా అమలుచేయడంవల్ల అధిక వ్యయం ఆదా అవుతుందని, అంతేకాకుండా దశలవారీగా రాష్ట్రాలు, లోక్‌సభలకు జరుగుతున్న ఎన్నికల వల్ల సుదీర్ఘ వ్యవస్థగా మారుతున్నదని, ఒకేదేశం ఒకే ఎన్నిక బిల్లులు చట్టరూపంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతో ఉందని బిజెపి ఎంపిలు పేర్కొన్నారు. వన్‌నేషన్ వన్‌ఎలక్షన్‌కోసం ఏర్పాటుచేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశం బుధవారం తొలిభేటీ జరిగింది. కమిటీ ఛైర్మన్ పిపిచౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లాకమిషన్, న్యాయశాఖ అధికారులు కమిటీ సభ్యులకు సంక్షిప్తంగా బిల్లు అంశాలను వివరించారు. అలాగే బిల్లులో ఉన్న కీలక సెక్షన్లను కూడా వివరించారు. ఎన్డీయే పక్ష సభ్యులు ఈ బిల్లు అత్యవసరమని ప్రకటిస్తుంటే విపక్ష ఇండియా కూటమి పార్టీలసభ్యులు మాత్రం విమర్శిస్తున్నారు.

రాష్ట్రాల హక్కులను ఈబిల్లు హరించి వేస్తున్నదని వాదిస్తున్నారు. ఈనేపథ్యంలో కోవింద్‌కమిటీ నివేదిక వివరాలనుసభముందు ఉంచారు. సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్‌ఎంపి ప్రియాంక గాంధీ మాట్లాడుత ఈ బిల్లు అమలు కువస్తే ఎన్ని ఈవీఎంలు అవసరం అవుతాయని ప్రశ్నించారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించిన పక్షంలో ఎంతమేర ఆర్థికంగా వ్యయభారం తగ్గుఉతందని, ఎన్ని ఈవీఎంలు అవసరం అవుతాయని వివరాలు కావాలని ఆమె కోరారు.



బుధవారం రాజమహేంద్రవరంలో జరిగిన తెలుగుసభలలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న చైతన్య రాజు. చిత్రంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

# తెలుగు మాట్లాడేవారికే ఓటు వేయండి

పాలన తెలుగులోనే జరగాలి

జిజియులో జరిగిన తెలుగు మహాసభలలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో జనవరి 8 ప్రభాతవార్త:** తల్లి లాంటి తెలుగు భాషను కాపాడుకుని, ఆంగ్ల భాష వ్యామోహం తగ్గించుకుంటూ తెలుగు భాష వికాసం ఉద్యమంగా సాగాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తెలుగు రానివాడు తెలుగువాడే కాదని భాషపోతే శ్వాస ఆగినట్లున్నారు. తెలుగు మాట్లాడేవారికే ఓటు వేయాలని, తెలుగులోనే ఉత్తర్వులు ఉండాలని, తెలుగులోనే పాలన చేయాలని ఆయన అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు) ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమైనాయి. కులపతి కలిదిండి వివి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో వెంకయ్య నాయుడు >>2

9-1pg2exHMNWJQE.qxdo/p:9-1pg2exHMNWJQE.qxd 1/1/02 7:53 AM Page 1





బుధవారం విశాఖలో జరిగిన ప్రధాని బహిరంగసభకు హాజరైన జనసందోహం

# దేశాభివృద్ధిలో ఏపి కీలకం

>> అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ ఉన్న నైపుణ్యంతో రాష్ట్రం సర్వతో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని నమ్మకం తనకు ఉందని ప్రధాని మోదీ చెప్పారు. దేశంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ కి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని భవిష్యత్తులో పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ హబ్ని అభివృద్ధి చేసే ప్రాంతాలలో విశాఖ ఒకటిగా నిలుస్తుంది అని అన్నారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో విశాఖ ఒకటి అని మోదీ పేర్కొన్నారు. వీటి ద్వారా ఈ రంగంలో పరిశోధనలకు అవకాశాలు లభిస్తాయి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి నవయుగ పట్టణీకరణకు కేంద్రంగా ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేశామని, అలాగే చెన్నై, బెంగళూరు ఇండస్ట్రీ కారిడార్ అభివృద్ధి చేయుట ద్వారా ఈ రెండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాబోతున్నాయని ప్రధాని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, తయారీ రంగంలో అగ్రగామిగా నిలవాలన్నది తమ ఆకాంక్ష అని మోదీ పేర్కొన్నారు. ఇందుకు శ్రీ సిటీ ప్రపంచంలోనే అత్యుత్తమైన ర్యాంకింగ్ సాధించినుందని దేశానికి మొబైల్ తయారీ రంగంలో దిక్సూచిగా నిలవబోతోందని మోదీ చెప్పారు. విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి పునాది వేస్తున్నాం. ప్రత్యేక రైల్వే జోన్ కావాలన్న డిమాండ్ చాలా రోజుల నుంచి ఈ ప్రాంత వాసులు వినిపిస్తున్నారు. వారి కల ఈరోజు సాకారం అయిందని మోదీ చెప్పారు. ఈ రైల్వే జోన్ రాక వలన ఈ ప్రాంతంలో వ్యవసాయ, ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో రైల్వే, రోడ్ల కనెక్టివిటీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసాం. ఏపీలో అమృత భారత స్టేషన్ పథకంలో భాగంగా 70 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రధాని మోదీ వివరించారు. ఏపికి 7 వందే భారత్, అమృత భారత రైళ్లను కూడా కేటాయించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో మౌలిక సదుపాయాల విప్లవం వలన రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుంది. రెండున్నర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ విశాఖపట్నం ఎంత దోహదపడుతుందని మోదీ వివరించారు. సముద్ర సంబంధిత అవకాశాలు వినియోగించుకోవడానికి విశాఖలో ఉన్న ఫిషింగ్ హార్బర్ని మరింత అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. ఆంధ్రాలో మత్స్యకారుల వ్యాపారాలు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మత్స్యకారులకు అనేక సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలోని ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి మేలు జరగాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం పని చేస్తుందని మోదీ వివరించారు.

**నా రాజకీయ జీవితంలో ఇంత గొప్ప కార్యక్రమం ఎప్పుడు చూడలేదు: చంద్రబాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఇంత గొప్ప కార్యక్రమం తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. 'ఇది చారిత్రాత్మకమైన రోజు. రెండు లక్షల 85 వేల కోట్ల రూపాయల వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయటం ఇది నా రాజకీయ చరిత్రలో మొట్ట మొదటిసారిగా చూస్తున్నాను' అని అన్నారు. విశాఖ రైల్వే జోన్ కోసం భూమి అడిగితే ఇవ్వడానికి ఇష్టపడని గత ప్రభుత్వం అయితే, తమ ప్రభుత్వం 52 ఎకరాల భూమిని ఇచ్చి రైల్వే జోన్ ఏర్పాటుకు అంకురార్పణ చేసింది అని చెప్పారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ప్రజలకు దగ్గరైన వ్యక్తి నరేంద్ర మోదీ అని చంద్రబాబు కితాబు ఇచ్చారు. నరేంద్ర మోదీ కేవలం ఉత్తరాదికే పరిమితం కాదు.. దేశం మొత్తం మెచ్చుకునే నాయకుడు నరేంద్ర మోదీ అని అన్నారు. భవిష్యత్తులో ఈ పార్టీల కలయిక కొనసాగుతుందని అని చంద్రబాబు స్పష్టం చేశారు. హర్యానా, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగితే అక్కడ తిరుగులేని మెజార్టీతో ఎన్డీఏ గెలిచిందని ఇది నరేంద్ర మోడీ చరిష్మాని చంద్రబాబు మోడీని కీర్తించారు. ఢిల్లీ ఎన్నికల్లో కూడా నరేంద్ర మోడీ హవా కొనసాగుతుందని చంద్రబాబు జోస్యం చెప్పారు. అభివృద్ధి, సంస్కరణలు,సుపరిపాలన తో నరేంద్ర మోడీ దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారని అన్నారు. 2029 నాటికి భారతదేశం ప్రగతిలో మూడవ స్థానంలో నిలుస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. విభజన తర్వాత ఎపికి న్యాయం జరగలేదని భావించిన నరేంద్ర మోడీ ఎపిని బలోపేతం చేయడానికి మోడీ చర్యలు తీసుకున్నారని చంద్రబాబు వివరించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు అనేక యూనివర్సిటీలను రాష్ట్రానికి కేటాయించారని,. రాష్ట్ర పునర్నిర్మాణానికి మోడీ అందించిన సాయం మరువలేనిదని చంద్రబాబు నాయుడు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అన్నిటినీ పూర్తిగా అమలు చేసే బాధ్యతని తాను తీసుకుంటానని సిఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాం అని అన్నారు. విశాఖ, రాష్ట్రానికి ఆర్థిక రాజ్యానికి అవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఫార్మా వంటి అనేక పరిశ్రమలతో పాటు టూరిజం కూడా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలియజేశారు. ఖిఅమరావతి రాజధానికి మీరు శంకుస్థాపన చేశారు. మీ ఆశీస్సులతో అద్భుతమైన, అందమైన రాజధాని నిర్మిస్తాను. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, నదులను అనుసంధానం చేస్తామ'ని చంద్రబాబు వేదికపై నుంచి మోడీకి తెలియజేశారు. దేశం ఒడిదుడుకుల్లో ఉన్న సమయంలో మోడీ ప్రధానమంత్రిగా బాధ్యత స్వీకరించి దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారని అన్నారు. నరేంద్ర మోడీ కేవలం భారత ప్రధాని మాత్రమే కాదని, ఆయన గ్లోబల్ లీడర్ అని కొనియాడారు. విధ్వంస పాలకుల వలన రాష్ట్రం బాగుపడదు. అభివృద్ధిని కాంక్షించే వారిని ప్రభుత్వంలో నిరంతరం కొనసాగేలా ప్రజలు ఆలోచన చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కేంద్రంలో ఎన్డీఏ, ఏపీలో కూటమి ప్రభుత్వాలు అధికారులు ఉంటేనే డబుల్ ఇంజన్ స్పీడ్‌తో అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తామని అన్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సదాశయం, సత్సంకల్పంతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ప్రజలతో మమేకమై పనిచేస్తే అది ఆత్మ నిర్భర భారత్ అవుతుంది అని అన్నారు. అదే కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పరిశుభ్రత గురించి తెలియజేస్తూ సాగితే అది స్వచ్ఛభారత్ అవుతుంది. దేశభక్తి చాటి చెప్పుకుంటూవస్తే బలిష్టమైన భారతదేశం అవుతుంది. ఒక బలమైన భారత్ కోసం నాలుగున్నర దశాబ్దాలుగా పరితపిస్తూ అవమానాలను భరిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ భారతదేశంలోని బలమైన ఆర్థిక శక్తిగా మోడీ నిలబెట్టారని పవన్ కల్యాణ్ అన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల ప్రవేశించి రెవెన్యూ మంత్రిగా ఆర్థిక మంత్రిగా మొదలై తెలుగుదేశానికి రథసారథిగా నిలిచి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దార్శనికుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని నమ్మారు.. నిలబడ్డారు అందుకే ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టు మనకు వచ్చాయని అన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడితో ఏర్పాటు అవుతున్న ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా ఏడున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుంది అందుకు మోడీకి పవన్ కల్యాణ్. ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా అమరావతి రాజధానికి సహకారం, హైవేల నిర్మాణానికి పెట్టుబడులు, రక్షిత మంచినీటి ప్రాజెక్టులు మంజూరు, మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా నరేంద్ర మోడీ రోడ్ల నిర్మాణానికి చొరవ తీసుకున్నారంటే అది చాలా గొప్ప విషయం అని అన్నారు. ఏ రాష్ట్ర, ఏ ప్రాంతం వెనకబడి ఉండకూడదనే ఆలోచనతోనే ఇంత భారీ పెట్టుబడులు ఉత్తరాంధ్రకు ఇచ్చారని పవన్ కల్యాణ్ అన్నారు. అభివృద్ధికి ఆస్కారమే లేదు అని చెప్పుకునే పరిస్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్రప్రదేశ్ అనే చెప్పే స్థితికి తీసుకొచ్చారు. దీనికి సమర్థవంతమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ రాష్ట్రానికి అండగా మోదీ ఉండటమే కారణమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ప్రధాని మోడీకి దీర్ఘాయుష్ ఇవ్వాలని. లక్ష్మీ నరసింహ స్వామి ఈ దేశాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ న.మో ప్రధాన మంత్రి అర్థం మార్చారు. నమో పేదవాళ్లకు విశ్వాసం.. నమో పేదల చిరునవ్వు నమో అన్నదాతల కళ్ళలో ఆనందం. అసమర్ధ పాలన వలన రాష్ట్రం విడిపోయింది.అలాంటి సమయంలో మన రాష్ట్రానికి మోడీ ఆక్సిజన్ అందించారని లోకేష్ చెప్పారు. పోలవరంతో సహా అనేక ప్రాజెక్టులకు నిధులు విడుదల చేశారని చెప్పారు. భోగాపురం ఎయిర్పోర్ట్ పనులు వేగవంతం అయ్యాయి. వెయ్యి రూపాయలు పెన్ పెన్షన్ పెంచడానికి గత ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టిందని.. కానీ ఒకే ఒక సంతకంతో చంద్రబాబు వెయ్యి రూపాయలు పెన్షన్‌ని పేదలకు అందించారని లోకేష్ తెలియజేశారు. చంద్రబాబు నాయుడు త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించబోతున్నారని చెప్పారు.

## ప్రధాని మోడీకి జన నీరాజనం

>> లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ప్రధాని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రజల నుంచి పూల వర్షంతో నీరాజనాలు అందుకున్నారు. సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు సుమారు కిలో మీటరు మేర భారత ప్రధాని నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వాహనంపై నుంచి ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. ఈ రోడ్ షోలో కూటమి నేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కాగా మోదీ.. మోదీ..నామస్మరణతో విశాఖ ప్రాంతం మారుమోగింది. మోదీ, చంద్రబాబు, పవన్ రోడ్ షో పట్ల విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# 2.08 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

**విశాఖపట్నం, జనవరి 8, ప్రభాతవార్త:** వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు మునుపెన్నడు చూడని అభివృద్ధిని చూడబోతున్నారు. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజువేసే స్థితి నుంచి.. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు క్యూ కట్టే పరిస్థితి ఏర్పడింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉమ్మడి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంద ని చెప్పక తప్పదు. కేంద్రం ఎప్పుడు ఉత్తరాదిపైనే మమకారం చూపిస్తోందని, దక్షిణాదిని విస్తరించిందన్న ఆరోపణకు ప్రధాని మోదీ తెరదించారు. ఏకంగా 2. 08 లక్షల కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టులను ఉత్తరాంధ్రలో నెలకొల్పి దక్షిణాది పట్ల తనకున్న విధేయతను చాటుకున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే 70 లక్షల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. విశాఖ వేదికగా బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ 2. 08 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద అత్యాధునిక ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. హరిత ఇంధనం, సుస్థిర భవిష్యత్తుకు తొలి అడుగు పడింది. జాతీయ గ్రీన్ హడ్రోజన్ మిషన్‌లో భాగంగా ఇదే తొలి గ్రీన్ హైడ్రో జన్ హబ్. ఈ ప్రాజెక్టు పెట్టుబడి దాదాపు రూ. 1,85,000 కోట్లు. 20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాల్లో పెట్టుబడి ఇందులో భాగం. తద్వారా, రోజుకు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థంతో ఇది దేశంలోని అతిపెద్ద సమీకృత గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా మారింది. దానితోపాటు హరిత మిథనాల్, హరిత యూరియా, పర్యావరణ హిత వైమానిక ఇంధనం సహా రోజుకు 7500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులను అందించగల సామర్థం ఉన్న ఈ ప్రాజెక్టు ప్రధానంగా ఎగుమతి మార్కెట్ ను లక్ష్యంగా పని చేస్తుంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యం దిశగా భారత్ కు ఈ ప్రాజెక్టు విశేషంగా సహాయపడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో రూ. 19,500 కోట్ల విలువైన వివిధ రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేయడంతోపాటు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా పలు ఇతర ప్రాజెక్టులతోపాటు విశాఖపట్నంలో దక్షిణ తీర రైల్వే ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఆరోగ్య, రక్షణ సదుపాయాల కల్పనతోపాటు చౌక ధరల్లో వైద్యాన్ని అందించాలన్న ప్రధాని దార్శనికతలో భాగంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో భారీ ఔషధ పార్కుకు ప్రధానమంత్రి మోడీ బుధవారం శంకుస్థాపన చేశారు.

## ఆరుగురు మృతి

>> బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల, సత్యనారాయణపురంలోని కౌంటర్లవద్ద బుధవారం రాత్రి పెద్దతోపులాటలో క్రిందపడిన భక్తులపై ఇతర భక్తులు తొక్కిసలాటతో ఈ విషాదం జరిగింది. పూర్తిగా టిటిడి ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం అవగాహనలోపంతో, నియంత్రణలో వైఫల్యమే భక్తులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైం దని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈవిషాద సంఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దర్శన టోకెన్ల కోసం వచ్చి ఇంత భారీగా భక్తులు మృతిచెందడం వైఫల్యంగానే సిఎం పేర్కొన్నారు. కాగా భక్తులను దర్శనాలకు రమ్మని టోకెన్లు జారీకంటే ముందే టోకెన్లు ఇవ్వడంతోనే ఈ తొక్కిసలాట జరిగిందనేది అక్కడ ప్రత్యక్షసాక్షుల భక్తుల మాటలు.వైకుంఠద్వార దర్శన ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్ల కోసం భారీగా తరలివచ్చిన భక్తుల మధ్య తోపులాట, తొక్కిసలాట జరగడంతోనే ఆరుమంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం, 20మందికిపైగా భక్తులు తీవ్ర అస్వస్థతకు గురవడం జరిగింది.

## 'మాజీ'లకు రేపు ద్వారదర్శనం ఉండదు!

### 11నుండి తొమ్మిది రోజులు అనుమతి

**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు జరిపించుకునే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠ ఏకాదశి(రేపు) మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ టిటిడి ఛైర్మన్లు, మాజీ బ్యూరోక్రాట్లుకు దర్శనాలు ఉండవని టిటిడి వెల్లడించింది. వైకుంఠ ద్వాదశి జనవరి 11వతేదీ నుండి తొమ్మిది రోజులు(జనవరి 19వరకు)వీరికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. వైకుంఠ ద్వార దర్శనాల టిక్కెట్లు, టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించబడుతుంది. పదిరోజులు ప్రోటోకాల్ విఐపిలకు మినహాయించి మరెవ్వరికీ విఐపి దర్శనాలు ఉండవు. అన్ని ప్రత్యేక దర్శనాలు టిటిడి రద్దుచేసింది. ఆ పదిరోజులు దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేని భక్తులను తిరుమలకు అనుమతిస్తారు. అయితే వైకుంఠ దర్శనం చేసుకునే అవకాశంఉండదు. భారీ క్యూలైన్లు నివారించి గరిష్ట సంఖ్యలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు.

# ఇంటర్ విద్యలో సంస్కరణలు

>> తీసుకువచ్చే సంస్కరణల ఫలితాలు 10 లక్షల మంది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన విషయమని అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు మరియు భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఇందుకు జనవరి 26, 2025 లోపు వారి అభ్యంతరాలను, సూచనలను అదే విధంగా విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఇంటర్ తొలి ఏడాది పరీక్షలు పూర్తిగా తొలగించేలా ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు కృతికా శుక్లా వివరించారు. ఇందుకు తల్లిదండ్రుల, విద్యార్థుల అభిప్రాయాలను అనుసరించి నిర్ణయం ఉంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగా ఇంటర్ మొదటి సంవత్సరాంతర పరీక్షల తొలగింపు అంశం ప్రతిపాదనల్లో ఉందన్నారు.ఇంటర్ తొలి ఏడాది పరీక్షలు పూర్తిగా కళాశాలలే సొంతంగా నిర్వహించుకుంటాయన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలనే బోర్డు నిర్వహిస్తుందన్నారు. ఇవన్నీ కేవలం ప్రతిపాదనలేనని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు తీసుకుని అమలు చేస్తామని తెలిపారు. ఈనెల 26లోగా సంస్కరణలపై సలహాలు, సూచనలు పంపాలన్నారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ప్రతిపాదిత సంస్కరణల వివరాలు అందుబాటులో ఉంటాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. 2025-26 నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టారని, నీట్, జెఇఇ వంటి జాతీయ స్థాయి పోటీపరీక్షలను దృష్టిలో ఉంచుకుని,మేధావులు,విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సంస్కరణల్లో భాగంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. ఆయా కళాశాలలు అంతర్గతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను మాత్రమే బోర్డు నిర్వహిస్తుందని తెలిపారు. ఈనెల 26లోగా సంస్కరణలపై సలహాలు, సూచనలు పంపాలని ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా కోరారు. కొత్త ముసాయిదా ప్రకారం ఇంటర్ పరీక్షల విధానంలో కూడా సమూల మార్పులు చోటుచేసుకోనున్నాయన్నారు.

ప్రతి సబ్జెక్టులో ఇంటర్నల్ మరియు ప్రాక్టికల్స్ తప్పనిసరన్నారు. ఇంటర్ బోర్డు పరీక్షల్లో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, ఖాళీలను పూరించడం, ఏకపద సమాధానాలు వంటి వాటికి మార్కుల్ని ప్రతిపాదించారన్నారు. వ్యాసరూప ప్రశ్నలకు 8 మార్కులకు బదులు 5/6 మార్కులు కేటాయించాలని భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి. సుబ్బారావు, అకడమిక జాయింట్ సెక్రటరీ బి. విజయభారతి, ఈఆర్టీడబ్లూ రీడర్ ఎస్. కృష్ణ కాంత్, పరీక్షల ఓఎస్డీ వీ. రమేష్ తదితరలు పాల్గొన్నారు. ఏపీలో 10వ తరగతి పబ్లిక్, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ ను సైతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి విడుదల చేసిన షెడ్యూల్ విద్యార్థుల మానసిక స్థితికి అనుగుణంగా తయారు చేసినట్లుగా చెప్పవచ్చు. ప్రతి పరీక్షకు ఒకటి లేదా రెండు రోజులు కాల వ్యవధి ఉంచి, విద్యార్థులు మరింతగా సమయం తీసుకుని ఉన్నత మార్కులు సాధించేలా షెడ్యూల్ ప్రకటించారు.ఇక ఇప్పుడు విద్యావ్యవస్థకు సంబంధించి మరో కీలక నిర్ణయాన్ని మంత్రి నారా లోకేష్ తీసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డుకు ప్రభుత్వం ఓ సూచన చేసింది. రానున్న విద్యా సంవత్సరం నుండి ఇంటర్ ఫస్టియర్ పరీక్షలను పూర్తిగా తొలగించేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కేవలం ఇంటర్ సెకండియర్ పరీక్షలను మాత్రమే నిర్వహించాలని, రెండు సంవత్సరాలు పరీక్ష నిర్వహించడం ద్వారా విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం నేపథ్యంలో ఉన్నత విద్య వైపు మక్కువ చూపడం లేదన్న అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విధానం అమలు చేసేందుకు ఈనెల 26 వరకు విద్యార్థులు తల్లిదండ్రుల నుండి తగిన సలహాలు సూచనలను తీసుకోనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటన జారీ చేసింది.

# పనులకు ఆమోదం

>> దుకు సిఆర్‌డిఎ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు వరుస టెండర్లను జారీ చేస్తున్నాయి. తాజాగా ఈ రెండు సంస్థలు కలిపి రూ.2,514 కోట్ల అంచనాలతో టెండర్లను పిలిచాయి. రాజధానిలో రోడ్ల నిర్మాణం లాంటి ట్రంక్ ఇన్ ఫ్రాతో పాటు, భూగర్భ విద్యుత్ కేబుళ్ల కోసం యుటిలిటీ డక్టులు, వరదనీటి కాలువలు, సీవరేజి, అవెన్యూ ప్లాంటేషన్, గెజిటెడ్ అధికారులు, క్లాస్ 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్లలో మిగిలిన పనులు చేపట్టేందుకు ఈ టెండర్లను జారీ చేశారు.

# రూ. 25 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

### ఆంధ్రా నుంచి తమిళనాడుకు రవాణా, ఆరుగురి పట్టివేత



సరిహద్దుల్లో పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

**తడ, జనవరి 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు తరలిపోతున్న 25 లక్షల 50 వేల రూపాయలు విలువైన గంజాయిని బుధవారం సరిహద్దుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆధ్వర్యంలోనాయుడుపేట, గూడూరు డిఎస్పీలు, తడ, చిల్లకూరు పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. తమిళనాడుకు చెందిన ఐదుగురు, పుత్తూరుకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, అందులో పాల్గొన్న వారి నుంచి మూడు కార్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం సాధారణంగానే సరిహద్దుల్లో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. తడకు అతి దగ్గరలో ఉన్న శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద తనిఖీలు జరుపుతుండగా తమిళనాడు వైపు వెళుతున్న ఒక కారును అనుమానించి పట్టుకున్నారు. ఇందులో 9.5 లక్షలు విలువైన 28 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే తడ ఎస్ఐ కొండప్పనాయుడు, సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబులు జిల్లా కేంద్రానికి సమాచారం అందించారు. తడ వద్ద పట్టుబడిన నిందితులను విచారించగా, వారు తమకు గంజాయిని అమ్మిన వారి వివరాలు అందజేశారు. తడ పోలీసులకు పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడైన తమిళనాడుకు చెందిన షారుఖ్‌ఖాన్ గతంలో హత్య కేసు, ఎన్‌డిపిఎస్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతనితో పాటు గుమ్మిడిపూండి వద్ద స్వామిరెడ్డికండ్రిగకు చెందిన అరుణ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు పుత్తూరులో గతంలో హోంగార్డుగా పనిచేసి తొలగించబడిన పసుపులేటి గిరిబాబు, తమిళనాడుకు చెందిన ఎం.మదన్‌కుమార్, పంజనాదన్ అజయ్, ఎం.తిరుబాకరన్‌లు గంజాయి అమ్మినట్లుగా నిర్ధారించుకొని గూడూరు డిఎస్పీ పరిధిలోని చిల్లకూరు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడ కోట క్రాస్‌రోడ్డు సమీపంలో కడివేడు గ్రామం వద్ద నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 72 కిలోల గంజాయి, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. వీటివిలువ సుమారు 16లక్షలు ఉంటుందని పోలీసులు చెప్తున్నారు. గూడూరు డిఎస్పీ రమణకుమార్, రూరల్ సిఐ కిషోర్‌బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తదితరులు అక్కడ ముద్దాయిలను, గంజాయిని పట్టుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి తదితరులు సంఘటన స్థలాలకు వెళ్లి పరిశీలించి పెద్దమొత్తంలో గంజాయిని, ఒకేసారి ఆరుగురు నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను అభినందించారు.ఎస్ఐ కొండప్పనాయుడుతో పాటు హెడ్ కానిస్టేబుల్ నారయ్య, పిసిలు విజయ్, నాగరాజు, శివకుమార్, సుబ్రహ్మణ్యం, సురేష్ తదితరులను పలువురు అభినందించారు.

# తెలుగు మాట్లాడేవారికే ఓటు వేయండి

>> ముఖ్య అతిదిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష వారు కొన్ని పదాలు, పేర్లు పలకలేక, చాలా పేర్లు, పదాలు మార్చేసి, తద్వారా మన భాషను, సంస్కృతిని చెడగొట్టారని వాటిని మనం సరిదిద్దుకోవాలన్నారు. ఆదికవి నన్నయ, సాంఘిక సంస్కరణలు తెచ్చిన కందుకూరి వీరేశలింగం, అలాగే ఎందరో పండితులు, సాహితీ వేత్తలు భాషను సుసంపన్నం చేసారని తెలిపారు.

తెలుగు వారు తమిళనాడు పదిశాతం, మహారాష్ట్ర రెండు శాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో 13.2 శాతం ఉన్నారని చెప్పారు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలలో అపార విజ్ఞానం ఉందని వెంకయ్య నాయుడు చెప్పారు. సంస్కృతంలో ఉన్న చాలా విషయాలు తెలుగులోకి అనువదించారని, ఇంకా అలాంటి ప్రయత్నం జరగాలని, సంస్కృతాన్ని రక్షి ంచుకోవాలన్నారు. ఆంగ్లంలో 2లక్షల పైగా పదాలు మాత్రమే ఉండగా, తెలుగులో ఆరు లక్షల పదాలు ఉన్నాయని, పదాలు విజ్ఞానంతోనే పుడతా యని చెప్పారు. తెలుగు రాకపోవడం వలన నేల ఉసిరి, పునర్వ ఆకు, వంటివి కూడా తెలియని పరిస్థితి వస్తుందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఎస్, ఐపీఎస్ అధికారులు, మార్వాడీలు, ఇతర రాష్ట్రాల వాళ్లు ఆంధ్రాలో ఉంటూ తెలుగు నేర్చుకుని చక్కగా మాట్లాడుతుంటే మనం ఎందుకు నేర్చుకోలేమని ఆయన ప్రశ్నించారు. తెలుగు భాష వికాసం కోసం అందరూ కృషి చేయాలని, ముఖ్యంగా సినిమాలలో కూడా పాటలు రాసేవాళ్ళ, సంభాషణలు రాసేవాళ్ల తెలుగులోనే రాయాలని, ఆంగ్ల పదాలు వీలైనంత మేరకు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రపంచంలో 600భాషలు అంతరించాయని లెక్కలు చెబుతున్నాయని వెంకయ్య నాయుడు పేర్కొంటూ ఇలాంటి పరిస్థితి తెలుగు భాషకు రాకుండా చూడాలన్నారు. తెలుగును ప్రేమించు, ప్రోత్సహించు, కాపాడు అని ఆయన పిలుపు నిచ్చారు. మన కట్టు బొట్టు, ఆట పాట యాస, గోస అన్నీ కాపాడుకోవాలన్నారు. మరో ముఖ్య అతిథి మహాసహస్రావధాని, పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలని, అలాగే డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. ఈ సందర్భంగా డా.గరికిపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని కోరినపుడు ఇదే విషయం చెప్పానని అన్నారు. ఈ రెండు పనులు జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదని, అలాగే ఈ రెండు అమలయితే భాషా సంఘంతో పనిలేదని ఆయనఅన్నారు. భాషకోసం అందరూ ఉద్యమించాలన్నారు. ఎల్ కె జి యూకేజీ కాకుండా శిశు బాల కేంద్రాలుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తెలుగు కాకపోతే మరో భాష తీసుకోవచ్చనే అవకాశం ఇవ్వకుండా డిగ్రీ వరకు విధిగా తెలుగు పాఠ్యాంశాలు ఉండి తీరాలన్నారు. నన్నయ దగ్గర నుంచి తెలుగు ప్రముఖులందరినీ కీర్తిస్తూ పద్యాలను ఆయన ఆలపించారు. దీనిలో సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

నా దృష్టిలో తెలుగు మాట్లాడేవాడే వేదపండితుడన్నారు. తెలుగే వేదమురా .. అంటూ గేయం ఆలపించారు. మహాసభలలో పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ సాధాంణంగా ఇలాంటి సభలకు 60ఏళ్ల పైబడినవాళ్ల హాజరవడం చూస్తామని అయితే విద్యార్థులు, యువత మధ్య తెలుగు మహాసభలు జరపడం అభినందనీయం అన్నారు.

**తెలుగు భాషపట్ల ప్రేమతో మహాసభలు...**

తెలుగు భాష పట్ల అపారమైన ప్రేమ ఉన్నందునే ప్రపంచ మహాసభలను ఇక్కడ నిర్వహిస్తున్నామని చైతన్యరాజు అధ్యక్షోపన్యాసంలో అన్నారు. గత ఏడాది జనవరిలో మూడు రోజులపాటు మహాసభలు జరిపి, ఐదు రోజులపాటు శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు జోడించి చేశామని ఆయన గుర్తుచేశారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఇటీవల విజయవాడలో జరిగినపుడు చేసిన తీర్మానాలపై ప్రభుత్వం స్పందించి కొన్ని నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈసారి కృత్రిమ మేథ, సాంకేతికత ఉపయోగించి అయోధ్య రాముని నమూనా ఆలయం ఏర్పాటుచేశామన్నారు. ఈ రెండు రోజుల తెలుగు మహాసభలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వారం - వర్జ్యం

తేది : 09-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
దశమి మ.12.23
భరణి మ.3.06
వర్జ్యం : రా.2.25-3.56
దు.ఉ.10.31-11.16, 2) 2.58-3.43
శుభసమయం: ఉ.8.30-9.00,
సా.4.30-4.40
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కాలాన్ని క్షణం కూడా వృథా చేయకుండా గడుపుతారు. మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

**వృషభం:** మీ శ్రమ అధికారుల మెప్పును పొందటానికి మాత్రం సమయం పడుతుంది.

**మిథునం:** న్యాయపరమైన చిక్కులలో చిక్కుకున్న మీ వారిని రక్షించవలసిన బాధ్యత మీపై పడుతుంది.

**కర్కాటకం:** కొన్ని పనుల విషయంలో ఓర్పు వహించుట చాలా అవసరం. సోదరుల కలయిక.

**సింహం:** పెట్టుబడులకు, పాతవస్తువుల మరమ్మత్తులు సంభవమగును. ధనవ్యయం.

**కన్య :** కనుమరుగైన వస్తువులు దొరికే సూచనలు ఉన్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**తుల :** ఆశించిన ఋణాలు కొంత జాప్యం మీదట లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృశ్చికం:** లోకం పోకడను తెలియజేసే విధంగా ఒక సంఘటన చోటు చేసుకుంటుంది.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యూహాలకు ప్రతివ్యూహాలు అమలుచేస్తారు.

**కుంభం:** జాయింట్ వ్యవహారాలలో వివాహ సంబంధములో అనుకోని వ్యక్తి సహకరిస్తాడు.

**మీనం :** క్రయ విక్రయాలను మునుపటి కన్నా వేగవంతంగా చేస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వైకుంఠద్వార టోకెన్ల కోసం భక్తుల పడిగాపులు



## - 24గంటల ముందే భారీగా తిరుపతికి చేరుకున్న తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు

**తిరుమల, జనవరి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శన టోకెన్ల కోసం నిర్దేశిత సమయంకంటే 24గంటలు ముందుగానే తిరుపతికి భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. గురువారం ఉదయం 5గంటలకు వైకుంఠద్వార దర్శన టోకెన్లు 8ప్రాంతాల్లో 90కౌంటర్లలో 1.20లక్షల టోకెన్లు జారీచేయడానికి ముందే బుధవారం మధ్యాహ్నం 12గంటలకే తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాల నుండి భక్తులు 50వేలమందికిపైగా తిరుపతిలోని ఆయా కేంద్రాల వద్ద తమతమ లగేజీలతో చేరుకున్నారు. తిరుపతినగరంలోని ఇందిరామైదానం, ఎంఆర్‌పల్లిలోని జడ్పీ ఉన్నతపాఠశాల, జీవకోనలోని ఉన్నతపాఠశాల, బైరాగిపట్టెడలోని ఉన్నతపాఠశాల, రామచంద్రపుష్కరిణి కౌంటర్ల వద్ద అశేషసంఖ్యలో భక్తులు రోడ్లపైనే, ఖాళీస్థలాల్లో తిష్టవేశారు. వీళ్ళంతా వారే స్వయంగా వెంట తెచ్చుకున్న భోజనాలు, అల్పాహారం, తాగు నీరుపై ఆధారపడ్డారు. ఇవన్నీ పూర్తిగా ఖాళీచేయడంతో నగరంలోని హోటళ్ళపై ఆధారపడ్డారు. బుధవారం సాయంత్రానికి తిరుపతి నగరంలో బయటినుండి వచ్చిన భక్తులతో కిటకిటగా మారిపోయింది. సాధారణంగా ఆఫ్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శనాలను తొలుత తిరుపతి, తిరుమల, రేణిగుంట, చంద్రగిరి, తిరుపతి రూరల్ వాసులకు కేటాయించడం పరిపాటి. ఈ ఏడాది టిటిడి అధికారులు, పాలకమండలి అత్యుత్సాహంతో సర్వసాధారణంగా అన్ని ప్రాంతాలకు చెందిన భక్తులకు ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బుధవారం ఉదయానికే భారీగా బయటి ప్రాంతాలనుండి భక్తులు తరలిరావడంతో టిటిడి కూడా చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. రోడ్లపైనే భక్తులు తిష్టవేయడంతో ఆ మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. తిరుపతి నగరజనం ఇబ్బందులు తప్పలేదు. గురువారం ఉదయం 5గంటలకు టోకెన్లు జారీచేస్తామని టిటిడి అధికారులు ముందుగానే విస్తృత ప్రచారం చేయడంతో 24గంటల ముందే భక్తులు తరలి వచ్చేశారు. తిరుమల ఆలయంలో వైకుంఠద్వార మోక్షమార్గం తెరచుకోకముందే సామాన్యభక్తులు కష్టాలు తప్పలేదు. తొలినుండి టిటిడి అధికారులు మాత్రం సామాన్యభక్తుల దర్శనాలకు పెద్దపీటవేసు_న్నామని, చిన్నపాటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పినా ఆ ప్రకటనలు బుధవారం మధ్యాహ్నానికే నీరుగారిపోయాయి. పెరిగిన బయటిప్రాంతాలకు చెందిన సామాన్యభక్తుల తాకిడితో తిరుపతినగరం జనసంద్రంగా మారింది. అర్ధరాత్రి వరకు కౌంటర్లవద్దకు భక్తులను అనుమతించకపోవడంతో విపరీతమైన చలికి వణుకుతూ, పస్తులతో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రశాంతమైన వాతావరణం ఉండే తిరుపతి నగరం బయటిప్రాంతాల భక్తుల రణగొణధ్వనులతో హోరెత్తింది. గోవిందమాల భక్తులు, కాలినడక భక్తులు, సామాన్యభక్తులు టోకెన్ల కోసం తంటాలు పడ్డారు. అటు పోలీసులు ఇటు టిటిడి విజిలెన్స్‌సిబ్బంది కూడా భారీగా తరలివచ్చిన భక్తులతో తలలుపట్టుకోవాల్సి వచ్చింది. గురువారం ఉదయం నుండి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియలతో బాటు 12వతేదీకి కూడా టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు జారీచేస్తామని, బుధవారం టోకెన్లు ఇవ్వబోమని టిటిడి అధికారులు అత్యుత్సాహంతో లక్షలాదిరూపాయలు వెచ్చించి ప్రకటనలు గుప్పించారు. అయితే ఈ ప్రకటనలు కేవలం కాగితాల ప్రకటనకే పరిమితమయ్యాయి. భక్తులు ఎవరూ గమనించేపరిస్థితి లేదనేది బుధవారం మధ్యాహ్నానికి తిరుపతిలో జనసంద్రంచేరడంతో తేటతెల్లమైంది.

# రాష్ట్రంలో 10 నుంచి 12 వరకు గోకులాల ప్రారంభోత్సవాలు..

**విజయవాడ జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన గోకులాలను సంక్రాంతి ఉత్సవాల పేరుతో ఈ నెల 10 నుంచి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. 10న కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించే కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. మిగిలిన జిల్లాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో గోకులాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, డ్వామా పథక సంచాలకులకు సూచిస్తూ పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల కోసం గత ఏడాది అక్టోబరు 14నుంచి 20 మధ్య పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల పేరుతో గ్రామ సభలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెల్టర్ల కోసం రాయితీలపై రైతులతో గోకులాలను నిర్మించాలని నిర్ణయించారు.

# తిరుమల సమాచారం

## రేపు తెల్లవారుజామున ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠద్వారాలు!

### - ఉదయం 5గంటల నుండి ప్రముఖులకు స్వామి దర్శనం



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఘడియల సందర్భంగా కలియుగవైకుంఠం ఏడకొండల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారాలు శుక్రవారం వేకువజామున (రేపు)2గంటలకు తెరచుకోనున్నాయి. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాది కార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున 2గంటలకు బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరవనున్నారు. ఆ తరువాత ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు ఏకాంతంగా అభిషేకం నిర్వహించి విశేష ఆభరణాల అలంకరణ చేస్తారు. కైంకర్యాలు ముగిసిన తరువాత రేపు ఉదయం 5గంటల నుండి తిరుమలకు చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, టిటిడి బోర్డు సభ్యులు వారివారి కుటుంబాలతో కలసి వైకుంఠద్వార దర్శనం చేసుకోనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం హారతి లేని లఘుదర్శనం కల్పిస్తారు.

-రేపు స్వర్ణరథం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరధాన్ని అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో భక్తులను కటాక్షించనున్నారు. ఆ తరువాత ఉత్సవమూర్తులు వాహనమండపంలోనే సాయంత్రం 4గంటల వరకు ఉంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

# యువతలో నైపుణ్యాభివృద్ధికి సుజ్లాన్‌తో భాగస్వామ్యం

**విజయవాడ జనవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్ విద్యుత్ రంగంలో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మంత్రి లోకేశ్ నివాసంలో సంస్థ, ప్రభుత్వ ప్రతినిధులు, అవగాహన ఒప్పందం పై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో క్లీన్ ఎనర్జీ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందుతాయి. పవన విద్యుత్ రంగానికి అవసరమైన శిక్షణను ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు అందిస్తాం. కొన్ని ఎంపిక చేసిన కళాశాలల్లో ప్రయోగశాలలు ఏర్పాటుచేస్తాం. విండ్ ఎనర్జీ టెక్నాలజీలో అధునాతన పరిశోధన, ఎక్సలెన్స్ సెంటర్లు అందుబాటులోకి వస్తాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉపాధి పొందేలా గ్లోబల్ సర్టిఫికెట్లను అందిస్తాం. అప్రెంటీస్‌షిప్, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు విద్యార్థులను స్థానిక పరిశ్రమలతో అనుసంధానిస్తాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుజ్లాన్ గ్రూప్ సీఈవో జేపీ చలసాని, సీహెచ్‌ఆర్‌వో రాజేంద్ర మెహతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్, బ్లేడ్ టెక్నాలజీ, సివిల్ వంటి కీలక రంగాల్లో 12వేల మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. గ్రీన్ స్కిల్లింగ్‌కు అనుగుణంగా మానవ అవసరాలు భవిష్యత్తు అభివృద్ధి అంచనాలను డేటా ఆధారంగా స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్ట్ విశ్లేషిస్తుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ నైపుణ్య అవసరాలపై ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు. ఉండవల్లిలోని నివాసంలో ఆ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వనీతి ఇనిషియేటివ్ ట్రస్టీ ఉమా భట్టాచార్య, స్టేట్ కన్సల్టెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

# 'అనితర సాధ్యుడు' సోమనాథుడు

## - అంతరిక్షం, ఆధ్యాత్మికం రెండు కళ్లు

## - శ్రీహరికోట, సూళ్లూరుపేటలతో ఎనలేని అనుబంధం

**శ్రీహరికోట (తడ), జనవరి 8 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధనను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌ది. మూడేళ్ల పదవీ కాలంలో ఆయన రాకెట్ విజ్ఞానంలో రారాజు అనిపించుకున్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని అనితరసాధ్యుడుగా గుర్తింపు పొందారు. 2022 జనవరి 14న అప్పటి ఇస్రో ఛైర్మన్ కె.శివన్ ద్వారా ఎస్.సోమనాథ్ భారత అంతరిక్ష కార్యదర్శి, అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందే కోవిడ్ మహమ్మారి వల్ల ఇస్రో పరిశోధనలు కొంత నత్తనడక నడుస్తున్నాయి. 2020, 2021లలో కేవలం రెండేసి రాకెట్లు మాత్రమే శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. అయితే సోమనాథ్ రావడంతో రాకెట్ ప్రయోగాలు వేగం పుంజుకున్నాయి. ముఖ్యంగా విదేశీ ఉపగ్రహాలను ఎక్కువ సంఖ్యలో శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించారు. కేంద్రప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీతో సన్నిహిత సంబంధాలు సోమనాథ్‌కు కలిసివచ్చాయి. కేరళ రాష్ట్రానికి చెందిన మాథవన్‌నాయర్, కె.రాధాకృష్ణన్‌ల తర్వాత మూడవ శాస్త్రవేత్తగా ఆయన ఇస్రో ఛైర్మన్ అయ్యారు. అంతకుముందు తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేసి పిఎస్‌ఎల్‌వి రాకెట్ల నిర్మాణం,





సమావేశంలో సోమనాథ్

అనుసంధానంలో టీమ్ లీడర్‌గా వ్యవహరించి ఉన్నారు. జిఎస్‌ఎల్‌వి, ఎల్‌విఎం3 వంటి భారీ రాకెట్ల నిర్మాణంలో కూడా కీలకపాత్ర పోషించిన సోమనాథ్.. ఇస్రో ఛైర్మన్‌గా దేశానికి ఎనలేని సేవలు అందించారు. సూర్య, చంద్ర గ్రహాల పరిశోధనలో సోమనాథుడు భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు సాధించిపెట్టారు. చంద్రయాన్-3 ప్రయోగం ప్రపంచంలోనే తొలిసారి చంద్రుని దక్షిణ ధ్రువంపై ఉపగ్రహం కాలుమోపడం వంటి ఘట్టాలతో ఇస్రోతో పాటు సోమనాథ్ పేరు మార్మోగిపోయింది. ఆదిత్య-ఎల్1 పేరుతో సూర్య పరిశోధనలకు ఒక ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించారు. స్మాల్‌శాటిలైట్ లాంచ్ వెహికల్ అనే బుల్లి రాకెట్ల ప్రయోగానికి శ్రీకారంచుట్టి ప్రయోగించారు.

# బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి క్యాపిటల్ ఛైర్మన్ గా మాటూరి రంగనాథ్

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) అమరావతి క్యాపిటల్ సెంటర్ ఛైర్మన్ గా గుడివాడ అమ్మకన్ స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రకటించారు. విజయవాడ వేదికగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. అమరావతి క్యాపిటల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్ సత్యన్నారాయణ, కోశాధికారిగా కెపి కిరణ్, ఉపాధ్యక్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ మాటూరి రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పట్ల సానుకూలంగా ఉండటం పరిశ్రమకు కలిసి వచ్చే అంశంగా మారిందన్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతుల మంజూరు ప్రక్రియ వేగవంతం అయితే భవన నిర్మాతలకు మరింత మేలు కలుగుతుందన్నారు. ఇప్పటికీ కొన్ని సమస్యలు స్థిరాస్తి రంగాన్ని వెంటాడుతున్నాయని, నారెడ్కో, క్రెడాయ్ వంటి ఇతర అసోసియుషన్లతో కలిసి వీటి పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు, మంత్రి నారాయణ ఇప్పటికే స్థిరాస్తి సమస్యల పరిష్కారం కోసం ఎంతో చేస్తున్నారని అభినందించారు.

ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా నూతన సంవత్సరం డైరీని ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

# సామాన్యభక్తుల దర్శనాలకే ప్రాధాన్యత

## - టిక్కెట్లు, టోకెన్లు లేకుంటే ఆలయంలోనికి అనుమతించరు - భక్తులు మాస్కులు ధరించి కొండకు రండి - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వ దినాలతో కలిపి పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు సామాన్యభక్తులకే ప్రాధాన్యతనిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. టిక్కెట్లు, టోకెన్లు లేని భక్తులకు పదిరోజులు దర్శనాలు ఉండవని, తిరుమలకు వచ్చి ఏర్పాట్లు, స్థానిక ఆలయాలు, సందర్శన ప్రాంతాలను దర్శించుకోవచ్చన్నారు. దర్శన టిక్కెట్లు, టోకెన్లు పొందిన భక్తులు నిర్దేశిత రోజు, సమయానికి తిరుమలకు రావాలని విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాల కల్పనపై బుధవారం ఉదయం అన్నమయ్యభవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, పనబాకలక్ష్మి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ శ్రీధర్‌తో కలసి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. రేపు ఉదయం 5గంటలకు వైకుంఠ ఏకాదశిన ప్రముఖులకు బ్రేక్ దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 8గంటలనుండి సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించేలా చూస్తామన్నారు. రేపు ఉదయం స్వర్ణరథం, శనివారం ఉదయం చక్రస్నానమహోత్సవం ఉంటుందన్నారు. అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దుచేశామని, 7లక్షలమందికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తామన్నారు. 2,770సిసికెమెరాలతో తిరుమల అంతటా భద్రత పర్యవేక్షిస్తారన్నారు. ప్రముఖులకు జారీచేసిన దర్శన టిక్కెట్లపైనే పార్కింగ్ సౌకర్యం కూడా సూచించడం జరిగిందన్నారు. ఆ సమయానికి నిర్దేశిత ప్రాంతాలకు చేరుకుని భక్తులు ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం చేసుకోవాలని ఛైర్మన్ నాయుడు కోరారు.

# 170మంది సిబ్బందితో ప్రయాగ్‌రాజ్‌లో శ్రీవారి నమూనా ఆలయంలో సేవలు

## - ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరిన కల్యాణరథం



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభం కానున్న మహాకుంభమేళాలో టిటిడి శ్రీవారి నమూనా ఆలయం నిర్మించిందని, అక్కడ 170మంది సిబ్బందితో ప్రతిరోజూ కైంకర్యాలు జరిపిస్తామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. జనవరి 13నుండి ఫిబ్రవరి 26వరకు మహా కుంభమేళా జరిగే సెక్టార్ 6లో శ్రీవారి నమూనా ఆలయం ఉందన్నారు. అక్కడ స్వామివారికి నిత్యకైంకర్యాలు తిరుమల ఆలయం తరహాలోనే జరుగుతాయన్నారు. ప్రయాగ్‌రాజ్‌కు కల్యాణరథం పంపేందుకు బుధవారం ఉదయం ఆలయం ముందు పూజలు చేసి లాంఛనంగా జండా ఊపారు. జనవరి 18, 26, ఫిబ్రవరి 3, 12తేదీల్లో నాలుగుసార్లు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. టిటిడి నుండి అర్చకులు, వేదపండితులు, వివిధ విభాగాల సిబ్బంది ప్రయాగ్‌రాజ్‌కు వెళతారన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,, జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీథర్, వైఖానస ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, కిరణ్‌దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఖోఖో 'వరల్డ్ కప్' చీఫ్ రిఫరీగా మడకా ప్రసాద్

**గుడివాడ, జనవరి 8 ప్రభాతవార్త** ఖోఖో వరల్డ్ కప్ చీఫ్ రిఫరీగా గుడివాడ పట్టణానికి చెందిన రాష్ట్ర ఖోఖో సంఘం కన్వీనర్ మడకా ప్రసాద్‌ను నియమిస్తూ జాతీయ ఖోఖో సమాఖ్య సంఘం సమాచారం అందించిందని, రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎం.సీతారామిరెడ్డి మాట్లాడుతూ మడకా ప్రసాద్ ఇప్పటికే ఏషియన్, సౌత్ ఏషియన్, జాతీయ క్రీడల్లో ఖోఖో న్యాయ నిర్ణేతగా వ్యవహరిచారని ఆయన తెలిపారు. ఈ నెల 13 నుండి న్యూఢిల్లీలో జరిగే మొట్టమొదటి ఖోఖో అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా నియామకంపై గుడివాడ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు.

# పిఎం 'సూర్యఘర్' పథకంతో 300 యూనిట్ల ఉచిత విద్యుత్

## కోటిమందికి సౌరవిద్యుత్ - బిజిలీ యోజన పథకం ద్వారా విద్యుత్ ఉచితం

**విజయవాడ,జనవరి 8,ప్రభాతవార్తప్రతినిధి:** సౌర విద్యుత్తు వినియోగదారులకు కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం పలురాయితీలను అందించనున్నది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇంధనశాఖ కీలక సమాచారాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా కోటి మంది ప్రజలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా 300 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ పొందవచ్చు. ఇంతకీ ఈ పథకం కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి? సబ్సిడీ ఎలా పొందాలి? అనే విషయాలను గమనిస్తే సౌర విద్యుత్ ను అందరికీ చేరువ చేసి, సుస్థిర ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో కేంద్రం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా మూడు కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది. ఒక్కో కిలోవాట్‌కు రూ.30వేలు సబ్సిడీని కేంద్రం అందిస్తుంది. 2 కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు అయితే రూ.78 వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. అంటే 3 కిలోవాట్ల సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి రూ.1.45 లక్షలు ఖర్చయితే అందులో కేంద్ర ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు అవసరం లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చు. నెలకు 150 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి 1 నుంచి 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని సూర్యఘర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. 150 నుంచి 300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2 నుంచి 3 కిలోవాట్ల సామర్థం కలిగిన ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 300 యూనిట్లకు పైబడి కరెంట్ ను వినియోగించే వారు మూడు కిలోవాట్, ఆ పైబడి సామర్థం కలిగిన సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. మూడు కిలోవాట్లకు మించి సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నా గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తారు. మిగులు కరెంట్ కావాలంటే నెట్‌మీటరింగ్ ద్వారా విక్రయించుకోవచ్చు సూర్యఘర్ వెబ్‌సైట్ ప్రకారం 1 కిలోవాట్‌కు దాదాపు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రస్తుత వినియోగం ప్రకారం నెలకు రూ.1000 కరెంట్ బిల్లు వస్తుంది. అదే సోలార్ వ్యవస్థ ఏర్పాటు వల్ల అయ్యే ఖర్చు రూ.338 మాత్రమే అవుతుంది. దీంతో సంవత్సరానికి రూ.8వేలు ఆదా అవుతుంది. అదే నెలకు 240 యూనిట్లు వినియోగించే వారికైతే నెలకు రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తుందనుకుంటే, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు వల్ల రూ.333 మాత్రమే ఖర్చవుతుంది. ఈ పథకంలో రాదల్చిన వారు పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో పేరును రిజిస్టర్ చేసుకోండి. ఇందుకోసం మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని సెలెక్ట్ చేసుకోవాలి. ఆపై మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నెంబరు, మొబైల్ నెంబరు, ఈమెయిల్ ఐడీని ఎంటర్ చేయండి. ఇప్పుడు కన్స్యూమర్ నెంబర్, మొబైల్ నంబర్‌తో సైట్ లలాగిన్ అవ్వాలి.

# తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలి

## - తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు



**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని తెలంగాణా మంత్రి శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణా ప్రజలు నూతన సంవత్సరంలో ఆనందంగా ఉండాలని కోరారు.

# ఇఎస్ఐ ఆసుపత్రులకు సూపర్ స్పెషాలిటీ హోదా

## మంత్రి వాసంశెట్టి సుభాష్

**విజయువాడ.జనవరి8.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నాలుగు ఈ.ఎస్.ఐ ఆసుపత్రుల ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ కార్మిక, ఫ్యాక్టరీల, బాయిలర్లు బీమా వైద్యశాఖ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు ఏపీ కార్మిక శాఖ లేబర్ . ఐ.ఎం.ఎస్ డిపార్ట్మెంట్‌ల సమీక్షా సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 14.5 లక్షలుగా ఉన్న బీమా కార్మికుల సంఖ్యను 25 లక్షలు పెరిగే విధంగా కార్మిక శాఖతో సమన్వయం చేసుకొవాలన్నారు. ఈ సంఖ్య పెరిగే విధంగా చూడాలన్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి ఈఎస్ఐ హాస్పిటల్స్ లను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ గా అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం ఉన్న హాస్పిటల్స్ డిస్పెన్సరీలు డయాగ్నోస్టిక్ సెంటర్లను పూర్తిస్థాయిలో పనిచేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అవసరమైన సిబ్బందిని, పరికరాలు సమకూర్చటంలో తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలి. ఈ.ఎస్.ఐ.సి అందించే పనులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఎక్కువ ప్రయోజనం పొందుటకు అవసరమైన ప్రతిపాదనలు రెడీ చేయాలి అని సూచించారు. తనిఖీ అధికారులు లేకపోవడం వల్ల ఫ్యాక్టరీలలో, షాపుల్లో పనిచేయు కార్మికులకు ఈఎస్ఐ కార్డ్స్ నమోదు చేయలేకపోతున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల తణుకులో అక్కడి ఎంఎల్ఏ, మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడులో హాస్పిటల్స్ ఏర్పాటు చేయమని కోరారు. దానికి అవసరమైన ప్రతిపాదనలు పరిశీలించి నాకు అందజేయాలని తెలిపారు.



# రైల్వే పర్సనల్ విభాగం అధికారుల బదలీలు

## - గుంతకల్లు డిఎంగా హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్

**గుంతకల్లు రైల్వే,జనవరి 8,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే పర్సనల్ విభాగంలో పనిచేస్తున్న పలువురు అధికారులను స్థానచలనం కల్పిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జీఎం డిప్యూటీ కార్యదర్శిగా పనిచేస్తున్న హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్‌ను గుంతకల్లు డిపిఓగా బదిలీ చేశారు. పర్సనల్, జనరల్ విజిలెన్స్ అధికారిగా పనిచేస్తున్న బి శ్రీనివాసరావును జీఎం డిప్యూటీ కార్యదర్శిగా నియమించారు. నాందేడ్ డివిజన్‌లో ఏపిఓగా పనిచేస్తున్న సోపాన్ విశ్వనాథ్ ఫాడేను విజయవాడ డివిజన్‌లో ఏపిఓ ట్రాఫిక్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎం అనిరూధ్‌ను నాందేడ్ డివిజన్‌లో ఎపిఓగా నియమించారు.

# సాంకేతిక ఆధారంగా వ్యర్థాలు వేరుచేస్తాం

## - కొంతభాగం వ్యర్థాలతో ఎరువు తయారీ: టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుమల,జనవరి 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై గత దశాబ్ధకాలంగా ప్రోగైన వ్యర్థాల నిల్వచేసే డంపింగ్‌యార్డును బుధవారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తనిఖీ చేశారు. భారతప్రభుత్వ మాజీ సైంటిఫిక్ సలహాదారుడు జి.సతీశ్‌రెడ్డితో కలసి ఛైర్మన్ కాకులకొండ వద్ద డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఇక్కడ భారీగా నిల్వఉన్న వ్యర్థాలను

వేరుచేసి తరలించడంపై దృష్టి పెడతామన్నారు .ముందుగా కొంత వ్యర్థాలను ల్యాబ్‌కు పంపి తనిఖీ చేస్తామన్నారు. ఈ వ్యర్థాలను కొంతభాగం ఎరుగు చేస్తామని, మిగిలిన దాన్ని ఇక్కడ నుండి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

9-01pg6exHMNWJQE.qxdo/p:9-01pg6exHMNWJQE.qxd 1/1/02 7:53 AM Page 1



# తెలుగు రాష్ట్రాల్లో రూ.5,718కోట్లతో పూర్తయిన రైల్వే అభివృద్ధి పనులను జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

- మరో రూ.5,562కోట్లతో చేపట్టనున్న రైల్వే పనులకు శంకుస్థాపనలు



**గుంతకల్లు రైల్వే,జనవరి 8,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలో పూర్తి అయిన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో పాటు మరికొన్ని రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బుధవారం విశాఖపట్నంలోని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ రూ.11.270కోట్ల భారీ రైల్వే ప్రాజెక్టులను శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించారు. కేంద్రమంత్రి కింజరావు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత తదితరుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలోని గుత్తి-ధర్మవరంల మధ్య రూ.998కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 90.20కి.మీల డబ్లింగ్ రైలు మార్గంతో పాటు గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలోని గిద్దలూరు- దిగువమెట్టల మధ్య రూ.108కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 12కి.మీల డబ్లింగ్ రైలు మార్గాన్ని, విజయవాడ- గుడివాడ- భీమవరం-నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం-భీమవరం-నిడదవోలు స్టేషన్ల మధ్య రూ.4,162కోట్ల వ్యయంతో పూర్తి చేసిన 221కి.మీ డబ్లింగ్ రైలు మార్గాలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అలాగే బెంగళూరు- సికింద్రాబాద్ ప్రధాన రైలు మార్గంలో రూ.352కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 29.225కి.మీ గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ రైలు మార్గంతో పాటు సికింద్రాబాద్-డోన్ ప్రధాన రైలు మార్గంలో అంచనావ్యయంతో రూ.2,208కోట్ల అంచనా వ్యయంతో డోన్-మహబూబ్‌నగర్‌ల మధ్య 196.80కి.మీ డబ్లింగ్, విద్యుత్ రైలు మార్గానికి రూ.2,853కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న గుంటూరు-బీబీనగర్‌ల మధ్య 239కి.మీ డబ్లింగ్ రైలు మార్గాలతో పాటు రూ.149కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న విశాక కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణంతో పాటు గంగవరం పోర్టు- విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, దువ్వాడ-సింహాచలం, విశాఖపట్నం-గోపాలపట్నం, మూడవ ,నాల్గవ రైలు మార్గాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, అధ్యక్షురాలు పురందేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భేటీ

కడప, రాయచోటిలో టన్నెల్ ఏర్పాటుకు సర్వం సిద్ధం



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి భేటీ

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రధాన జాతీయ రహదారుల నిర్మాణానికి, అనుసంధానికి, నిర్దిష్ట వ్యవధిలో వాటిని పూర్తి చేయడానికి కేంద్రం ప్రభుత్వం అంగీకరించిందని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో ఆయన నివాసంలో కలసి సుమారు 45 నిమిషాల పాటు సమావేశమై పలు రవాణా అంశాలపై చర్చించారు. రోడ్డు భద్రతా ప్రమాదల నివారణ లో భాగంగా కడప రాయచోటిలో 4 కిలోమీటర్ల టన్నెల్ ఏర్పాటుకు సర్వం సిద్ధం కాగా ఇటీవల సమగ్ర నివేదిక కేంద్ర రవాణా బృందంసిద్ధం చేసిందని, నాలుగు లైన్ల టన్నెల్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం రూపంలో సహకారం అందివ్వాలని మంత్రి రాంప్రసాద్ కోరారు. అందులో భాగంగా రాయచోటి లో సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్షన్ నిధుల ద్వారా రోడ్ల విస్తరణ గ్రామాల మండలాల కేంద్రాల, జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనెక్టివిటీ సులువుతరం చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఎన్ హెచ్ నేషనల్ హైవేస్ లాజిక్ మేనేజ్మెంట్ ప్రాజెక్టును ఆమోదించి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని, కడప నుండి రాయచోటి వరకు 4 లైన్ల రహదారిని మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు., రాజంపేట రాయచోటి కదిరి రహదారి రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా మెరుగుపరిచేందుకు శాఖపరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రిని రవాణా శాఖ మంత్రి కోరారు. దీనిపట్ల కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు స్పందిస్తూ రాష్ట్ర రవాణా అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎపి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భేటీ తరువాత మీడియాతో మాట్లాడుతూ కడప నుండి రాయచోటి వరకు 4 లేన్ల రహదారిని మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రమంతి నితిన్ గడ్కరిని కోం.నాలుగు లైన్ల టన్నెల్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తామని కేంద్రమంత్రి తెలిపారు. ఈ భేటీ అంశాలను రాజంపేట రాయచోటి కదిరి రహదారి రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. రాయచోటిలో రోడ్ల విస్తరణ గ్రామాలు, మండల కేంద్రాలు మరియు జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనెక్టివిటీని సులభతరం చేసేందుకు. సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధుల ద్వారా పనులకు.. .. అనుమతులు కోరిన మంత్రి.

# నైరుతిలో రైలు మార్గం పనులు!

- గోవా వెళ్లే రైళ్లు హుబ్లీ వరకే

**గుంతకల్లు రైల్వే,జనవరి 8,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి గోవా వెళ్ళే రైళ్ళు ఏప్రిల్ వరకు హుబ్లీ వరకు మాత్రమే నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ క్యాజల్ రాక్-కూలెం స్టేషన్ల మధ్య 26కి.మీలు రైలు మార్గం మార్పిడికి సంబంధించిన పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నందున ఇప్పటికే షాలిమార్-వాస్కోడిగామా-షాలిమార్ మధ్య తిరిగే నెంబర్ 18047/48 అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను హుబ్లీ- వాస్కోడిగామాల-హుబ్లీ మధ్య పాక్షికంగా రద్దు చేసిన రైల్వే శాఖ, తాజాగా తిరుపతి/హైదరాబాద్ నుంచి వాస్కోడిగామా వెళ్లేనెంబర్ 17419/17021లింక్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 16నుంచి ఏప్రిల్ 10వరకు అలాగే వాస్కోడిగామా నుంచి తిరుపతి/హైదరాబాద్‌ల మధ్య తిరిగే నెంబర్ 17420/17022 లింక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17నుంచి ఏప్రిల్ 11వరకు హుబ్లీ- వాస్కోడిగామా- హుబ్లీ మద య పాక్షికంగా రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామా వెళ్లే నెంబర్ 17039బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17నుంచి ఏప్రిల్ 16వరకు, వాస్కోడిగామా నుంచి సికింద్రా బాద్ వెళ్లే నెంబర్ 17040బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను 18నుంచి ఏప్రిల్ 17వరకు వాస్కోడిగామా- హుబ్లీ-వాస్కోడిగామాల

# హైకోర్టులో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఊరట

- జగన్‌కు పాస్‌పోర్ట్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించిన హైకోర్టు



**విజయవాడ, జనవరి 8, ప్రభాత వార్త ప్రతినిధి:** ఏపీ హైకోర్టు లో మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఊరట దక్కింది. 5 ఏళ్ల వ్యవధికి జగన్‌కు పాస్‌పోర్ట్ మంజూరు చేయాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా గతంలో ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. 2024 ఆగస్టులో వైఎస్ జగన్ తన కుమార్తెల పుట్టినరోజు కోసం విదేశాలకు వెళ్లేందుకు రెగ్యులర్ పాస్‌పోర్టు జారీ చేయాల్సిందిగా కోర్టును ఆశ్రయించారు. అయితే, దీనిపై విచారించిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తోసిపుచ్చింది. 5 ఏళ్ళకి పాస్‌పోర్టు మంజూరు చేయాలని అందుకు ఎన్వోసీని ఇవ్వాలని ప్రజా ప్రతినిధుల కోర్టును జగన్ మోహన్ రెడ్డి ఆశ్రయించారు. పాస్ పోర్ట్ మంజూరు చేయాలంటే 20వేల పూచీకత్తుతో పాటు ప్రత్యక్షం హాజరుకావాలని వైఎస్ జగన్‌కి గతంలోనే ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన సోమవారం వైఎస్ జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యక్షంగా హాజరుకావాలని 20వేల పూచీకత్తు సమర్పించాలని విజయవాడ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దాంతో వైఎస్ జగన్‌కు ఊరట దక్కింది. ఐదేళ్ల పాస్‌పోర్టు జారీకి నిరంభ్యంతర పత్రాన్ని కూడా ఇవ్వాలని ఆదేశించింది. అంతకుముందు ఐదేళ్ల కాలానికి పాస్‌పోర్టు ఇవ్వాలని సీబీఐ కోర్టు ఆదేశించగా, ఆ కోర్టు ఉత్తర్వులపై ప్రజాప్రతినిధుల కోర్టు స్టే విధించింది. ఇందులో ఏడాది రెన్యువల్ చేసేందుకు మాత్రమే అంగీకరించింది. అందులో కొన్ని షరతులు కూడా పెట్టింది. రూ. 20 వేల రూపాయల పూచీకత్తు సమర్పించాలని కోర్టు సూచించింది. తాజాగా ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పును ఏపీ హైకోర్టు కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో విదేశాలకు వెళ్లేందుకు ఆయన పాస్‌పోర్టు రెన్యువల్ కోసం అభ్యర్థించారు. ఐదేళ్లకు రెన్యువల్ చేయాల్సిందిగా సీబీఐ కోర్టు ఆదేశాలను జత చేశారు. ఆ కేసులో ఎన్‌వోసీ తీసుకురావాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలోనే జగన్ విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కానీ, విజయవాడ కోర్టు జగన్ పిటిషన్ కొట్టేసింది. కేవలం ఒక ఏడాది మాత్రమే రెన్యువల్ చేసుకునేందుకు అంగీకరించింది. రూ. 20వేల పూచీకత్తు ప్రత్యక్షంగా హాజరై ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

# అక్షరానికి అంతం లేదు, భాషలు కనుమరుగు కావు

## విజయవాడ అక్షర జాతరలో ఆలరిస్తున్న విజ్ఞాన పొత్తాలు

**విజయవాడ.జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ పుస్తకాల ప్రదర్శన ఉత్సవం జాతరలాగా సాగుతుంది. సృజనాత్మక శక్తులను పెంపొందించే అభ్యుదయ రచనలు, సైన్స్, కథలు, గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలు, కథలు, కళలు, పిల్లల కథలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలెన్నో విజయవాడ పుస్తకమహోత్సవంలో సాక్షాత్కరించాయి. పుస్తకాలు అక్షరాలు అద్దిన కాగితాల సంపుటి కాదు, ప్రపంచాన్ని మస్తిష్కానికి సాక్షాత్కరింపచేసే ఓ హస్తభూషణమన్నట్లు ప్రతి పొత్తంలో పట్టలేనంత జ్ఞాన సంపదను అందిపుచ్చుకుంటున్నాం. ఈ ఉత్సవాలపై పలువురు ప్రచురణ కర్తల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. ఈ పుస్తక ఉత్సవాలు ఈ ఏడాది ఆశజనంగా ఉన్నాయి. చూసేవారు కాక కొనేవారు బాగున్నారని తెలిపారు. సంస్థ ద్వారా ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లోని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లోని లైబ్రరీలకు పుస్తకాలను సరఫరా చేస్తున్నామని హిమాన్షు పబ్లికేషన్స్ ముదిలి శ్రీనివాసరావు తెలిపారు. పుస్తకాల పట్ల అయితే భాష పరిపుష్టం కావటానికి పుస్తక పఠనం నిరంతరం అవసరం. పుస్తక మహోత్సవంలో అనేక మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలకు ఉపయోగపడే ఎన్నో కార్యక్రమాలు చేయించే పుస్తకాలు ఉన్నాయని అధ్యక్షులు, ఎస్ఆర్. పరిమి వ్యాఖ్యానించారు. ఈ ఏడాది 270 స్టాళ్లతో ఈ ఏడాది నిర్వహించటం సంతోషంగా ఉంది. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తక ప్రియులు వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరుతున్నామని విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీతెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విజయవాడలో గత కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవ కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తుండటం అభినంద నీయమన్నారు. విజయవాడ, విశాఖపట్టణంలలో మాత్రమే కాకుండా పట్టణాలకు కూడా పుస్తక మహోత్సవాన్ని తీసుకెళ్లాల్సిందిగా నిర్వాహకులకు మనవి చేసారు. విజయవాడ అక్షరం అంతం కాదు. భాషలు కనుమరుగు కావు. సాహిత్యం ఎప్పుడూ చిరస్థాయిగా నిలుస్తుంది. పాఠకులు మెచ్చేలా మంచి సాహిత్యాన్ని అందించేందుకు మా వంతుగా ముద్రణల ద్వారా కృషి చేస్తున్నాం. సాంకేతికత, సాంకేతిక విప్లవం ద్వారా భాషలు కనుమరుగు కావు. సాంకేతికతను ఉపయోగించుకుంటూనే పుస్తకాభిలాషను కొనసాగించాలి. మేము ఇలా పుస్తకాలను చదివే ఈ స్థాయికి వచ్చాం.

# ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**సచివాలయం,జనవరి 8,ప్రభాతవార్త :** ఈనెల 9,10తేదీల్లో (నేడు, రేపు) ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరవుతున్నారు. కేంద్ర విదేశీ వ్యవహార శాఖమంత్రి ఎస్. జైశంకర్ రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుదుని రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఈ సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఆహ్వానం మేరకు రాష్ట్రప్ర భుత్వం తరపున ప్రవాసాం ధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను రాష్ట్రప్ర భుత్వం తరపున సమావేశంలో పాల్గొనాల్సిందిగా ముఖ్య మంత్రి ఆదేశించారు. సమావేశంలో పాల్గొనే నిమిత్తం మంత్రి శ్రీనివాస్ ఈరోజు రాత్రి విజయనగరం నుండి బయలుదేరి భువనేశ్వర్ వెళుతున్నారు. రేపు ఉదయం ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే "ప్రవాస భారతీయ దివస్" కార్యక్రమం రెండు రోజులు పాటు జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసించే భారతీయమూలాలున్న వారందర్నీ ఏకం చేయడంతో పాటు, ఆయా దేశాల్లో భారతీయ సంతతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి తగిన పరిష్కారం కనుగొనడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న ప్రవాస భారతీయ ప్రముఖులు పలువురు ఈ సమావేశాల్లో హాజరవుతారు. వివిధ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్ళడం తోపాటు, భారతీయ సంతతిలో విదేశాల్లో ఎక్కువగా నివసించే ప్రవాసాంధ్రులను ఏకతాటిపై తెచ్చేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు. ఇంతటి ప్రాముఖ్యత గల ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమంలో రా ష్ట్రప్రభుత్వం తరపున తనకు పాల్గొనే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

## మావోయిస్టుల నుంచి ముప్పు ఉందన్న సమాచారంతో

# సీఎం ప్రత్యేక సెక్యూరిటీ దళంలో మార్పులు

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుభద్రతలో మార్పులు చేశారు. మావోయిస్టుల నుంచి ముప్పు ఉన్నదనే సమాచార నేపథ్యంలో ప్రత్యేక సెక్యూరిటీ దళంలో మార్పులు జరిగాయి. సీఎం భద్రతా వలయంలోకి కౌంటర్ యాక్షన్ బృందాలు చేరాయి. ఎన్ఎస్‌జీ, ఎస్ఎస్‌జీ, స్థానిక సాయుధ బలగాలకు అదనంగా ఆరుగురు కమాండోలతో కౌంటర్ యాక్షన్ టీంను ఏర్పాటు చేశారు. ఎస్పీజీ ఆధ్వర్యంలో కౌంటర్ యాక్షన్ టీంకు శిక్షణ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు భద్రతా వలయంలో కౌంటర్ యాక్షన్ టీంలు రంగ ప్రవేశం చేశారు. దేశంలో బ్లాక్ క్యాట్ కమాండోలు, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న అతికొద్ది మంది వ్యక్తుల్లో చంద్రబాబు ఒకరు. తిరుపతిలోని అలిపిరి వద్ద ఆయనపై నక్సల్స్ దాడి చేసిన తర్వాత ఆయనకు ఎన్ఎస్‌జీ బ్లాక్ క్యాట్ కమాండోలు వచ్చారు. ఈ బ్లాక్ క్యాట్ కమాండోలతో పాటు చంద్రబాబుకు భద్రతా వలయం కూడా ఎప్పుడూ కూడా కట్టుదిట్టంగా ఉంటుంది. చంద్రబాబుపై దాడి చేయడానికి వచ్చిన వారిని, బాబుకు అపాయం తలపెట్టడానికి వచ్చిన వారిని ఎదుర్కోవడంలో కౌంటర్ యాక్షన్ టీంకు శిక్షణ ఇచ్చారు. మొదటి రెండు బృందాలు ఏదైనా దాడి జరిగితే చంద్రబాబును సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు. మూడో బృందంగా ఉండే కౌంటర్ యాక్షన్ టీం మాత్రం.. దాడికి వచ్చిన వారిని తదముట్టించే వరకు వదిలే ప్రసక్తే ఉండదు. ఆ మేరకు కౌంటర్ యాక్షన్ టీంకు శిక్షణ ఇచ్చారు. స్పెషల్ సెక్యూటిరిటీ గ్రూప్‌కు చెందిన ఈ కమాండోలు విదేశాలకు, దేశంలో వివిధ అత్యుత్తమ శిక్షణ ఇచ్చే కేంద్రాలకు వెళ్లి వీరికి శిక్షణ ఇప్పించి.. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడుకు భద్రత కల్పించే టీంలో వీరిని రంగప్రవేశం చేయించారు. వారం నుంచి చంద్రబాబుకు ఈ కమాండోలు భద్రతగా ఉన్నప్పటికీ నిన్నటి నుంచి అధికారికంగా కౌంటర్ యాక్షన్ టీంను ముఖ్యమంత్రి భద్రతా వలయంలో చేర్చారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2019 నుంచి 2024 వరకు పలు మార్లు దాడులు జరిగిన సమయంలో కూడా ఎన్ఎస్‌జీ కమాండోల సంఖ్యను పెంచారు. ముందు ఆరుగురు కమాండోలు ఉండగా.. చంద్రబాబు బయటకు వెళ్లే సమయంలో ఆ సంఖ్యను 12కు చేశారు. వీరు నిత్యం కంటికిరెప్పలా చంద్రబాబును కాపాడుతూ ఉండేవారు. అయితే ఇప్పుడు నక్సల్స్ ప్రభావం పెరిగిన నేపథ్యంలో కౌంటర్ యాక్షన్ టీంను రంగంలోకి దింపారు. ఆయనకు భద్రతావలయంలో మొత్తం మూడు వలయాలుగా ఏర్పడి చంద్రబాబుకు రక్షణ కల్పిస్తారు. మొదటి మూడంకెల భద్రతా వలయంలో ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గ్రూప్), రెండవ వలయంలో ఎస్ఎస్‌జీ(స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్) ఉంటారు. చంద్రబాబు వివిధ ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లిన సమయంలో వీరందరికి దూరంలో ఆరుగురు కౌంటర్ యాక్షన్ కమాండోలు ఉంటారు.

# మచిలీపట్నంలో వడ్డీ వ్యాపారి దారుణ హత్య

**విజయవాడ,.జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నంలో ఓ వడ్డీ వ్యాపారి హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు పథకం ప్రకారం ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆదేశాల మేరకు హంతకుల కోసం గాలింప చర్యలు చేపట్టిన పోలీసులు. చిలకలపూడి కి చెందిన అడపాల రవి వడ్డీ వ్యాపారం చేస్తూ ఉంటాడు. వారం రోజుల క్రితం రేవతి సెంటర్లో ఓ ముఠాతో రవి ఘర్షణ పడినట్లు తెలుస్తుంది. జరిగిన ఘర్షణలో మృతుడు రవి ప్రత్యర్థ ముఠాలోని ఒకరిని కొట్టగా సదరు ముఠాలోని ముగ్గురు వ్యక్తులు పథకం ప్రకారం మద్యం మత్తులో ఉన్న రవిని మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత వెంబడించి చిలకలపూడి లోని ఆయన ఇంటి ముందే కత్తులతో పొడిచి హతమార్చారు. కత్తిపోటులకు తీవ్రంగా గాయపడిన రవి రక్త శ్రావమవుతుండగా సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని కోరారు. బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రవి మృతి చెందాడు. జరిగిన సంఘటన పై సమాచారం అందుకున్న చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా హంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# ఉమ్మడి కృష్ణా జిల్లాలో పెరగనున్న మద్యం దుకాణాల సంఖ్య

విజయవాడ, జనవరి8, ప్రభాతవార్తప్రతినిధి:ఉమ్మడి కృష్ణా జిల్లాలో మద్యం దుకాణాల సంఖ్య పెరగనుంది. నూతనంగా మరో 25 షాపులు ఏర్పాటు కానున్నాయి. దీనికి సంబంధించి ప్రకటన త్వరలో వెలువడనుంది. కొత్త దుకాణాలను గీత కార్మికులకు కేటాయించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 256 దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113, కృష్ణా జిల్లాలో 123 దుకాణాలు ఉన్నాయి. విజయవాడలో మొత్తం 39, మచిలీపట్నంలో 5 షాపులు ఏర్పాటయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి 58, కృష్ణా జిల్లాలో ఉన్న మండలాల్లోనూ కలిపి 98 షాపులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా విజయవాడలో మూడు ఉన్నాయి. విజయవాడ తూర్పు, పశ్చిమ, భవానీపురం స్టేషన్లు ఉన్నాయి. ఇవి కాకుండా జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, నందిగామ, తిరువూరులో ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. కృష్ణా జిల్లాలో మొత్తం ఎనిమిది స్టేషన్లు ఉన్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, బంటుమిల్లి, గన్నవరం, గుడివాడ, మొవ్వ, నందివాడలో స్టేషన్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు కేటాయించిన షాపులు కాకుండా కల్లు గీత కార్మికులకు కొన్ని షాపులు రిజర్వ్ చేస్తామని ప్రకటించింది. దీని ప్రకారం నూతనంగా 23 షాపులు రానున్నాయి.



శ్రీనివాస్‌గౌడ్ రచించిన అంబపలుకు కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవులు ఖాదర్ మొహిద్దీన్, యాకోబు కవి, సీనియర్ జర్నలిస్టు శాంతిశ్రీ, కవయిత్రి పద్మకళ తదితరులు

# పత్రికల భాషకీ, కవిత్వ భాషకీ తేడా ఉంటుంది

## ఫాసిస్టు విధానాలపై నిరసనను వ్యక్తం చేసే కవిత్వం 'అంబపలుకు'

**విజయవాడ,జనవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** కవిత్వ భాషకు ఎప్పటికప్పుడు తాజాదనాన్ని అద్దుతుంటేనే కవి కొత్త చిగుర్లు తొడుగుతాడని అన్నారు సుప్రసిద్ధ కవి."పుట్టుమచ్చ"ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో చెరుకూరి రామోజీరావు సాహిత్యవేదిక పై మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నిర్వహణలో పి. శ్రీనివాస్ గౌడ్ రాసిన "అంబపలుకు" కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్రికల భాషకీ, కవిత్వ భాషకీ చాలా తేడా వుంటుందన్నారు. కవిత్వ భాషలో ప్రతీ పదానికి చాలా అర్థాలుంటాయన్నారు. అంబపలుకు కవితా సంపుటిలో కవి చాలా సరళమైన భాష వాడారని, అందుకే దీనిని గొప్ప కవిత్వంగా భావిస్తున్నానని అన్నారు. సమీక్షకుడు డా సుంకర గోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి ఆధార్ కార్డు వుండదన్నారు. ఫాసిస్టు విధానాలపై నిరసనను వ్యక్తం చేసే కవిత్వం రాసిన గొప్ప కవి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సభాధ్యక్షులు బండ్ల మాధవరావు మాట్లాడుతూమూఢత్వపు సమాజంపై కవి విసిరిన పంజా అంబపలుకు కవిత్వమని అన్నారు. కవిసంగమం వ్యవస్థాపకులు కవి యాకూబ్ మాట్లాడుతూ ఏ కవిత్వమైనా మనుషుల్ని కలిపేవిధంగా వుండాలి తప్ప విడదీసేదిగా వుండకూడదన్నారు. మానవత్వాన్ని పూజించే కవిత్వానికి స్వాగతం పలుకుతున్నానన్నారు.

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక సంపాదకులు సత్యాజీ మాట్లాడుతూ సమాజాన్ని సరికొత్తగా నిర్మాణం చేసే దిశగా శ్రీనివాస్ గౌడ్ కవిత్వముందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెతీగ కలిమిశ్రీ, సీనియర్ జర్నలిస్టు శాంతిశ్రీ, కవయిత్రి పద్మకళ పాల్గొని మాట్లాడారు. శ్రీనివాస్ గౌడ్ కవిగా స్పందిస్తూ తనకు సహకరించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బి.ఆంజనేయరాజు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# క్షేత్రస్థాయిలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం

## ఖరీఫ్ 2024 కరువు పరిస్థితిపై సమగ్ర వివరాల ఆరా

**అనంతపురం, జనవరి 8 ప్రభాతవార్త బ్యూరో** జిల్లాలో ఖరీఫ్-2024 కరువు పరిస్థితులకు సంబంధించి మొత్తం 112.05 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. అనంతపురం మండలం మన్నీల గ్రామంలో బుధవారం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్‌టీం సభ్యులు అండర్ సెక్రటరీ రూరల్ డెవలప్‌మెంట్ జయంతి కనోజియా, హైదరాబాద్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుసామితో కూడిన బృందం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇందులో ముందుగా మన్నీల గ్రామానికి చేరుకున్న కేంద్ర కరువు బృందానికి జిల్లా కలెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో ఖరీఫ్-2024 కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్రం ప్రదర్శనను బృందం పరిశీలించింది. కరువు పరిస్థితిపై సమగ్ర వివరాలను ఆరా తీయగా వారికి జిల్లాలో నెలకొన్న కరువు పంట నష్టం పరిస్థితులను పరిపూర్ణంగా జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు కూడా వారి శాఖల పరిధిలో జరిగిన పంట నష్టం, ఇతర నష్టాల వివరాలు బృందానికి వివరించారు. అనంతరం మన్నీల గ్రామానికి చెందిన రైతు వన్నప్ప పొలంలో పాడైపోయిన ఆముదం పంటను కేంద్ర కరువు బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రైతుతో బృందం సభ్యులు మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారు ఎంత నష్టం జరిగింది పొలం పక్కన రైతులు ఏ పంటలు సాగు చేశారు. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు వన్నప్ప మాట్లా డుతూ తాను 4.36 ఎకరాల్లో ఆముదం పంట సాగుచేశానని ఎకరానికి 10 నుండి 12 వేల రూపాయలు ఖర్చు అయిందని అంతకుముందు వచ్చిన వర్షం వల్ల జూన్‌లో పంట సాగుచేయగా అనంతరం వర్షాభావంతో పంట పాడైపోయిందని 500 అడుగుల వరకు బోరు వేసినా నీరు పడలేదని ప్రభుత్వ సాయం కొరకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.

అధికారులు మాట్లాడుతూ పంట నష్టం సంబంధించి వివరా లను ప్రభుత్వానికి పంపిoచడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, పశుసంవర్థక, గ్రామీణ, పట్టణ నీటి సరఫరా, డ్వామా శాఖల అధికారులు వారి శాఖల పరిధిలో జరిగిన పంట నష్టాలు ఇతర నష్టాల వివరాల గురించి తెలియచేశారు. ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, పశుసంవర్థక, పట్టణ, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా శాఖల పరిధిలో మొత్తం 112.05 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

ఇందులో వ్యవసాయశాఖ కింద 10.93 కోట్ల రూపాయలు, పశు సంవర్ధకశాఖ కింద 12.15 కోట్ల రూపాయలు, గ్రామీణ నీటి సరఫరా కింద 6.73 కోట్ల రూపాయలు,

పట్టణ నీటి సరఫరా కింద 3.35 కోట్ల రూపాయలు, డ్వామా పరిధిలో 78.89 కోట్ల రూపాయలు మొత్తం 112.05 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లాకు అందించాలన్నారు.

9-1Pg5exN.qxd:9-1Pg5exN.qxd 1/1/02 6:44 AM Page 1



# 'ఆప్'కు బెంగాల్ టిఎంసి మద్దతు



## ఢిల్లీలో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం

**న్యూఢిల్లీ, జనవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీకి మంచి బూస్ట్ లభిస్తోంది. ఇండియా కూటమిలోని కీలక పార్టీలన్నీ ఇపుడు కాంగ్రెస్‌కు కాకుండా ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే సమాజ్‌వాది పార్టీప్రకటించగా ఇపుడు కొత్తగా మమతా బెనర్జీ టిఎంసి కూడా మద్దతుపలికింది. దీనితో ఇపుడు కూటమి పరంగా కాకుండా కాంగ్రెస్‌ఒంటరిగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లోపోటీచేయాల్సి వచ్చింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి టిఎంసి అదినేత్రి మమతా బెనర్జీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీ అయినప్పటికీ టిఎంసి ఆప్‌కే మద్దతిచ్చేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. ఈసందర్భంగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బిజెపితో చేతులు కలుపుతోందని ఢిల్లీలో ఇది బహిరంగ రహస్యమేనన్నారు. ఆప్ టిఎంసి, కాంగ్రెస్, సమాజ్‌వాదిపార్టీలు ఇండియా కూటమిలో భాగస్వాములే. లోక్‌సభ ఎన్నికలను సమిష్టిగా ఎదుర్కొన్నాయి కూడా. మాజీ సిఎం కేజ్రీవాల్ తన సోషల్‌మీడియా పోస్టులో టిఎంసి అధినేత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లో టిఎంసి ఆప్‌కు మద్దతు ప్రకటించిందని, తాను వ్యక్తిగతంగా తన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన పోస్టులో వెల్లడించారు. టిఎంసి తమకు కష్టకాలంలో కూడా అండగా నిలిచిందని మాజీ సిఎం అన్నారు. కొన్ని నిమిషాలకే టిఎంసి రాజ్యసభ ఎంపి డెరెక్ ఓ బ్రెయిన్ స్పందిస్తూ మీవెనుకే మేం ఉన్నాం అంటూ మరోపోస్టు పెట్టారు. సమాజ్‌వాదిపార్టీ అఖిలేష్‌యాదవ్ కూడా ఆప్‌కు ఈ ఎన్నికల్లో మద్దతుప్రకటించారు. దీనిపైనా కేజ్రీవాల్ తన కృతజ్ఞతలు తెలిపారు. నాతోసహా ఢిల్లీప్రజలు, ఆప్ కేడర్ మొత్తం మీకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. టిఎంసి, సమాజ్‌వాదిపార్టీలు 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసాయి. కానీ బోణీ లేదు. టిఎంసి ఎంపి ఒబ్రెయిన్ కేవలం కేజ్రీవాల్‌కే మద్దతు కాదని మొత్తం అందరు ఆప్ అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేసారు.

**ఆప్‌లో చేరిన బిజెపి పూజారి నేతలు!**

దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఒకటికిమించి మరోటి ఎన్నికల హామీలు కురిపిస్తున్నాయి. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎలాంటి హామీలు ఇవ్వకూడదని స్పష్టంచేసినప్పటికీ ఎక్కడా తగ్గేదేలే అన్నట్లుగా అన్నిపార్టీలు హోరాహోరీ ప్రచారాన్ని ముమ్మరం చేసాయి. ఆమ్ ఆద్మీపార్టీనుంచి కేజ్రీవాల్, బిజెపి స్టార్ క్యాంపెయినర్ ప్రధానిమోడీలు హోరాహోరీ ప్రచారం చేస్తున్నారు. ఒకవిడత ప్రచారం పూర్తయింది కూడా ఒకేదశలో ఎన్నికలు జరుగుతున్నందున రాజకీయ పార్టీలుకూడా తమ భవిష్యత్తునిర్ణయించుకునే ఎన్నికలుగా వీటిని పరిగణిస్తున్నాయి.

ఈక్రమంలో పలువురు నాయకులు తమకు నచ్చిన పార్టీలను ఆశ్రయిస్తున్నారు. బిజెపికి చెందిన పండిట్‌ప్రకోష్ఠ్ అంటే పూజారుల విభాగంనుంచి కొందరు ప్రచారకులు, పూజారులు ఆమ్ ఆద్మీపార్టీలోని సనాతన సేవా సమితిలో చేరారు. బిజెపి సనాతన సమితిలోచేరిన బిజెపి పూజారి నేతలు విజయ్‌శర్మ, జితేంద్ర శర్మ, బ్రిజేష్ శర్మ, మనిష్ గుప్తా, దుష్యంత్ శర్మ, ఉదయకాంత్‌ఝాలు తమ పార్టీలోకి రావడం సంతోషకరమని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటిసిఎం మనిష్‌సిసోడియా, సంజయ్‌సింగ్; సౌరభ్‌భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందురోజు ఆప్ అధినేత కేజ్రీవాల్ తన ప్రచారంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే పూజారి గ్రంథి సమ్మాన్ యోజన పథకం ప్రారంభిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. హిందూ దేవాలయాలయ పూజారులకు నెలవారీ 18 వేల భృతిని కల్పిస్తామని పూజారులు, గురుద్వారాల్లోని గ్రంథీలకు కూడా ఈమొత్తం చెల్లిస్తామన్నారు. ఇప్పటివరకూ మేం ఢిల్లీలో ఆరోగ్యపరంగాను, విద్యారంగపరంగా విప్లవసంస్కరణలు తెచ్చామని, ఇపుడు పూజారుల పరంగా మరింతగా విప్లవాత్మక కార్యాచరణ చేపట్టనున్నామని తెలిపారు. బిజెపిలాకాకుండా ఆప్ తానిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని చెప్పారు. ఈపూజారులు మార్గదర్శకాలతోనే తాము రూ.18 వేలు నెలసరి భృతిని ఇస్తామని చెప్పారు. ఫిబ్రవరి ఐదో తేదీ జరిగే ఎన్నికలు ఆప్‌కు అత్యంత ప్రతిష్టాకరంగా మారాయి. మూడోసారి అధికారంలోకి వచ్చిన హ్యాట్రిక్ ఆప్‌గా మారేందుకు ఆప్ తన కార్యాచరణను సిద్ధంచేసుకుంది. ఇందులో భాగంగాన ఇతర పార్టీలు ముఖ్యంగా బిజెపినుంచి ఆప్‌లోకి వచ్చేవారిని స్వాగతిస్తోంది.




# ఢిల్లీప్రజలకు కాంగ్రెస్ జీవన్‌రక్షా యోజన బీమా స్కీం!

**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశరాజధాని ఢిల్లీ ఎన్నికలకు సంబందించిన షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం విడుదలచేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీప్రజలకు ఇపుడు ఎన్నికల హామీలు కురిపిస్తోంది. జీవన్‌రక్ష యోజన అనే పథకం కాంగ్రెస్‌ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్యభీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోత్ బుధవారం ఈపథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నపుడు ఇదే పథకాన్ని అమలు చేసామన్నారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. ఢిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందనిఆయన అన్నారు. ఇప్పటికే ప్యారీ దీదీ యోజన పథకం కింద ప్రతిమహిళకు ప్రతినెలా 2500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# ఆమూడుగ్రామాల్లో ప్రజలకు వారంలోనే బట్టతల

## జుట్టు రాలిపోతుండటంపై ఆరోగ్యశాఖ కలవరం

**బుల్దానా(మహారాష్ట్ర), జనవరి 8:** రాష్ట్రంలోని బుల్దానా జిల్లాలోని మూడు గ్రామాల్లోప్రజలు వట్టిపుణ్యానికి జుట్టురాలిపోతోంది. ఆరోగ్య అధికారులు కలుషిత జలాలు, ఎరువుల వినియోగం అధికం కావడంతోనే జుట్టురాలుతోందని చెపుతున్నారు. గ్రామాల్లోని మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి అదికారులు పరీక్షలకు పంపించారు. అలాగే గ్రామస్తుల చర్మ, జుట్టు నమూనాలుకూడా సేకరించి పరీక్షలకు పంపించారు. బోర్గాంవ్, కల్వాద్, హింగ్నా గ్రామాల్లో మహిళలు, పురుషులు ఇద్దరికీ ఇదేవిదంగా జుట్టు రాలుతోంది. క్రమేపీ ఈ గ్రామాల్లోని పురుషుల జుట్టు రాలిపోతూ వారికి బట్టతల వచ్చేస్తోందని ఆందోలన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కవారంలోనే అందమైన జుట్టుతో ఉన్న తల కాస్తా బట్టతలగా మారుతోందని వాపోతున్నారు. ఈ పరిస్థితిని అద్యయనంచేసేందుకు ఇపుడు రాష్ట్ర అత్యున్నత ఆరోగ్యశాఖ అధికారులు కూడా అక్కడకు వెళ్లారు. 50శాతం ప్రజలకు ఈ సమస్య ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ సమస్య రానురాను మరింతపెరిగేప్రమాదం లేకపోలేదని వైద్యులు చెపుతున్నారు. చర్మం,



జుట్టు నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు.

అలాగే జలకాలుష్యం ఉందేమోనన్న అనుమానంతో నీటి నమూనాలను కూడా సేకరించారు.షేగాంవ్ ఆరోగ్య అధికారి డాక్టర్ దీపాలి రాహేకర్ ఈ బృందంతో కలిసి ఈమూడు గ్రామాలకువెళ్లారు. జలుకాలుష్యం వల్లనే అయి ఉంటుందని ప్రాథమిక అంచనాతో ఉన్నామని, జుట్టురాలడానికి అవకాశాలున్న అన్ని వనరుల నమనాలను సేకరించి పంపించామన్నారు. పరీక్షల ఫలితాలు వస్తే పూర్తి స్థాయిలో చర్యలుచేపట్టే వీలుంటుందని అన్నారు.



# హనీరోజ్‌ను వేధించిన చెమ్మనూర్ అరెస్టు

**తిరువనంతపురం,జనవరి 8:** సినీనటి హనీరోజ్‌ని లైంగికంగా వేధించిన కేసులో కేరళకు చెందినప్రముఖ నగల వ్యాపారి బాబీ చెమ్మనూర్ అరెస్టు అయ్యారు. నటి ఫిర్యాదు అనంతరం కేరళ సర్కారు ఏర్పాటుచేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్‌టీమ్ బుధవారం మధ్యాహ్నం బాబీ చెమ్మనూర్‌ను కస్టడీలోకి తీసుకుంది. హనీరోజ్ ఫిర్యాదుమేరకు కేరళ పోలీసులు ఆయనపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లకింద కేసు నమోదు చేసారు. వాయనాడులో ఉన్న ఆయన్ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వ్యాపారి చెమ్మనూర్ అరెస్టుపై నటి హనీరోజ్ స్పందించారు. ఇది తనకు ఎంతోప్రశాంతమైన రోజని అన్నారు. తాను ఈ అంశాన్ని సిఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లగానే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమెచెప్పారు. 2012లో వచ్చిన త్రివేంద్రమ్ లాడ్జి సినిమాతో మంచి గుర్తింపు పొందిన హనీరోజ్ ఇలాంటి మతిలేని మనుషులగురించి తాను పెద్దగా పట్టించుకోనని, అయితేచెమ్మనూర్ మళ్లీమళ్లీ లైంగికంగా వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసానని చెప్పారు. నాలుగునెలల క్రితం ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. దాంతో తన కుటుంబం అంతా ఆవేదన చెందిందని అన్నారు.

# ఇస్రో నూతన సారధిగా వి.నారాయణన్

## సోమనాథ్ స్థానంలో నియామకం



**శ్రీహరికోట (తడ), జనవరి 8 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నూతన సారధిగా వి.నారాయణన్‌ను కేంద్రప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. రెండేళ్ల పాటు నారాయణన్ అంతరిక్ష శాఖ కార్యదర్శిగాను, అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్‌గాను బాధ్యతలు నిర్వహిస్తారు. వలైమాలలోని లిక్విడ్ ప్రొపల్లెంట్ సిస్టమ్స్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్న వి.నారాయణన్ గత నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాలలో ఇస్రోకు సేవలు అందించారు. తమిళనాడుకు చెందిన నారాయణన్ మహేంద్రగిరిలోని ఎల్‌పిఎస్‌సి సెంటర్‌లో ఎన్నో కీలక పరిశోధనలు చేశారు. ముఖ్యంగా భారీ బాహుబలి రాకెట్‌గా పేరు పొందిన ఎల్‌విఎం3లో సి25 క్రయోజనిక్ దశను అభివృద్ధి చేయడంలో నారాయణన్ పాత్ర ఎంతో ఉంది. జిఎస్‌ఎల్‌వి మార్క్3 ఉపగ్రహ ప్రయోగ వాహక నౌకలు నారాయణన్ ఆధ్వర్యంలో రూపొంది శ్రీహరికోట నుంచి విజయవంతంగా స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించి ఉన్నారు. కొన్ని పిఎస్‌ఎల్‌వి రాకెట్ల రూపకల్పనలోనూ నారాయణన్ పాత్ర ఉంది. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటి నుంచి రజతపతకం, ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి గోల్డ్‌మెడల్‌తో సహా అనేక అవార్డులు పొంది ఉన్నారు. విశిష్ట కెరియర్ ఎన్‌డిఆర్‌ఎస్ నుంచి నేషనల్ డిజైన్ అవార్డు, విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డుకూడా ఖరగ్‌పూర్ వారి ద్వారా అందుకున్నారు. రాకెట్లు, శాటిలైట్ల తయారీలో కీలక పరిశోధనలుచేసి భవిష్యత్ ప్రయోగాలకు ఊపు తెచ్చిన శాస్త్రవేత్తల్లో నారాయణన్ ఒకరు. శ్రీహరికోటలోను ప్రతి రాకెట్‌ప్రయోగ సమయాన ఆయన వచ్చి ప్రయోగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తుంటారు. నారాయణన్ ఇస్రో ఛైర్మన్‌గా ఈ నెల 14న ఎస్.సోమనాథ్‌నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. నారాయణన్ ఆధ్వర్యంలో శ్రీహరికోట నుంచి 100వ రాకెట్ ప్రయోగం ఈ నెల 25న జరపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# గుజరాత్‌లో పెచ్చుమీరిన బిజెపి కుమ్ములాటలు!

**అహ్మదాబాద్, జనవరి 8:** గుజరాత్ బిజెపిలో అంతఃకలహాలు రానురాను తారస్థాయికి చేరుతున్నాయి. రాజ్‌కోట్‌నుంచి వడోదరనుంచి ఇపుడు ఖేడా జిల్లాకు సైతం వ్యాపించాయి. ఖేడా జిల్లా సహకార యూనియన్ ఎన్నికల్లో ఫలితాలు ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. ఈజిల్లాలోని మాతర్ సీటు మాజీ బిజెపి ఎమ్మెల్యే కేసరిసింహ్ సోలంకికి యుద్ధభూమిగా మారింది. స్వతంత్ర అభ్యర్థిగాపోటీచేసిన ఆయన నిర్ణయాత్మకమైన విజయంసాధించారు. బిజెపి మద్దతిచ్చిన అభ్యర్థి ఆయనపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. దీనితో పార్టీ ర్యాంకుల్లోనే అసమ్మతి పెరిగిపోతోందని తెలుస్తోంది. మాతర్ తాలూకాలోని కార్యకర్తలు జిల్లా కేంద్రంలో భారీ నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేసరిసింహ్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్‌చేసారు. అయితేమాజీ ఎమ్మెల్యే కూడా ఇందుకు ధీటుగా కౌంటర్ ఇచ్చారు. నిరసనకారులపై సోషల్ మీడియాలో ధ్వజమెత్తారు. దీనితో ఉద్రిక్తతలు



మరింతపెరిగాయి. స్థానిక రాజకీయాల్లో ఇపుడు బిజెపి అంతర్గత కలహాలు మరింత బయట పడినట్లయింది.

15నిమిషాలపాటు సోషల్‌మీడియాలో మాజీ ఎమ్మెల్యే సోలంకి తనపై చేసిన విమర్శలు అర్థరహితం అన్నారు. రాజీనామాచేస్తామంటున్న వాళ్లు ఎందుకు రాజీనామాచేయడంలేదని ఎదురుప్రశ్నలువేసారు. రాజీనామాచేస్తామని బెదిరించే నాయకులు ఇపుడు జిల్లా బిజెపి అధ్యక్ష స్థానంకోసం ఫారాలు నింపుతున్నారని ఎద్దేవాచేసారు. బిజెపితోప్రమేయంలేకుండా మీరు ఎన్నికల్లో గెలిస్తే నేను జీవితం మొత్తం బిజెపి ఆఫీసులోనే కూర్చుని కార్యకర్తలకు మంచినీళ్లు అందించే సేవలు చేస్తానని సవాల్ చేసారు. మీకు దమ్ముంటే మాతర్ జిల్లాపంచాయితీస్థానానికి తనపై పోటీచేయాలని బిజెపి గుర్తుకాకుండా స్వతంత్రునిగా రావాలని సవాల్‌చేసారు. బిజెపిలో అంతఃకలహాలు ఇపుడేమీ కొత్తకాదు. నగర, తాలూకా, జిల్లా అధ్యక్షుల ఎన్నికల్లోకూడా ఇదే జరిగింది. వదోదరలో రెండు వేరువేరు సంఘటనల్లో బిజెపి నాయకులు బహిరంగంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. దీనికితోడు రాజ్‌కోట్‌లో కూడా నగర బిజెపి అధ్యక్షునికి వ్యతిరేకంగా గ్రూపులన్నీ ఏకం అయ్యాయి. ఇపుడు పార్టీపరంగానే కాకుండా స్థానిక ఎన్నికలపైనా ఈ ప్రభావం పడుతుందని బిజెపి రాష్ట్రకమిటీ కేంద్రానికి సమాచారం ఇచ్చింది.



# నాచిత్రం 'ఎమర్జెన్సీ'ని తప్పకుండా చూడండి

## కాంగ్రెస్ ఎంపి ప్రియాంకకు ఎంపి కంగనా ఆహ్వానం

**ముంబయి, జనవరి 8:** సిమ్లా ఎంపి బాలివుడ్‌నటి కంగనారనౌత్ తాను తీసిన ఎమర్జెన్సీ చిత్రాన్ని చూడాలని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను ఆహ్వానించారు. 1975నుంచి 1977వరకూ జరిగిన పరిణామాల ఆధారంగా ఎమర్జెన్సీ చిత్రం రూపొందించారు. 21నెలల కాలాన్ని ఎంతో అద్భుతంగా సెల్యులాయిడ్‌కు ఎక్కించామని, ప్రియాంక వంటి నేతలు తప్పని సరిగా చూడాల్సిన చిత్రమని కంగనా ఈ సందర్భంగా వ్యాఖ్యలుచేసారు. కంగనా ఈ చిత్రంలో ఇందిరాగాంధీ పాత్రను పోషించారు. ఈనెల 17వ తేదీ ఈచిత్రం దేశవ్యాప్తంగా విడుదలవుతోందన్నారు. ప్రియాంకను తాను పార్లమెంటులో కలిసానని ఎమర్జెన్సీ చిత్రంచూసి తనకు చెప్పాలని కోరినట్లు తెలిపారు. అత్యంత సున్నితమైన సమస్యలో ఉన్న ఒక కీలక మహిళానేత పాత్రను ధరించడం ఎంతో కష్టం అని ఆమె అన్నారు.

అత్యంత హుందాగా తాను ఇందిరాగాంధీ పాత్రను పోషించానని ఆమె హోదాకు తగినట్లుగానే నటించినట్లు ఆమె చెప్పారు. తాను ఈ చిత్రంకోసం రీసెర్చి ప్రారంభించినప్పటినుంచి ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఎంతో తెలిసిందని, ఆమె భర్త, స్నేహితులుతో ఉన్న సంబందాలు కొన్ని వివాదాలమయంగా ఉన్నట్లు కూడా గుర్తించామన్నారు.స్వర్గీయ ఇందిరాగాంధీ జనప్రేమికురాలుకూడా అని ఆమె కితాబునిచ్చారు. మూడుసార్లు ప్రధానమంత్రిగా కొనసాగడం అనేది సామాన్యం కాదని అది ఆమెకే చెల్లిందని కంగనా అన్నారు.

# లైంగిక దాడి భరించలేక తండ్రిని సజీవదహానం చేసిన కూతుళ్లు




**లాహోర్, జనవరి 8:** కన్నతండ్రే కూతుళ్లపై లైంగిక దాడులకు దిగడాన్ని ఇద్దరు మైనర్ కుమార్తెలు తట్టుకోలేక పోయారు. దీనితో కన్నతండ్రిపై పెట్రోలు పోసి నిప్పంటించి సజీవ దహనంచేసారు. పాకిస్థాన్ పంజాబ్‌ప్రావిన్స్‌లోని గుజ్రన్‌వాలా మొఘల్‌చౌక్‌లో ఈ ఘటన జరిగింది. తండ్రి తమపై చేస్తున్న లైంగిక దాడి భరించలేకనే విధిలేక ఈ చర్యలకు దిగామని వారన్నారు. 48 ఏళ్ల అలీ అక్బర్‌కు ముగ్గురు భార్యలు. మొదటి భార్య మరణించగా మిగిలిన ఇద్దరు భార్యలు, పది మంది పిల్లలతోకలిసి అద్దె ఇంట్లోనివసిస్తున్నాడు.

సోమవారం పడుకుని ఉన్న అక్బర్‌పై ఆతని 12, 15 ఏళ్లకుమార్తెలు పెట్రోలు చల్లి నిప్పంటించారు. తీవ్ర గాయాలతో ఆయన ఆసుపత్రిలోచికిత్స పొందుతూ మరణించాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన నాన్నే మాపై లైంగిక దాడి చేస్తున్నాడు. ఇక మా బాధ ఎవరికి చెప్పుకోవాలి. దీనితోవిదిలేని పరిస్థితుల్లో ఆతడిని చంపాలని నిర్ణయించుకున్నామని ఆయన బైక్‌లోని పెట్రోలు తీసి చల్లి తగలబెట్టామని ఆ బాలికలు పోలీసులకు తెలిపారు.

# ఎన్నికలవేళ రాజకీయ పార్టీల్లో శీష్‌మహల్ దుమారం!

**న్యూఢిల్లీ, జనవరి:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఢిల్లీలో రాజకీయ పార్టీల ప్రచారం వేడెకినకంది. ఆప్ బిజెపిలు ఏ వేదికను కూడా వదులుకోకుండా విమర్శలకు దిగుతున్నాయి. ఈ సమయంలో సీఎం బంగ్లా వివాదం రాజకీయంగా దుమారం రేపింది. ఈ బంగ్లాను శీష్‌మహల్‌అంటూ బిజెపిచేస్తున్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. తాజాగా నిజాన్ని చూపిస్తాం అంటూ ఆ పార్టీ సంజయ్‌సింగ్, సౌరభ్‌భరద్వాజ్ మీడియాను తీసుకుని ఆ అధికారిక నివాసం వద్దకువెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు.మంత్రి, ఎంపి అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్‌నేతలు మండిపడానడరు. దాంతో సీఎం నివాసంముందు గందరగోళ వాతావరణం నెలకొంది. అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్‌నేతలకు అనుమతిలేదనిపోలీసులు చెప్పారు. అంతేకాకుండా బారికేడ్లు ఏర్పాటుచేసారు. భారీగా పోలీసులను మొహరించారు. ఎవ్వరినీ లోపలికి అనుమతించొద్దంటూ పైనుంచి ఆదేశాలున్నాయని పోలీసులు తెలిపారు. తర్వాత సింగ్‌తో కొద్దిసేపు ధర్నాకుకూర్చుని ప్రధాని అధికారిక నివాసంఉన్న లోక్‌కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. పీఎం నివాసం సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు.మరోవైపుఆప్‌కు కౌంటర్‌గా బిజెపి ఢిల్లీసీఎం అదికారిక నివాసం వద్దకు వెళ్లింది.

ఢిల్లీలోని 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజ్రీవాల్ సిఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను శీష్‌మహల్‌గా బిజెపి వర్ణిస్తోంది. ప్రజాధనం దుర్వినియోగంచేసి ఆయన సెవెన్‌స్టార్ రిసార్టుగా మార్చుకున్నారని విమర్శించింది. ఇందుకు కౌంటర్‌గా పీఎం నివాసాన్ని రాజ్‌మహల్ అంటూ ఆప్ విమర్శలు చేస్తోంది.

# అమెరికాలో అలాస్కా, మిన్నెసోటా కొనేస్తాం

## ట్రంప్ విలీనం హెచ్చరికలపై ఓంటారియో ప్రీమియర్ ఆఫర్

**ఒంటారియో, జనవరి 8:** అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా విలీనం అవడం మంచిదని అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ చేసిన సూచనకు కెనడా సీనియర్ అధికారి ఒకరు తీవ్ర స్థాయిలో స్పందించారు. అవసరం అనుకుంటే తామే రెండు అమెరికా రాష్ట్రాలను కొనుగోలు చేస్తామని ఆఫర్ ఇచ్చారు. ఆర్థికంగా ఉన్న అన్నివనరులను వినియోగించి అమెరికాలో కెనడా విలీనం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అయితే ఇందుకు సంబంధించి ఓంటారియో ప్రీమియర్ డౌగ్ ఫోర్డ్ తీవ్రంగా స్పందించారు. కెనడాను తీసుకోవాలన్న ధృఢ సంకల్పంతో అమెరికా ఉంటే అందుకు ప్రతిగా తామే అమెరికాలోని రెండు రాష్ట్రాలను కొనుగోలు చేస్తామని ఆఫర్ ఇస్తున్నట్లు తెలిపారు. అలాస్కా, మిన్నెసోటా రాష్ట్రాలు మాకిస్తే కొనేసుకుంటామని అన్నారు. అమెరికా అధ్యక్షుడు జోక్‌గానే చెపుతున్నా తాను మాత్రం సీరియస్‌గా చెపుతున్నానని ఈ ఆఫర్‌కు ఇష్టం అయితే తమకు తెలియజేయాలనికోరారు. ఓపక్క కెనడా ప్రధాని జస్టిన్‌ట్రూడో తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి పార్టీ అధ్యక్షపదవినుంచి కూడా దిగిపోయిన తరుణంలో ఇపుడు ఒంటోరియో ప్రీమియర్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అవసరమైతే ఆర్థిక శక్తివంతమైన వనరులను వినియోగిస్తామని, అమెరికాలో విలీనం అయ్యేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతేకాకుండా మరోపోస్టులో ట్రంప్ ఒక మ్యాప్‌ను పోస్టుచేసారు. ఈ మ్యాప్‌లో కెనడా అమెరికాలో అంతర్భాగంగా ఉందని పేర్కొనడం గమనార్హం.

# ఇకపై దేశీయ విమాన సర్వీసుల నుంచి వాతావరణ సమాచారం

## వాతావరణ శాఖకు విమాన సంస్థల నివేదికలు



**న్యూఢిల్లీ, జనవరి 8:** వాతావరణ సమాచార సేకరణ అంశంపై కేంద్రప్రభుత్వం కొత్తప్రణాళిక రచిస్తోంది. ఇకపై స్వదేశీ విమానాల సాయంతో వాతావరణ పరిస్థితికి సంబందించిన సమాచారాన్ని స్వీకరించాలని నిర్ణయించింది. విమానాలు ఆ డేటాను భారత వాతావరణశాఖతో తప్పనిసరిగా పంచుకునేలా చర్యలుచేపట్టింది. నిత్యం దేశంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న స్వదేశీ విమానాలు వాతావరణ సమాచారాన్ని సేకరిస్తుంటాయి. టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో వాతావరణపరిస్థితిపై కచ్చితమైన సమాచారంతో ప్రయాణిస్తుంటాయి. ఇకపై ఈ సమాచారం విడిగా వాతావరణశాఖతో పంచుకునేలా కేంద్ర ప్రభుత్వం కొత్తప్రణాళికను తెస్తోంది. ముందస్తు వాతావరణసూచనను మరింతగా మెరుగపరిచే అవకాశం ఉంటుందని భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఎం రవిచంద్రన్ అన్నారు.

ప్రస్తుతం దేశంలో విమానసేవలు విస్తరించాయని ప్రతిరాష్ట్రంలో 10నుంచి 15 ఎయిర్ పోర్టులున్నాయని అన్ని దేశీయ విమానయాన సంస్థలు ఈ డేటాను అందించగలిగితే మన సామర్థ్యాలు అంచనాలకు మించి ఉంటాయని అన్నారు. ఈ అంశంపై త్వరలో పౌరవిమానయాన మంత్రిత్వశాఖతోచర్చలు జరుపుతున్నామని ఆయన అన్నారు.

## మకరజ్యోతి ఉత్సవాలు
# విజయవంతం చేయాలి

**మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్**



**నర్సీపట్నం జనవరి, 08, ప్రభాతవార్త**

నర్సీపట్నంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ కోరారు. ఏటా మూడు రోజుల పాటు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి సంబరాల సందర్భంగా బుధవారం రాజేష్ దంపతులు రాట వేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సతవాల్లో భాగంగా రోజూ ఉదయం ఆరు గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 14న మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు విష్ణు సహస్రనామ పారాయణం ఉంటుందని, అవతార్ మోహర్ బాబా, సత్యసాయి బాబా సంకీర్తనలు ఆలపిస్తారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో స్వామి వారి రథయాత్ర ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ గజముఖ నృత్య అకాడమీ వారి క్లాసికల్ నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు కొన్ని విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ప్రముఖులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాజేష్ పేర్కొన్నారు. రాత్రి ఏడు గంటల నుంచి బాలు రైడర్స్ వారిచే డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. దీనిలో జబర్దస్త్ టీం పల్సర్ బైక్ ఝూన్సీ, రమేష్ మాస్టర్ తో పాటు మరికొంతమంతి పాల్గొననున్నట్టు ఆయన వివరించారు. కనుమ రోజు పల్సర్ బైక్ రమణ ఆధ్వర్యంలో రేలారేరేలా డాన్స్ తో పాటు మనిపూర్ స్పెషల్ ఆర్ట్స్ వారిచే ఫోక్ డాన్స్ నిర్వహించనున్నట్టు రాజేష్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకుని, అయ్యప్పస్వామి ఆశీర్వాదాలు పొందాలని రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీలో అద్భుతమైన ఐటీ పాలసీ

**ఎన్నడూ నేనంతగా ఇన్సెంటివ్ లు**

**లోకేష్ రాకతో ఐటీ రంగంలో చిగురిస్తున్న ఆశలు**

**విశాఖ ఐటీ సెజ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఓ నరేష్ కుమార్ వెల్లడి**

**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**

ఏపీలో గత కొంతకాలంగా అనేక ఇబ్బంది ఎదుర్కొంటున్న ఐటీ పరిశ్రమ, ఐటీ శాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ రంగం మళ్ళీ కోలుకుంటుందన్న ఆశలు చిగురుస్తున్నాయని విశాఖ ఐటీ సెజ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఓ నరేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఐటీ శాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అద్భుతమైన ఐటి పాలసీ తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వాలు ఏవి ఇవ్వనంతగా ఈ ప్రభుత్వం ఐటీ పరిశ్రమలకు పెద్ద ఎత్తున ఇన్సెంటివ్ లు ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. ప్రభుత్వ భవనాలలో ఐటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ఐదేళ్లపాటు ఎటువంటి రెంట్ లేకుండా సదరు భవనాన్ని వారు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని నరేష్ కుమార్ తెలియజేశారు. అలాగే ఐటి పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులకు లక్ష యాభై వేల రూపాయల చొప్పున ఇన్సెంటివ్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఆయన తెలియజేశారు. అంతేకాకుండా కొత్తగా ఐటీ కంపెనీ నిర్మించేందుకు ముందుకు వచ్చిన వారికి చదరపు అడుగుకు రెండు వేల రూపాయలు చొప్పున రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇది ఇలా ఉండగా విశాఖలో టి.సి.ఎస్ గూగుల్ కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపిందని, అవసరమైతే మిలీనియంటవర్ ను డీనోటిఫై చేసి అందులో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని నరేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. విశాఖలో డీప్ టెక్ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ టెక్నాలజీ సమ్మెకు ఐటీ రంగానికి చెందిన పలువురు నిపుణులు హాజరవుతున్నారని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యానిమేషన్ తదితర విభాగాలలో వచ్చిన వినూత్న అవకాశాలను విద్యార్థులకు, టెకీలకు వివరించే అవకాశం ఉందని ఆయన అన్నారు. సినిమా పరిశ్రమలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ వినియోగం ద్వారా అనేక అద్భుతాలు సృష్టించవచ్చని, ఈ దిశగా టెక్నాలజీ సమ్మెలో చర్చ జరగాలని నరేష్ కుమార్ సూచించారు.

## ప్రశాంతంగా బల్క్ డ్రగ్స్ వర్చువల్ శంకుస్థాపనకు
# హాజరైన జెసి "జాహ్నవి"



**నక్కపల్లి, జనవరి, 08, ప్రభాతవార్త**

స్నేహితులు అలాగే భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా విశాఖ కేంద్రంగా బుధవారం సాయంత్రం వాచ్యువల్ ల శంకుస్థాపన చేసిన కార్యక్రమం ప్రశాంతంగా మండలంలోని రాజయ్యపేట బోయపాడు మధ్యన జరిగింది. ఆర్డీవో వివి రమణ సారధ్యంలో ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు చేరుకున్నారు ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు ఈ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. భారత ప్రధాని మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు శంకుస్థాపన కార్యక్రమం ప్రసంగిస్తున్న సందర్భంలో పెద్ద ఎత్తున మోడీ నాయకత్వం వర్ధిల్లాలి చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ప్రసంగించిన సందర్భంలో ప్రజలు కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తోపాటు కూటమి నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు. కూటమి నాయకులు తోట నగేష్ ,కొప్పిశెట్టి కొండబాబు ,కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, పాకలపాటి రవివర్మ, పోలినాటి నానాజీ, వెలగ సుధాకర్ ,దేవర సత్యనారాయణ, వైబోయిన వెంకటరమణ మెరుగు నాగేశ్వరరావు, ఆకేటి శాంతి, కొల్లాటి అప్పారావు ఆయా ప్రాంతాల ఎంపిటిసి, సర్పంచులు లతోపాటు పలువురు పాల్గొని కార్యక్రమం వీక్షించారు. ఈ వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా అనకాపల్లి డి.ఎస్.పి ఆధ్వర్యంలో సిఐలు కే. కుమారస్వామి, ఎల్. రామకృష్ణ ,అప్పన్న దగ్గరుండి పర్యవేక్షించారు. తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి పరిస్థితులను పర్యవేక్షిస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించడానికి కష్టపడిన ఆర్డీవో వివి రమణ, తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి, ఎండిఓ దెందుకూరు సీతారామరాజు ,మండల స్థాయి అధికారుల బృందాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అభినందించారు.





విశాఖ విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ .






## మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును మర్యాద పూర్వకంగా కలిసిన లంకవాని పాలెం ప్రజలు



**అనకాపల్లి, జనవరి, 08, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా కె కోటపాడు మండలం లంకవాని పాలెం గ్రామ ప్రజలు మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు, ప్రస్తుత అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి గ్రామంలో తాము అనుభవిస్తున్న సమస్యలపై విన్నవించుకున్నారు. గతంలో తమ సహకారంతో ఎన్నో సమస్యలను అధిగమించామని కానీ ఇప్పుడు అధికారం చేతులు మారడంతో గ్రామంలో కొంతమంది ఆగడాలకు అంతులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. మీరు ఇచ్చిన ధైర్యంతో అదే స్ఫూర్తితో గ్రామ భవిష్యత్తుకు పాటుపడుతున్నామని తెలియచేసారు. బూడి అన్న సానుకూలంగా స్పందించి మరలా వచ్చేది మన ప్రభుత్వమే అని అంతా మంచే జరుగుతుంది అని గ్రామ ప్రజలకు ధైర్యాన్ని అందించారు. అదేవిధంగా జడ్పీటీసీ అనురాధమ్మను కూడా పలకరించారు. వారి యొక్క ఆనంద ఆప్యాయతలకు గ్రామ ప్రజలు సంతోషించారు. ఈ కార్యక్రమంలో లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు,దొరబాబు టీమ్,గ్రామప్రజలు పాల్గొన్నారు.

# రూ2.08 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు..ప్రారంభోత్సవాలు

**విశాఖలో వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ**

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిచ్చిన మోదీ**

**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**

వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు మునుపెన్నడు చూడని అభివృద్ధిని చూడబోతున్నారు. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజువేసే స్థితి నుంచి.. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు క్యూ కట్టే పరిస్థితి ఏర్పడింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉమ్మడి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంద ని చెప్పక తప్పదు. కేంద్రం ఎప్పుడు ఉత్తరాదిపైనే మమకారం చూపిస్తోందని, దక్షిణాదిని విస్తరించిందన్న ఆరోపణకు ప్రధాని మోదీ తెరదించారు. ఏకంగా 2. 08 లక్షల కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టులను ఉత్తరాంధ్రలో నెలకొల్పి దక్షిణాది పట్ల తనకున్న విధేయతను చాటుకున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే 70 లక్షల మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. డబుల్ ఇంజన్ సర్కార్ అంటే ఏమిటో ప్రాక్టికల్ గా చూపించారు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు. విశాఖ వేదికగా బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ 2. 08 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం సమీపంలోని పూడిమడక వద్ద అత్యాధునిక ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. హరిత ఇంధనం, సుస్థిర భవిష్యత్తుకు తొలి అడుగు పడింది. జాతీయ గ్రీన్ హడ్రోజన్ మిషన్ లో భాగంగా ఇదే తొలి గ్రీన్ హైడ్రోజన్ హబ్. ఈ ప్రాజెక్టు పెట్టుబడి దాదాపు రూ. 1,85,000 కోట్లు. 20 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాల్లో పెట్టుబడి ఇందులో భాగం. తద్వారా, రోజుకు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇది దేశంలోని అతిపెద్ద సమీకృత గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా మారింది. దానితోపాటు హరిత మిథనాల్, హరిత యూరియా, పర్యావరణ హిత వైమానిక ఇంధనం సహా రోజుకు 7500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తులను అందించగల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు ప్రధానంగా ఎగుమతి మార్కెట్ ను లక్ష్యంగా పని చేస్తుంది. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యం దిశగా భారత్ కు ఈ ప్రాజెక్టు విశేషంగా సహాయపడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో రూ. 19,500 కోట్ల విలువైన వివిధ రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేయడంతోపాటు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా పలు ఇతర ప్రాజెక్టులతోపాటు విశాఖపట్నంలో దక్షిణ తీర రైల్వే ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఆరోగ్య, రక్షణ సదుపాయాల కల్పనతోపాటు చౌక ధరల్లో వైద్యాన్ని అందించాలన్న ప్రధాని దార్శనికతలో భాగంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో భారీ ఔషధ పార్కుకు ప్రధానమంత్రి మోడీ బుధవారం శంకుస్థాపన చేశారు. దీని ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా, విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, రసాయన, పెట్రోకెమికల్ పెట్టుబడి ప్రాంతానికి సమీపంలో ఉండడం వల్ల ఆర్థిక వృద్ధి వేగవంతం కావడానికి ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ లో భాగంగా తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతానికి ( క్రిస్ సిటీ) కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఇది జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం ద్వారా చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు. పర్యావరణ హిత అధునాతన పారిశ్రామిక నగరంగా ఇది రూపొందనుంది. తయారీ రంగంలో దాదాపు రూ. 10,500 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ ప్రాజెక్టు సిద్ధంగా ఉంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగాలను కల్పిస్తుందని అంచనా. జీవనోపాధిని గణనీయంగా పెంపొందించడంతోపాటు ప్రాంతీయ పురోగతికి ఈ ప్రాజెక్టు చోదకంగా నిలుస్తుంది.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో.. ఇదొక సువర్ణాధ్యాయం

నుంచి రాష్ట్రంలో రూ.2లక్షల కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ గా ప్రధాని మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రతి నెలా రూ.4 వేల కోట్ల లోటు బడ్జెట్ తో ఏపీ ప్రభుత్వం నడుస్తోంది. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆక్సిజన్ అందిస్తున్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ. 12157 కోట్ల కేంద్రం నుంచి సాయం అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతనే భోగాపురం ఎయిర్పోర్టు పనులు వేగవంతం అయ్యాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకోవడానికి మన విజనరీ లీడర్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారు. వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి 5 ఏళ్లు తీసుకున్న గత ప్రభుత్వాన్ని చూసాం. కానీ చంద్రబాబు గారు ఒకే ఒక్క సంతకంతో వెయ్యి రూపాయల పెన్షన్ పెంచారు. మూసేసిన అన్న క్యాంటీన్లు తెరిచాం, దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారు, త్వరలోనే మెగా డీఎస్సి, త్వరలోనే జాబ్ క్యాలెండర్ ఇవ్వబోతున్నారు...దటీజ్ సిబిఎన్. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో ఈరోజు సువర్ణాధ్యాయం.

**వికసిత్ భారత్ స్ఫూర్తితోనే స్వర్ణాంధ్ర 2047**

బ్యూటీఫుల్ సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖపట్నం తరపున గౌరవ ప్రధాని నరేంద్రమోడీజీకి స్వాగతం. ప్రతి భారతీయుడి గుండెల్లో నరేంద్ర మోదీ. మోడీజీ కారణంగా ఈరోజు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. నరేంద్రమోడీ గారు పిఎం అనే పదానికి అర్థాన్ని మార్చేశారు, మామూలుగా పిఎం అంటే ప్రైమ్ మినిస్టర్, నరేంద్ర మోడీజీ పీపుల్స్ మ్యాన్.నరేంద్ర మోదీ జీ విజన్ గ్లోబల్. అయినా అతని హృదయం మాత్రం పేద ప్రజలతోనే ఉంటుంది. నమో అంటే పేదవాడి నమ్మకం, పేదవాడి భరోసా, దేశానికి ధైర్యం. పేదల చిరునవ్వు, మహిళల ఆత్మగౌరవం, యువత భవిత, అన్నదాత కళ్ళలో ఆనందానికి ప్రతిరూపం మోడీజీ. వికసిత్ భారత్ 2047 విజన్ డాక్యుమెంట్ రిలీజ్ చేసి 2047 కి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తయారు చెయ్యాలనే లక్ష్యంతో మోడీజీ పనిచేస్తున్నారు. 2014 నాటికి ప్రపంచంలో 11 వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ నేడు 5 స్థానానికి వచ్చింది. వికసిత్ భారత్ -2047 లక్ష్యంతో టాప్ 1 లేదా 2 ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని మార్చేందుకు మోదీ కృషి చేస్తున్నారు. నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్ఫూర్తి తో మన సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్ రిలీజ్ చేసారు. దిమాక్ ఉన్నవాడు దునియా మొత్తం చూస్తాడు. చంద్రబాబు గారు విజన్ 2020 అంటే ఎంతో మంది నవ్వారు, వెటకారం గా మాట్లాడారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ వెళ్లి చూస్తే ఆయన విజన్ 2020 లో చెప్పిన ప్రతి మాట నిజం అయ్యింది. వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, రెన్యువబుల్ ఎనర్జీ, పోర్ట్స్, ఎయిర్పోర్ట్స్, స్పోర్ట్స్ ఇలా అన్ని రంగాల్లో నిర్ణీత లక్ష్యాలతో ముందుకు వెళ్లడమే స్వర్ణాంధ్ర 2047 ముఖ్యోద్దేశం.

**స్థిరమైన ప్రభుత్వాలు కొనసాగితేనే అభివృద్ధి**

ఈ రోజు చరిత్ర లో నిలిచిపోతుంది. రాష్ట్ర దశదిశ మార్చే ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక విశాఖ రైల్వే జోన్. గత ప్రభుత్వం కనీసం భూమి కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువత విశాఖ రైల్వే జోన్ ట్రాక్ ఎక్కింది. నేడుమోదీజీ దానికి శంకుస్థాపన చేశారు. రూ.1.85లక్షల కోట్లతో పూడిమడకలో ఎన్టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, రూ.1877 కోట్లతో నక్కపల్లి లో బల్క్ డ్రగ్ పార్క్. రూ.10,500 కోట్లతో కృష్ణపట్నం లో పరిశ్రమల ఏర్పాటు, రూ.8016 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు... ఇంకా అనేక కార్యక్రమాలకు మోదీజీ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రజల తరపున నరేంద్ర మోదీజీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్థిరమైన ప్రభుత్వ కొనసాగింపు అభివృద్ధికి చాలా ముఖ్యం. నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాని అయ్యారు. మూడో సారి దేశంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. అందుకే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆలోచించాలి. 2014 - 19 వరకూ ఎన్డీయే ప్రభుత్వం లో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందిందో మీకు తెలుసు. ఆ తరువాత 2019-24 నడుమ జరిగిన విధ్వంసం మీరు కళ్లారా చూసారు. అదే ఎన్ డిఎ ప్రభుత్వం కొనసాగించి ఉంటే రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉండేది కాదు. ఆంధ్రప్రదేశ్ పై మోడీజీ చూపుతున్న ప్రేమ, అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు. ఆంధ్రప్రదేశ్ లోని డబుల్ ఇంజన్ సర్కారు వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తూ, శక్తివంతమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వామ్యం వహించబోతోంది. ఆంధ్రప్రదేశ్ కు మీరు పెద్దన్నలా సహకారం అందించండి. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల సాధనలో మేం భాగస్వాములం అవుతాం. రాష్ట్రాలు బలోపేతమైతేనే జాతి బలంగా తయారవుతుందని నేను నమ్ముతాను. ప్రస్తుతం భారత్ లో నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్ ఎక్కడ చూసినా నమో మేనియా మారుమోగుతోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఐటీకి బీజం వేసింది చంద్రబాబు

**టెక్నాలజీలో ఏపీని ప్రథమ స్థానంలో ఉంచడమే లక్ష్యం**

**విజన్ 2020 పూర్తితో విజన్ 2047 రూపకల్పన**

**ఏ.పీ డిజిటల్ టెక్నాలజీ సదస్సులో ఐటీ శాఖ మంత్రి లోకేష్ వెల్లడి**

**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**



తెలుగు రాష్ట్రాల్లో ఐటీ పరిశ్రమకు బీజం వేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని, ఈ రంగం దినదినాభివృద్ధి చెంది అనేక మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి దోహద పడిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. స్థానిక వీఎమ్ఆర్డిఏ చిల్డ్రన్ ఎరినాలో డీప్టెక్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరగనున్న ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ ను బుధవారం లోకేష్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీని గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హబ్గా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని డిజిటల్ విప్లవం వైపు తీసుకు వెళ్తున్నామని తెలియజేశారు. ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ భవిష్యత్తు టెక్నాలజీ అభివృద్ధికి వేదిక కానుందన్నారు. టెక్నాలజీ మాత్రమే కాదు విజన్ కూడా ఎంతో ముఖ్యమని అప్పుడే మనం అనుకునే లక్ష్యాల్ని సాధించగలమని లోకేష్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2020 లక్ష్యంగా అనేక అద్భుతాలు సృష్టించారని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. అదే స్ఫూర్తితో చంద్రబాబు నాయకత్వంలో స్వర్ణాంధ్ర 2047 వైపు అడుగులు వేస్తున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. ఎన్ఆర్ఐఎఫ్ రాకింగ్లో ఏపీ 9వ స్థానంలో ఉందని దీనిని మూడవ స్థానానికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు

రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి లోకేష్ చెబుతూ కొద్ది నెలల కిందట విజయవాడలో సంభవించిన వరదల సమయంలో డ్రోన్ల ద్వారా వరద బాధితులకు ఆహారాన్ని అందించమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మట్లాడుతూ భవిష్యత్ లో ఏపీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ హబ్ గా మారుతుందని అన్నారు అన్నారు. ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుంది. అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యం. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రోబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఐటీ,ఎలక్ట్రానిక్స్,మెడ్ టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ ఒకే లక్ష్యంతో పని చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. ఆరోగ్య రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనేక మార్పులు తీసుకొచ్చామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా 2047 నాటికి ఏపీని రెండు ట్రిలియన్ డాలర్ల ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి లోకేష్ తెలియజేశారు. 2020 విజన్ భాగంగా చంద్రబాబునాయుడు ఐటీని అభివృద్ధి చేశారు. అప్పుడు నేను స్కూల్ పిల్లాడిని. అయితే ఇప్పుడు విజన్ 2047 లక్ష్యసాధనలో తాను కూడా భాగస్వామ్మి కావడం అదృష్టంగా భావిస్తున్నానని లోకేష్ చెప్పుకొచ్చారు. ఉద్యోగ అవకాశాలు పెంపొందించేందుకు ఇన్నోవేషన్ తో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తామని , అలాగే ఉన్నత విద్యను సంస్కరిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఏపీ ప్రస్తుతం 9వ స్థానంలో ఉంది. దీనిని 3వ స్థానానికి తీసుకువస్తాం. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు సహకారం అందించాలి. విశాఖలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరిస్తామని లోకేష్ తెలియజేశారు. ఇది ఇలా ఉండగా ఏపీ అభివృద్ధికి ప్రధాని ఎంతగానో సహకరిస్తున్నారని మంత్రి లోకేష్ చెప్పారు. రాష్ట్రానికి 2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటే దానికి ప్రధాని మోదీ చొరవే కారణమని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నామని, రాయలసీమలోని అనంతపూర్ కు కియా పరిశ్రమ రావడం ద్వారా తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఆ ప్రాంతం ఉందని అన్నారు.ఇప్పుడు రాయలసీమ గోదావరి జిల్లాలతో పోటీపడుతోంది. కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్ గా తీర్చిదిద్దుతామని చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గా మారుస్తామని పేర్కొన్నారు. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా మారుస్తాం. ఉత్తరాంధ్రకు త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ రాబోతోంది. విశాఖకు డేటా సెంటర్ తీసుకువస్తాం. త్వరలోనే టీసీఎస్ రాబోతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను నెలకొల్పుతాం.

విశాఖ ఎం.పీ శ్రీభరత్ మాట్లాడుతూ ఏపీలో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. సంక్షోభాలనే అవకాశాలుగా మల్చుకుందాం. ఈ ఐదేళ్లు చాలా కీలకం. నూతన ఆవిష్కరణలకు సిద్ధంగా ఉన్నాం. విశాఖను ఐటీ హబ్ గా మార్చేందుకు అవసరమైన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. పరిశోధన రంగాన్ని కూడా మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎన్ఎఫ్ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజుతో పాటు కేడీఈఎమ్ ఛైర్మన్ బీవీ నాయుడు, అలోన్ఓఎస్ కో-ఫౌండర్ సీపీ గుర్నాని, ఎస్టీపీఐ డైరెక్టర్ శ్రీమతి సి.కవిత, ఐటీఏపీపీ ప్రెసిడెంట్ శ్రీమతి లక్ష్మీ ముక్కవిల్లి తదితరులు పాల్గొన్నారు.





**ఏపీలో అద్భుతమైన ఐటీ పాలసీ**

వివరాలు 6లో..



స్థానిక ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు. ప్రధాని మోదీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో సంభాషిస్తున్న దృశ్యం.








# దేశాభివృద్ధిలో.. ఆంధ్రప్రదేశ్‌దే కీలకపాత్ర

- ఏపీ ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరువలేను
- విశాఖ సభలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి






**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**

'ఆంధ్ర ప్రజల ప్రేమ మరియు అభిమానానికి నా కృతజ్ఞతలు. నా అభిమానాన్ని మీమీద చూపించడానికి అవకాశం ఇప్పుడు లభించింది. సింహాచల లక్ష్మీ నరసింహ స్వామికి నా నమస్కారాలు తెలియజేస్తున్నాను.' అంటూ ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మీ ఆశీర్వాదంతో దేశంలో 40 సంవత్సరాల తర్వాత మూడోసారి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోడీ చెప్పారు. 'విశాఖ ప్రజల స్వాగతం చూశాను. 'చంద్రబాబు చెప్పిన విషయాలను గౌరవిస్తూ, రాష్ట్ర ప్రజలు నాపై చూపిన విశ్వాసాన్ని చెక్కుచెదరనీయనని' ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సహకారం అయితేనే దేశం బాగుపడుతుందని, ఆంధ్ర ప్రజలకు సహకారం అందించడమే తమ లక్ష్యం అని మోడీ అన్నారు. 2047 సంవత్సరానికి రెండున్నర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందుకోసం ఆంధ్ర ప్రదేశ్ తో భుజం భుజం కలిపి నడుస్తామని మోడీ చెప్పారు. ఈరోజు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులను శంకుస్థాపన, ప్రారంభత్సవాలు చేశాను. ఇది ఆంధ్రప్రదేశ్ ను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్న ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఏపీలో ఐ.టి అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ ఉన్న నైపుణ్యతతో రాష్ట్రం సర్వతో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందని నమ్మకం తనకు ఉందని ప్రధాని మోదీ చెప్పారు. దేశంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ కి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని భవిష్యత్తులో పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ హబ్ని అభివృద్ధి చేసే ప్రాంతాలలో విశాఖ ఒకటిగా నిలుస్తుంది అని అన్నారు. దేశంలోని మూడు రాష్ట్రాల్లో బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో విశాఖ ఒకటి అని మోదీ పేర్కొన్నారు. వీటి ద్వారా ఈ రంగంలో పరిశోధనలకు అవకాశాలు లభిస్తాయి అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నవయుగ పట్టణీకరణకు కేంద్రంగా ఉండబోతుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేశామని, అలాగే చెన్నై, బెంగళూరు ఇండస్ట్రీ కారిడార్ అభివృద్ధి చేయుట ద్వారా వేల కోట్ల రూపాయల

8లో













## విశాఖకు చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**

విశాఖలో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం తెల్లవారుజామున రైలులో విశాఖకు చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కు రైల్వే స్టేషన్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు



## ప్రశాంతంగా బల్క్ డ్రగ్స్ వర్చువల్ శంకుస్థాపనకు హాజరైన జెసి 'జాహ్నవి'

- మిగతా 6 లో..

## తెలుగు రాష్ట్రాల్లో ఐటీకి బీజం వేసింది చంద్రబాబు

టెక్నాలజీలో ఏపీని ప్రథమ స్థానంలో ఉంచడమే లక్ష్యం

విజన్ 2020 పూర్తితో విజన్ 2047 రూపకల్పన

ఏ.పీ డిజిటల్ టెక్నాలజీ సదస్సులో ఐటీ శాఖ మంత్రి లోకేష్ వెల్లడి

6 లో..



# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో.. ఇదొక సువర్ణాధ్యాయం

రాష్ట్రానికి ఆక్సిజన్ అందిస్తున్న ప్రధాని మోడీజీ!

శక్తివంతమైన భారత్ నిర్మాణంలో భాగస్వాములవుతాం

మోడీ పీపుల్స్ మ్యాన్.... పేదవాడి కళ్లలో వెలుగుకు రూపం

విశాఖపట్నం సభలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్



**విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త**

గత ప్రభుత్వ అసమర్థత వలన వెంటిలేటర్ పైకి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ కు ప్రధాని నరేంద్ర మోడీ ఆక్సిజన్ అందిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ వేదికపై

మిగిలింది 6లో..





## రూ2.08 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

విశాఖలో వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిచ్చిన మోదీ

- వార్త 6లో..



## విశాఖలో ప్రధాని రోడ్ షో

అడుగడుగునా జననేతలకు విశాఖవాసుల నీరాజనాలు

ప్రజలకు అభివాదాలు తెలుపుతూ ముందుకు సాగిన ప్రధాని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి

సిరిపురం నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు కొనసాగిన రోడ్ షో

- వార్త 8లో..







## సీఎం చంద్రబాబుకు విమానాశ్రయంలో వీడ్కోలు

విశాఖలో జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. చంద్రబాబు నాయుడుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్. నగర పోలీస్ కమిషనర్ తో పాటు ఎమ్మెల్యే గణబాబు వీడ్కోలు పలికారు.



ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి ఐఎన్ఎస్ శాఖ విమానాశ్రయం లో స్వాగతం పలుకుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి



# దేశాభివృద్ధిలో ఆంధ్ర ప్రదేశ్ దే కీలక పాత్ర



(మొదటి పేజీ నుంచి)

పెట్టుబడులు రాబోతున్నాయని ప్రధాని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, తయారీ రంగంలో అగ్రగామిగా నిలవాలన్నది తమ ఆకాంక్షని మోడీ పేర్కొన్నారు. ఇందుకు శ్రీ సిటీ ప్రపంచంలోని ఉన్నతమైన ర్యాంకింగ్ సాధించుకొని దేశానికి మొబైల్ తయారీ రంగంలో దిక్సూచిగా నిలవబోతోందని మోడీ చెప్పారు. విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి పునాది వేస్తున్నాం. ప్రత్యేక రైల్వే కావాలన్న డిమాండ్ చాలా రోజుల నుంచి ఈ ప్రాంత వాసులు వినిపిస్తున్నారు. వారి కల ఈరోజు సహకారం అయిందని మోదీ చెప్పారు. ఈ రైల్వే జోన్ రాక వలన ఈ ప్రాంతంలో వ్యవసాయ, ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ లో రైల్వే, రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసాం. ఏపీలో అమృత భారత స్టేషన్ల పథకంలో భాగంగా 70 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని ప్రధాని మోదీ వివరించారు . ఏపీకి 7 వందే భారత్, అమృత భారత రైళ్ళను కూడా కేటాయించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో మౌలిక సదుపాయాల విప్లవం వలన రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుంది. రెండున్నర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు విశాఖపట్నం ఎంత దోహదపడుతుందని మోడీ వివరించారు. సముద్ర సంబంధిత అవకాశాలు వినియోగించుకోవడానికి విశాఖలో ఉన్న ఫిషింగ్ హార్బర్ ని మరింత అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. ఆంధ్రాలో మత్యకారుల వ్యాపారాలు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, మత్స్యకారులకు అనేక సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలోని ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి మేలు జరగాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం పని చేస్తుందని మోడీ వివరించారు.

**నా రాజకీయ జీవితంలో ఇంత గొప్ప కార్యక్రమం ఎప్పుడు చూడలేదు: చంద్రబాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఇంత గొప్ప కార్యక్రమం తాను ఎప్పుడూ చూడలేదని అన్నారు. 'ఇది చారిత్రాత్మకమైన రోజు. రెండు లక్షల 85 వేల కోట్ల రూపాయల వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయటం ఇది నా రాజకీయ చరిత్రలో మొట్ట మొదటిసారిగా చూస్తున్నాను' అని అన్నారు. విశాఖ రైల్వే జోన్ కోసం భూమి అడిగితే ఇవ్వడానికి ఇష్టపడనిది గత ప్రభుత్వం అయితే, తమ ప్రభుత్వం 52 ఎకరాల భూమిని ఇచ్చి రైల్వే జోన్ ఏర్పాటుకు అంకురార్పణ చేసింది అని చెప్పారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ప్రజలకు దగ్గరైన వ్యక్తి నరేంద్ర మోడీ అని చంద్రబాబు కితాబు ఇచ్చారు. నరేంద్ర మోడీ కేవలం ఉత్తరాదికే పరిమితం కాదు.. దేశం మొత్తం మెచ్చుకునే నాయకుడు నరేంద్ర మోడీ అని అన్నారు. భవిష్యత్తులో ఈ పార్టీల కలయిక కొనసాగుతుందని అని చంద్రబాబు స్పష్టం చేశారు. హర్యానా, మహారాష్ట్రలో ఎన్నికలు జరిగే అక్కడ తిరుగులేని మెజార్టీతో ఎన్డీఏ గెలిచిందని ఇది నరేంద్ర మోడీ చరిస్మాని చంద్రబాబు మోడీని కీర్తించారు. ఢిల్లీ ఎన్నికల్లో కూడా నరేంద్ర మోడీ హవా కొనసాగుతుందని చంద్రబాబు జోస్యం చెప్పారు. అభివృద్ధి, సంస్కరణలు,సుపరిపాలన తో నరేంద్ర మోడీ దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నారని అన్నారు. 2029 నాటికి భారతదేశం ప్రగతిలో మూడవ స్థానంలో నిలుస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. విభజన తర్వాత ఏపీకి న్యాయం జరగలేదని భావించిన నరేంద్ర మోడీ ఏపీని బలోపేతం చేయడానికి మోదీ చర్యలు తీసుకున్నారని చంద్రబాబు వివరించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు అనేక యూనివర్సిటీలను రాష్ట్రానికి కేటాయించారని,. రాష్ట్ర పునర్నిర్మాణానికి మోడీ అందించిన సాయం మరువలేనిదని చంద్రబాబు నాయుడు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అన్నిటినీ పూర్తిగా అమలు చేసే బాధ్యతని తాను తీసుకుంటానని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాం అని అన్నారు. విశాఖ, రాష్ట్రానికి ఆర్థిక రాజ్యానికి అవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఫార్మా వంటి అనేక పరిశ్రమలతో పాటు టూరిజం కూడా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామని సీఎం చంద్రబాబు తెలియజేశారు. 'అమరావతి రాజధానికి మీరు శంకుస్థాపన చేశారు. మీ ఆశీస్సులతో అద్భుతమైన, అందమైన రాజధాని నిర్మిస్తా%శీ%. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, నదులను అనుసంధానం చేస్తామ%శీ%' అని చంద్రబాబు వేదికపై నుంచి మోడీకి తెలియజేశారు. దేశం ఒడిదుడుకుల్లో ఉన్న సమయంలో మోడీ ప్రధానమంత్రిగా బాధ్యత స్వీకరించి దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారని అన్నారు. నరేంద్ర మోడీ కేవలం భారత ప్రధాని మాత్రమే కాదని, ఆయన గ్లోబల్ లీడర్ అని కొనియాడారు. విధ్వంస పాలకుల వలన రాష్ట్రం బాగుపడదు. అభివృద్ధిని కాంక్షించే వారిని ప్రభుత్వంలో నిరంతరం కొనసాగేలా ప్రజలు ఆలోచన చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. కేంద్రంలో ఎన్డీఏ, ఏపీలో కూటమి ప్రభుత్వాలు అధికారులు ఉంటేనే డబుల్ ఇంజన్ స్పీడ్ తో అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తామని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ సదాశయం, సత్సంకల్పంతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు ప్రజలతో మమేకమై పనిచేస్తే అది ఆత్మ నిర్భర భారత్ అవుతుంది అని అన్నారు. అదే కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పరిశుభ్రత గురించి తెలియజేస్తూ సాగితే అది స్వచ్ఛభారత్ అవుతుంది. దేశభక్తి చాటి చెప్పుకుంటూ వస్తే బలిష్టమైన భారతదేశం అవుతుంది. ఒక బలమైన భారత్ కోసం నాలుగున్నర దశాబ్దాలుగా పరితపిస్తూ అవమానాలను భరిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ భారతదేశంలోని బలమైన ఆర్థిక శక్తిగా మోడీ నిలబెట్టారని పవన్ కళ్యాణ్ అన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాల ప్రవేశించి రెవెన్యూ మంత్రిగా ఆర్థిక మంత్రిగా మొదలై తెలుగుదేశానికి రథసారథి గా నిలిచి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దార్శినికుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని నమ్మారు.. నిలబడ్డారు అందుకే ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టు మనకు వచ్చాయని అన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడితో ఏర్పాటు అవుతున్న ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా ఏడున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుంది అందుకు మోడీకి పవన్ కళ్యాణ్. ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా అమరావతి రాజధానికి సహకారం, హైవేల నిర్మాణానికి పెట్టుబడులు, రక్షిత మంచినీటి ప్రాజెక్టులు మంజూరు, మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా నరేంద్ర మోడీ రోడ్లు నిర్మాణానికి చొరవ తీసుకున్నారంటే అది చాలా గొప్ప విషయం అని అన్నారు. ఏ రాష్ట్ర, ఏ ప్రాంతం వెనకబడి ఉండకూడదనే ఆలోచనతోనే ఇంత భారీ పెట్టుబడులు ఉత్తరాంధ్రకు ఇచ్చారని పవన్ కళ్యాణ్ అన్నారు. అభివృద్ధికి ఆస్కారమే లేదు అని చెప్పుకునే పరిస్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్రప్రదేశ్ అనే చెప్పే స్థితికి తీసుకొచ్చారు. దీనికి సమర్థవంతమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ రాష్ట్రానికి అండగా మోదీ ఉండటమే కారణమని పవన్ కళ్యాణ్ కొనియాడారు. ప్రధాని మోడీకి దీర్ఘాయుష్ ఇవ్వాలని. లక్ష్మీ నరసింహ స్వామి ఈ దేశాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ న.మో ప్రధాన మంత్రి అర్థం మార్చారు. 'నమో పేదవాళ్లకు విశ్వాసం.. నమో పేదల చిరునవ్వు నమో అన్నదాతల కళ్ళలో ఆనందం. అసమర్థ పాలన వలన రాష్ట్రం విడిపోయింది.అలాంటి సమయంలో మన రాష్ట్రానికి మోడీ ఆక్సిజన్ అందించారని లోకేష్ చెప్పారు. పోలవరంతో సహా అనేక ప్రాజెక్టులకు నిధులు విడుదల చేశారని చెప్పారు. భోగాపురం ఎయిర్పోర్ట్ పనులు వేగవంతం అయ్యాయి. వెయ్యి రూపాయలు పెన్ పెన్షన్ పెంచడానికి గత ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టిందని.. కానీ ఒకే ఒక సంతకంతో చంద్రబాబు వెయ్యి రూపాయలు పెన్షన్ ని పేదలకు అందించారని లోకేష్ తెలియజేశారు . చంద్రబాబు నాయుడు త్వరలో మెగా డీఎస్సీ ప్రకటించబోతున్నార ని చెప్పారు. రాష్ట్ర దశ దిశ మార్చే ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం చేస్తున్నారు. రైల్వే జోన్ కి గత ప్రభుత్వం కేటాయించలేదు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత కు జోన్ రూపకల్పనకు కార్యాచరణ ప్రారంభించిందని లోకేష్ వివరించారు.



# విశాఖలో ప్రధాని రోడ్ షో

**అడుగడుగునా జననేతకు విశాఖవాసుల నీరాజనాలు**



**విశాఖపట్నం, జనవరి 8, ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖలో నిర్వహించిన రోడ్ షో లో విశాఖవాసులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం విశాఖపట్నం చేరుకున్న పీఎం ఐఎన్ఎస్ డేగా నుంచి సాయంత్రం స్థానిక సిరిపురం జంక్షన్ కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రోడ్ షో లో పాల్గొన్నారు. ఈ క్రమంలో ప్రధాని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రజల నుంచి పూల వర్షంతో నీరాజనాలు అందుకున్నారు. సిరిపురం జంక్షన్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు సుమారు కిలో మీటరు మేర భారత ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వాహనంపై నుంచి ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. ఈ రోడ్ షోలో కూటమి నేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కాగా మోదీ.. మోదీ..నామస్మరణతో విశాఖ ప్రాంతం మారుమోగింది. మోదీ, చంద్రబాబు, పవన్ రోడ్ షో పట్ల విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



















## మంత్రి లోకేష్‌ను కలిసిన బుద్ధ

అనకాపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

విశాఖపట్నం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు స్వాగతం పలికారు.

## దళితుల అభ్యున్నతికి రూ.350 కోట్లు

అనకాపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి దళితుల అభ్యున్నతికి రూ.350 కోట్ల మంజూరు చేసిందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం తెలిపారు. తాడేపల్లి మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అధ్యక్షతన సమావేశం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాల కార్పోరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, సంస్థ జనరల్ మేనేజర్ కృష్ణవేణి, 15 మంది డైరెక్టర్లు హాజరయ్యారని తెలిపారు. సమావేశంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి సూచ నలు, సలహాలు చేయడం జరిగిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను జనాభా ప్రాతిపదికన వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. కార్పోరేషన్ల ద్వారా నిరుద్యోగులకు రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగుల జీవనోపాధి నిమిత్తం లబ్ధిదారుల ఎంపిక డైరెక్టర్‌లు సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సమావేశం తీర్మానించిందని నాగభూషణం తెలిపారు.

## సిపిఎం నాయకులపై గృహ నిర్బంధాన్ని ఖండిస్తూ సిపిఎం రాస్తారోకో



అనకాపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా పోలీసులు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా సిపిఎం నాయకులు కార్యకర్తలను అరెస్టులు, గృహ నిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ అనకాపల్లి సిపిఎం ఆధ్వర్యంలో బాటా సెంటర్ వద్ద రాస్తారోకో జరిగింది. దీంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ విదేశాల్లో నిషేధించిన కంపెనీలను అనకాపల్లి జిల్లాకి తీసుకొచ్చి ప్రజల అనారోగ్యానికి భంగం కలిగిస్తుండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఎన్నికల ముందు అక్రమ అరెస్టులు ఉండవని ప్రకటించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి వి శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమా మహేశ్వరరావు, కాళ్ళ తేలయ్యబాబు, పి. చలపతి, బీశెట్టి అప్పారావు, తిర్రే సురేష్, కాపుశెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులతో చర్చించిన ఎమ్మెల్యే సత్యప్రభ

నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



విశాఖలో జరిగే ప్రధానమంత్రి మోడీ సభకు పాయకరావుపేట నియోజకవర్గం నుంచి బయలుదేరే ప్రజలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఏర్పాట్లను టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ చర్చించారు. బుధవారం నక్కపల్లికొచ్చిన ఆమెకు పూర్తిస్థాయిలో వివరాలను తెలియజేశారు. అనంతరం కూటమి నాయకులందరితో మాట్లాడారు ఎవరెవరు బాధ్యతగా ప్రజలు తీసుకు వెళుతున్నారా అందరూ బాధ్యతగా మళ్లీ తీసుకొచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు దేవర సత్యనారాయణ, కర్రి వెంకట సత్యనారాయణ, బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## బస్సులకు జెండా ఊపిన ఎమ్మెల్యే సత్యప్రభ



నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

విశాఖలో జరిగే ప్రధానమంత్రి మోడీ సభకు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజక వర్గం నుంచి ప్రజలతో వెళ్లే వాహనాలకు నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ జెండా ఊపి ప్రారంభించారు. టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, కుర్రందాసు నూకరాజు కొప్పిశెట్టి కొండ బాబు, బుజ్జి, మీగడ సత్యనారాయణమూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, దేవర సత్యనారాయణ, గిం జల లక్ష్మణరావు, కోసూరు శ్రీనివాసరావు, బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవివర్మ, పోలినాటి నానాజీ, జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

## గంటా శ్రీనివాసరావు కలిసిన టీడీపీ నాయకులు

నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



రాష్ట్ర మాజీ మంత్రి భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును విశాఖలోని నక్కపల్లికి చెందిన టిడిపి నాయకులు మీగడ సత్య నారాయణమూర్తి, కర్రి వెంకట సత్యనారాయణ, బీసీ నాయకులు కోసూరు శ్రీనివాసరావు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికిన మీగడ

నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



విశాఖపట్నంలో జరిగిన ప్రధానమంత్రి మోడీ సభకు హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌కు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో టీడీపీ నాయకులు మీగడ సత్య నారాయణమూర్తి స్వాగతం పలికారు. సత్తిబాబును చూసిన పవన్ కళ్యాణ్ బాగున్నావా అంటూ పలకరించారు. ఆయనతోపాటు కర్రీ వెంకట సత్యనారాయణ ఉన్నారు.





నక్కపల్లి గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ సువర్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. భోగిమంటవేసి సంక్రాంతి పర్వదినం ఏ విధంగా జరుపుకోవాలని ఆ విధంగా విద్యార్థులు ఉపాధ్యాయులు సందడి చేసి జరుపుకున్నారు.. (నక్కపల్లి, ప్రభాతవార్త)

## రెల్లి వీధిలో బోరు నిర్మాణం



గొలుగొండ జనవరి 8, ప్రభాతవార్త

గోల్కొండ పంచాయతీ రెల్లి వీధిలో బోరుబావి నిర్మాణ పనులను సర్పంచ్ కసిపల్లి అప్పారావు ప్రారంభించారు. రెండు వీధిలో తాగునీటి కష్టాలు తీరని ఉన్నాయని బోరు నిర్మాణంతో స్థానిక కాలనీవాసులకు చేతి బోరు అందుబాటులో వస్తుందని అన్నారు. గ్రామపంచాయతీ ఎదురు నుండి బోరు నిర్మాణ పనులు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లేటికుర్తి రమేష్, టిడిపి నాయకులు గన్ గండేపల్లి రాము, స్థానిక పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన కూటమి నాయకులు

అనకాపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



ముక్కోటి ఏకాదశి పర్వదిన సందర్భంగా దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాట్లను కూటమి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సకలా గోవిందరావు, దూలం గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాసరావు, సకలా గోవిందరావు మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచినటు వంటి దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదనే ఉద్దేశంతో గౌరవ శాసనసభ్యులు కొణ తాల రామకృష్ణ సూచనలతో ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కార్య నిర్వహణాధికారి టి.రాజ సులోచన మాట్లాడుతూ గురువారం రాత్రి తెల్లవారితే శుక్రవారం అనగా రెండు గంటల 30 నిమిషాలకు స్వామివారి సుప్రభాత సేవ, నిత్యర్చన అనంతరం ఉత్తర ద్వార దర్శనం గుండా అయోధ్య బాలరాముడు దర్శనం జరుగుతుందని తెలిపారు. దేవాలయం ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, పులకండం ప్రసాద్ బాబు, జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## బల్క్ డ్రగ్స్ శంఖుస్థాపన వద్దంటూ పల్లెల్లో నిరసన..

### పోలీసుల అదుపులో వైకాపా, సీపీఎం నాయకులు..



నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

నక్కపల్లి మండలం రాజయ్య పేట ప్రాంతంలో ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం నుండి వర్చ్యువల్‌గా శంఖుస్థాపన చేయడాన్ని నిరశిస్తూ రాజయ్య పేట గ్రామం తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు, ముందుగానే వైకాపా రాష్ట్ర నేత వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుతోపాటు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, సర్పంచ్, ఎంపీటీసీలు ఘంటా తిరుపతి రావు, తల్లా భార్గవ్, సూరకాసుల గోవిందు లతోపాటు పలువురును ముందు నుంచే వారి ఇళ్ల వద్ద నిర్బంధించి స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. ఇది ఇలా ఉండగా పాటిమీద, బోయపాడు, చందనాడ, బుచ్చిరాజు పేట గ్రామాల్లో వైకాపా నాయకులు, సిపిఎం నాయకులు ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. రాజయ్యపేట వద్ద ఆందోళన చేపట్టిన సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్ లను అరెస్టు చేసి పోలీసు వాహనాలపై తీసుకువెళ్ళడానికి పోలీసులు ప్రయత్నం చేయగా ప్రజలు వాహనాలు చుట్టు ముట్టి ముందుకు కదలకుండా అడ్డగించారు, పోలీసులు ఎంత ప్రయత్నించినా ప్రజలు కదలలేదు. ఈ సందర్భంగా పోలీ సులకు, గ్రామస్తులకు కొంతసేపు వాగ్వాదం చోటు



చేసు కుంది. అయినా ప్రజలు సిపిఎం నాయకులను పోలీసులు తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నించగా ఎంత ్సేపు ఆందోళన చోటుచేసుకుంది, పోలీసులు అక్కడి నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కేటేశ్వరరావు, ఆర్.శంకరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇలా ఉండగా రాజయ్య పేట గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు ఎం.మహేష్ బాబు, ఎం.బైరాగిరాజు, ఎం.జాన్‌లను పోలీసులు నిన్నటి నుండి హౌస్ అరెస్టు చేశారు, వెంటనే హౌస్ అరెస్టు చేసిన నాయకులను విడిచి పెట్టాలని



గ్రామస్తులు ఆందోళన చేసి వారిని పోలీసులు వలయం నుండి తీసుకుని వెళ్లి రాజయ్య పేట ఠాగూర్ కాలనీలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, సాగు భూములకు నష్టపరిహారం చెల్లించాలని, డి.ఫారం భూములలో గల చెట్లుకు నష్టపరిహారం చెల్లించాలని, ఫిషింగ్ జెట్టి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కాశీరావు, ఎం.బాపూజీ, జీ.అంజి, ఎం.శివాజీ, సి.హెచ్ తాతాజీ పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## నాటు సారా తయారుకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లపు పులుపులు ధ్వంసం

చోడవరం, జనవరి 8, ప్రభాతవార్త



నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లం పులుపులను వేరు వేరు చోట్ల ఎక్సైజ్ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ ఆదేశాల మేరకు చోడవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వి పాపునాయుడు, ఆధ్వ ర్యంలో బుచ్చయ్యపేట మండలంలో తురకలపూడి గ్రామంలో 400 లీటర్లు బెల్లపు పులుపులను, గొర్లె పాలెం గ్రామంలో 600 లీటర్ల బెల్లపు పులుపులను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో అనకాపల్లి, చోడవరం ఈఎస్ టాస్క్ ఫోర్స్ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతు నాటు సారాయిని తయారు చేస్తున్న వారిని గుర్తించి వారి పైన కేసులు పెట్టి కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతాదన్నారు.

## వైకాపా నాయకులు అరెస్ట్

నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

విశాఖపట్నంలో జరిగే బల్క్ డ్రగ్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ముందస్తు చర్యలో భాగం గా పోలీసులు రాష్ట్ర వైకాపా నేత వీసం రామకృష్ణ తో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వైకాపా నాయకులు గంటా తిరుపతి రావు, సురకాసుల గోవిందు, తల్లా భార్గవ్, చిన్నిలతోపాటు పలువురు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మధ్యాహ్నా వరకు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఉంచిన వారిని పాయకరావుపేట పోలీస్ స్టేషన్కు తరలించారు సభ అనంతరం విడిచిపెట్టారు.






## మకరజ్యోతి ఉత్సవాలు విజయవంతం చేయాలి..



నర్సీపట్నం, జనవరి 8,ప్రభాతవార్త

ఈ నెల 3 నుంచి 15 వరకు నర్సీ పట్నంలో నిర్వహించే అయ్యప్ప మకర జ్యోతి ఉత్సవాలను విజయవంతం చేయా లని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ కోరారు. ఏటా మూడు రోజుల పాటు నిర్వహించే అయ్యప్ప మకరజ్యోతి సంబరాల సందర్భంగా బుధవారం రాజేష్ దంపతులు రాట వేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో భాగంగా 13 నుంచి 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా 13 నుంచి 15 వరకు రోజూ ఉదయం ఆరు గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేశాలు నిర్వహిస్తారన్నారు. 14న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విష్ణు సహస్ర నామ పారాయణం ఉటుందని, అవతార్ మోహర్ బాబా, సత్యసాయి బాబా సంకీర్తనలు ఆలపిస్తార న్నారు. సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలో స్వామి వారి తదయాత్ర ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ గజముఖ నఋత్య అకాడమీ వారిచే క్లాసికల్ నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు కొన్ని విభాగాల్లో ప్రతిభ కనబర్చిన ప్రముఖులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాజేష్ పేర్కొన్నారు.రాత్రి ఏడు గంటల నుంచి బాలు రైడర్స్ వారిచే డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. దీనిలో జబర్దస్త్ టీం పల్సర్ బైక్ ఝాన్సీ, రమేష్ మాస్టర్ తో పాటు మరికొంతమంది పాల్గొననున్నట్టు ఆయన వివరించారు. చివరిగా కనుమ రోజు పల్సర్ బైక్ రమణ ఆధ్వర్యంలో రేలారేలా డాన్స్ పాటు మనపూర్ స్పెషల్ ఆర్ట్స్ వారిచే ఫోక్ డాన్స్ నిర్వహించనున్నట్టు రాజేష్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకుని, అయ్యప్పస్వామి ఆశీర్వా దాలు పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాసంకల్ప వేదిక స్టేట్ జాయింట్ సెక్రటరీగా జిలాని నియామకం

నర్సీపట్నం, జనవరి 8, ప్రభాతవార్త



ప్రజాసంకల్ప వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నర్సీపట్నంకు చెందిన షేక్ జిలానీ నియమితులయ్యారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ ప్రజా సేవ లక్ష్యంగా పని చేస్తానన్నారు. నర్సీపట్నం నియోజకర్గంలో ఏ సమస్యనైనా ముందుండి ఆ సమస్యకు పరిష్కారం చూపేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ (ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షులుగా శివనారాయణరాజు

నర్సీపట్నం, జనవరి 8,ప్రభాతవార్త



ప్రజాస్వామ్య పరిరక్షణ(ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షులుగా కే.శివనారాయణరాజు ఎన్నికయ్యారు. ఈయన ఎన్నిక పట్ల పలువురు హర్షం ప్రకటించారు. ఈ నెల 7వ తేదీన విజయవాడ రైల్వే న్యూక్వార్టర్స్లో జరిగిన ఎన్నికల్లో శివ నారాయణరాజును రాష్ట్ర జనరల్ సెక్రటరీ కేవిఎస్ఎన్. రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. ఈయన నియమకం పట్ల ప్రజాస్వామ్య పరిరక్షణ (ఆర్టీఐ) సభ్యులతో పాటు పట్టణానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. శివనారాయణరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతిపరులపై పోరాటం చేసి నిజాలను వెలికితీస్తామని అన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా కొంత మంది వ్యక్తులు అవినీతికి పాల్పడుతున్నారని, దీనిపై కూడా పోరాటం చేస్తామన్నారు.

## వీధి కుక్కల బారి నుంచి పట్టణ ప్రజలను కాపాడండి..

నర్సీపట్నం, జనవరి 8, ప్రభాతవార్త



వీధి కుక్కల బారి నుంచి నర్సీపట్నం పట్టణ ప్రజ లను కాపాడాలని బీఎస్పీ నర్సీపట్నం నియోజక వర్గ ఇన్చార్జ్ బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లా డారు. ప్రస్తుతం పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందన్నారు. మున్సిపాలిటీలో అనేక చోట్ల వీధి కుక్కలు కురవడంతో సర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో బాధితులు చికిత్స పొందుతున్నారని చెప్పారు. తక్షణమే మున్సిపల్ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, లేకుంటే బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.గంగాధర, చిరంజీవి, మహేష్ పాల్గొన్నారు.

## వైకాపా నాయకులకు సంఘీభావంగా నిలిచిన వైకాపా నాయకులు..



నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త

బల్క్ డ్రగ్స్ శంకుస్థాపనకు సంబంధించిన కార్యక్రమం విషయమై ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేసిన రాష్ట్ర వైకాపా నేత వీసం రామ కృష్ణతోపాటు వైకాపా నాయకులకు పాయక రావుపేట మండలానికి చెందిన వైకాపా నాయకులు సంఘీభావం తెలిపారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచిన వారిని సాయంత్రం విడుదల చేశారు. ఆ సందర్భంలో పాయకరావుపేట జడ్పిటిసి, ఎంపీపీ ఇతర నాయకులు విడుదలైన సందర్భంగా కలిశారు.

## సీనియర్ వైకాపా నాయకుడు గుండెపోటుతో మృతి

నక్కపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



సీనియర్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నక్కపల్లి మేజర్ పంచాయతీ ఐదవ వార్డు సభ్యులు కర్రి బాబ్జి గుండె పోటుతో బుధవారం సాయంత్రం మృతి చెందారు. బాబ్జి మృతి వార్త తెలిసిన వెంటనే నక్కపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీసం రామకృష్ణ ,మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, వీసం శ్రీనివాసరావు ,వార్డు సభ్యులు అల్లాడ కొండబాబు, గొడుగులు బంగారు రాజు చేరుకొని కుటుంబ సభ్యుల ఓదార్చరు. బాబ్జి మృతి పట్ల సర్పంచ్ నేతల జయ రత్నకుమారి, ఈవో మూర్తి, వార్డు సభ్యులు మామిడి వరహాలు, కొలనాటి దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ ఎల్లేటి సత్యనారాయణ, కల్పన టిడిపి నాయకులు కర్రీ వెంకట సత్యనారాయణ ,మీగడ సత్యనారాయణమూర్తి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

### పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్

చింతపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



విధులను నిర్వహించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ అన్నారు. బుధ వారం లోతుగడ్డ, లంబసింగి గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుండి విధులకు గైర్హా జరవుతున్న లోతుగడ్డ పంచాయతీ కార్యదర్శి సి.హెచ్. రవికుమార్‌తో పాటు, పారిశుద్ధ్య నిర్వ హణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన లంబసింగి పంచాయతీ కార్యదర్శి పి.అప్పలరాజుకు శోకాజ్ నోటీసులు జారీ చేయాలని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావును ఆదేశించారు. వారిచ్చే సంజాయిసి సంతృప్తికరంగా లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బందిని నియం త్రించవలసిన పంచాయితీ కార్యదర్శులు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు కార్యాలయ పనివేళలను పాటించాలని, పన్నుల వసూలు, పారిశుధ్యం మెరుగు పరచడం, త్రాగునీటి వనరుల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అలాగే సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు ఆధారంగా జీతభత్యాలను చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి..

పాడేరు,జనవరి8,ప్రభాతవార్త



అల్లూరి జిల్లా ప్రధాన కేంద్రమైన పాడేరు పంచాయతీలో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా, రోడ్డు మార్జిన్లలో నిర్వహిస్తున్న కూరగాయలు దుఖాణాలను రైతు బజార్‌కు తరలించడానికి వ్యాపారులు సహకరించాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశము మేరకు బుధవారం ఉదయం ఈవో ఆర్డీ రమేష్‌తో కలసి రైతు బజార్‌ను సందర్శించారు. వ్యాపారులకు రైతు బజార్‌లో కేటాయించిన షాపులలో మాత్రమే వ్యాపారాలు కొనసాగించాలని కోరారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని స్థానిక రైతు బజార్‌ను గ్రామ పంచాయతీకు అప్పగించినందున రైతు బజార్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు జిల్లా కలెక్టర్‌కి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు తెలిపారు. కొంత మంది కిరాణా వ్యాపారులు వారి దుఖాణాల ముందు కూరగాయలు అమ్మడం వలన తాము నష్ట పోతున్నట్లు పలువురు మహిళా వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ కూడలిలో రోడ్డు మార్జీన్లలో ఎటు వ్యాపారాలకు అనుమతి ఇవ్వవద్దని డివిజనల్ పంచాయతీ అధికారి ఈ.ఓ.ఆర్డి.రమేష్‌ను ఆదేశించారు.

## 19న చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు,జనవరి8,ప్రభాతవార్త

ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతులు నిమిత్తం పలు మండలాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని ఎవియన్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చింతపల్లి సబ్ స్టేషన్‌లో 11కేవీ పెదవలస ఫీడర్ మరమత్తులు నిమిత్తం పెదవలస, సంకాడ, రొంపలు, నిమ్మలపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, జి.మాడుగుల సబ్ స్టేషన్‌లో 11కేవీ నుర్మతి ఫీడర్ మరమత్తులు నిమిత్తం బందవీధి, శింగర్బా, కోరాపల్లి, నుర్మతి,భీరం గ్రామాలకు విద్యుత్ అంతరా యం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించ వలసిందిగా పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు కోరారు.

## నిరుపేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

చింతపల్లి, జనవరి 8, ప్రభాతవార్త




అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీలో తిరుపతికి చెందిన పీపుల్ చారెడ్డి వారి ఆర్థిక సహ కారంతో నర్సీపట్నంకి చెందిన ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేశారు. బుధవారం మండలంలోని లంబసింగి పంచాయతీలు చెరువుల వీనం, యేమెలకొండ, బంటి బయలు, రింగల మెట్ట, భీమనబయలు, చీకటి మామిడి, బోటిబంధ, వాడగడ్డ గ్రామాలకు చెందిన సుమారు 400 మంది గిరిజనులకు దుప్పట్లను అందజేశారు. గిరి గ్రామాలలో గిరిజనులు చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించి దగ్గులకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు తెలియచేశారు. లంబసింగి గ్రామ మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామ పెద్దలు రావుల నూకరాజు, సరమండ నాగరాజు పలువురు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన...

చింతపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



మండలంలోని చిన్న బరద, చింతలూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది. కార్యక్రమాన్ని బుధవారం నిర్వ హించడం జరిగిందని చింతపల్లి వ్యవసాయ అధి కారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహనను, బిందు సేద్యం ఆవశ్యకతను గూర్చి తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే మాదకద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన, గంజాయి పంటకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన, భూసార పరీక్షలు వాటి ప్రాముఖ్యత వ్యవసాయ యంత్ర పరికరాలు పి.ఎం.కిసాన్ జాతీయ ఆహార భద్రత పథకం, ఈ పంట ప్రాముఖ్యతను గూర్చి రైతులకు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

అరకులోయ , జనవరి 8, ప్రభాతవార్త



అరకులోయ ప్రభుత్వ నూతన మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముత్యాల ముగ్గులు, భోగి మంటలు, గొబ్బిళ్ళు, సాంప్రదాయ వేషధారణలతో ముందస్తు సంక్రాంతి సంబరాలు ను ఘనంగా జరుపుకున్నారు. నిత్యం ఏక రూప దుస్తుల్లో కనిపించే అధ్యాపకులు, విద్యార్థినీలు ముందస్తు సంక్రాంతి సంబరాలు సందర్భంగా సాంప్రదాయ దుస్తుల్లో దర్శనమిచ్చారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు, విద్యార్థినీలు ప్రదర్శించిన దింసా నృత్యంతో జత కలిపారు. ఆట, పాటలతో విద్యార్థినీలు ఆనందంగా గడిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రాంగణం ముందస్తు సంక్రాంతి సంబరాలతో సందడి చేసింది. ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. నూతన కళాశాలలో సంక్రాంతి సంబరాలు అందరితో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ సంబరాల్లో దండకారణ్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీను, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓలు వై విజయలక్ష్మి, పి.నాగబాబు, అనిత కుమారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్డెన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్డెన్ వైకుంఠ రావు, అభివృద్ధి కమిటీ ప్రతినిధి బేతా రాజారావు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## జీవనోపాధి మెరుగుకు నైపుణ్య శిక్షణలు..

గూడెంకొత్తవీధి, జనవరి 8, ప్రభాతవార్త



జీవనోపాధి మెరుగుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి శిక్షణలు అందిస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారిణి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. బుధవారం గూడెంకొత్తవీధి మండలంలో కౌమార దశలోనే పాఠశాల నుండి డ్రాప్ అయిన 402 మంది బాలికలను గుర్తించడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 102 మందితో సమావేశం నిర్వహించి వారికి ముందస్తు వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా వివిధ కారణాలతో చదువు మధ్యలోనే మానేసిన విద్యార్థినులకు తిరిగి బడికి వెళ్లాలని ప్రోత్సహించడంతో పాటు వారి జీవనోపాధి మెరుగుకు అవసరమైన శిక్షణలు అందిస్తామని అవగాహన కల్పించారు. వారికి ఆసక్తి ఉన్న రంగాలలోని శిక్షణలు అందిస్తామని ఆమె సూచించారు. అదేవిధంగా నైపుణ్య శిక్షణలు పొంది జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు గల అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మీదేవి మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సిబ్బంది, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

పాడేరు, జనవరి8, ప్రభాతవార్త



గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటిడిఏ పి.ఓ.వి. అభిషేక్ ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఒకే ప్రామాణికా విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పది విద్యార్థుల వంద రోజుల కార్య చరణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని స్పష్టమై ఆదేశాలు జారీ చేసారు. సహాయ గిరిజన సంక్షేమాధికా రులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్తో ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఫార్మాట్, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెల నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిక్ రూంలో ఉంచాలను సూచించారు. అత్యవసరమైతే వెంటనే అసుపత్రికి తరలించి తలిదండ్రు లకు, ఎటిడబ్ల్యూ ఓలకు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థుల తలిదండ్రులకు, గార్డియన్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు కలిగిన వారితో విద్యార్థులను బయటకు పంపించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మూమెంట్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే తలిదండ్రు లను, గార్డియన్లను అనుమతించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో విద్యార్థులను బయటకు పంపించకూడన్నారు. పది విద్యార్థుల పెందరోజుల కార్యచరణ ప్రణాళికను, స్టడీ మెటీరియల్ను విడుదల చేసారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల స్టడీ అవర్ నిర్వహించాలని చెప్పారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యా సామర్థ్యాలు మెరుగు పరచాలని పేర్కొన్నారు. పాఠశాలల పరిసరాల్లో గంజాయి వాసన రాకూడదన్నారు. విద్యార్థులు ఎక్కడైనా గంజాయి వినియోగిస్తే తగిన చర్యలు చేపట్టి కౌన్సిలింగ్ ఇప్పించాలని, తలిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మార్గదర్శిని కార్యక్రమం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఈగల్ ఐజి ఇటీవల ఏజెన్సీలో పెదబయలు మండలంలో పర్యటించి ఎనిమిది ఎకరాల్లో గంజాయి తోటలను ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తు చేసారు. పాఠశాలలు, మండల స్థాయి, ఐటిడిఏ స్థాయిలో గంజాయి నిర్మూలనపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి పండించినా తరలించినా, వినియోగించినా వెంటనే 1972 కాల్ సెంటర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వినియోగించే విద్యార్థులు ఉంటే డి ఎడిక్షన్ సెంటర్కు తరలించి కౌన్సిలింగ్ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డిఇ ఓ పి.బ్రహ్మాజీ రావు, 11 మండలాల ఎటిడబ్ల్యూ ఓలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

పాడేరు,జనవరి8,ప్రభాతవార్త



పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు బుదవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయి మాట్లాడు తూ మన సాంప్రదాయాలను సంస్కృతిని యువతలోకి చేర్చేందుకు ప్రతి సంవత్సరము మన కళాశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించడం ఆనవాతిగా వస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా.టిఎన్ రసూల్ మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు మన సంప్రదాయాలను గుర్తు చేసుకోవడానికి, విద్యార్థులు సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపకరిస్తాయని అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా అందరూ కళాశాలలో భోగి మంట ద్వారా చెడు అలవాట్లను, చెడు ఆలోచనలు వదిలించుకోవాలని ఐక్యూఎసీ కోఆర్డినేటర్ పి కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక వారు విద్యార్థినీ విద్యార్థులకు ముగ్గులు పోటీలు ఫుడ్ ఫెష్ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారులతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అధ్యాపకేత్ర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రాజేంద్రపాలెం పిసా రచ్చ..

కొయ్యూరు, జనవరి 7, ప్రభాతవార్త



మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో పిసా కమిటీ ఎన్నిక రచ్చ కొనసాగుతూనే ఉంది. ఒకరిపై ఒకరు ఆరోపణ ప్రత్యారోపణలతో ఎన్నిక హీట్ మరింత పెరుగుతోంది. ఈ నెల 3న రాజేంద్రపాలెం పిసా కమిటీ ఎన్నిక జరగాల్సి ఉండగా, కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 7న మన రాజేంద్రపాలెం గిరిజన భవన్ వేదికగా ఎన్నిక నిర్వహించే తలపెట్టారు. అయితే మధ్యాహ్నం వరకు పూర్తిగా కోరం లేకపోవడంతో, నిబంధనల ప్రకారం ఇక్కడ పూర్తిగా కమిటీ రద్దు అవుతుంది అని భావిస్తున్న తరుణంలో అక్కడ హాజరైన సభ్యులంతా ఒక ఏకాభిప్రాయానికి వచ్చి ఉపాధ్యక్షుడిగా లోత రవణను ఎన్నుకొని ఇక కార్యదర్శిగా సరుమూర్తి సూరిబాబు, లోతా రాజులు పోటీ పడగా, ఇందులో సరుమూర్తి సూరిబాబును కార్యదర్శిగా ఎన్నుకోగా, లోత రాజును తిరస్కరించారని గ్రామ పెద్దలు నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడెపు లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తను ప్రతిపాదించిన లోత రాజును కార్యదర్శిగా ఎన్నుకో లేదన్న అక్కసుతో, పంచాయతీ సర్పంచ్ పీట సింహాచలం తన అధికార బలంతో ఎన్నికల అధికారిని తప్పుదోవ పట్టించి, ఎన్నికను రద్దు చేయించారని నర్సి కృష్ణ, దిబ్బ కుమారి, గూడపు లక్ష్మణరావు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో ఒకే టీముగా లోత రవణ, తాను ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు పోటీ పడుతుండగా, సర్పంచ్ పీటా సింహాచలం దురుద్దేశపూర్వకంగా లోత రమణను ఉపాధ్యక్షుడుగా ప్రతిపాదించి, తన ప్రస్తావన మాత్రం తేలేదని సరుమూర్తి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాము సోలాబు జోగంపేట నుండి సుమారు 200 మంది గ్రామస్తులను తీసుకు వచ్చినప్పటికీ, పదవులకు పోటీపడుతున్న కొంతమంది కనీస ఓటర్లను తీసుకురాలేకపోవడంతోనే ఎన్నిక రద్దయిందని సోలాబు గ్రామస్తులు, టిడిపి నేత కురుజు శ్రీనుబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద రాజేంద్రపాలెం పిసా ఎన్నిక నిలిచిపోయినప్పటికీ, రచ్చ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## కొండగోకిరి సచివాలయంలో రెవెన్యూ సదస్సు

కొయ్యూరు, జనవరి 7, ప్రభాతవార్త



బుధవారం మండలంలోని కొండగోకిరి గ్రామ సచివాలయంలో కొండ గోకిరి, కిన పర్తి, రత్నంపేట పంచాయతీలకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుండి 93 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆర్ఓఎఫ్ ఆర్‌కు సంబంధించి 26, వెబ్ లాండ్ కు19, కొత్త డిఫారం పట్టాలకోసం18, భూ సమస్యలకు సంబంధించి 6, ఎఫ్ లైన్ 2, కోర్టు కేసులు 3, మోటేషన్లు19 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సదస్సులో సర్పంచులు రేగటి ముసలి నాయుడు, రీమల శ్రీను, డిప్యూటీ తహశీల్దార్ కుమార స్వామి, ఆర్ఎస్ డిటి, అప్పన్న, మండల సర్వేయర్, స్థానిక సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 44 పీసాకమిటీల ఎన్నికలు పూర్తి, 3 పెండింగ్

కొయ్యూరు, జనవరి 7, ప్రభాతవార్త



మండలంలో మొత్తం 47 పీసా కమిటీలకు గాను 44 కమిటీలకు ఎన్నికలు పూర్తయినట్లు, మూడు కమిటీల ఎన్నికలు పెండింగ్లో ఉన్నట్టు ఎంపీడీవో ఎస్కేవి ప్రసాద్ తెలిపారు. పెండింగ్లో రాజేంద్రపాలెం, రేవళ్ల, కినపర్తి కమిటీలు ఉన్నట్టు ఆయన వివరించారు.

**మండలపరిషత్‌లో రివ్యూ మీటింగ్..**

ఇదిలా ఉండగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో ఎస్ కెవి ప్రసాద్ రివ్యూ నిర్వహించారు. పంచాయతీలలో జరుగుతున్న వివిధ సర్వేలు, ఇతరత్రా కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఈ రివ్యూలో ఎంపీడీవో సూచించారు.

## మూడు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలు

రాజవొమ్మంగి, జనవరి 8, ప్రభాతవార్త



బుధవారం చికిలింత పంచాయితీలో గల మూడు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలను నిర్వహించారు. జడ్డంగి పి.హెచ్.సి డా.యామిని ప్రియ 40 మందికి వైద్యపరీక్షలను చేసి మందులను ఇచ్చారు. మంచు, చలిలో తిరిగేటప్పుడు ప్రతీ ఒక్కరూ తగుజాగ్రత్తలను పాటించాలని డా.యామిని ప్రియ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డా.యామినిప్రియ, హెచ్.వి చిన్నయ్యమ్మ, ఏ.ఎన్.యం.సింహాద్రి, యం.ఎల్.హెచ్.పి.మురళి, హెల్త్ అస్సిస్టెంట్ కె. రాజబాబు, 104 డి.ఇ.ఓ శ్రీనివాస్, పైలట్ శివకనకరాజు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.




## 30 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు

రాజవొమ్మంగి, జనవరి 8, ప్రభాతవార్త



ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా బుధ వారం జడ్డంగి పి.హెచ్.సిలో 30 మంది గర్భిణీలకు డా.నాగార్జున వైద్య పరీక్షలను చేసి మందులను.ఇచ్చారు. ప్రసవానికి ముందుగా పి.హెచ్.సిలో చేరి వైద్య సేవలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.నాగార్జున, ఎం.పి.హెచ్. ఇ.ఓ లక్ష్మనరావు, హెచ్.వి.రమణ, స్టాఫ్ నర్స్ సత్య వేణి, ఏ.ఎన్.ఎం.లు నూకాలమ్మ, శేషా రత్నం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. లాగరాయి పి.హెచ్.సిలో 25 మంది గర్భిణీలకు డా.ఉషశ్రీ పరీక్షలు నిర్వహించడం జరిగింది. జనవరి నెలలో జరుగనున్న డెలివరీలను ఇ.డి.డి క్యాలెండరు ద్వారా పరిశీ లించి, సంక్రాంతి పండుగలు సమయంలో ఇ.డి.డిలను సురక్షితంగా బర్త్ వెయిట్ రూమ్‌లకు తరలిం చాలని వైద్య సిబ్బందికి డా.ఉషశ్రీ సూచించారు. సి.హెచ్.ఓ దైవకృపాచార్యులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, ఎం.ఎల్.హెచ్.పి.కోసూరి భాగ్యలక్ష్మి, ఏ.ఎన్.ఎం.లు మంగరాజు, వెంకటలక్ష్మి, వరహాలు, లక్ష్మమ్మ, ఎల్.టి విశ్వారెడ్డి, ఫార్మసీ దీపిక, స్టాఫ్ నర్స్ సుబ్బలక్ష్మి, ఎఫ్.ఎన్.ఓ.భవాని పాల్గొన్నారు

## 5 లక్షల విలువచేసే రెండు కేజీల లిక్విడ్ గంజాయి పట్టివేత

చింతూరు, జనవరి 8, ప్రభాతవార్త



సుమారు 5 లక్షల రూపాయల విలువైన లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న ఒక వ్యక్తిని డొంకరాయి పోలీసులు అరెస్టు చేశారు. డొంకరా ఎస్ఎఐ శివకుమార్ కథనం మేరకు తన సిబ్బందితో డొంకరాయి గ్రామ శివారులో ఉన్న వన దుర్గ అమ్మవారి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ కు చెందిన రాహుల్ చంద్ర కాప్రి అనే వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడంతో అతన్ని పట్టుకొని విచారించగ లిక్విడ్ గంజాయి తరలిస్తున్నట్టు తెలిపాడు. దాంతో రూ.5లక్షలు విలువచేసే 2 కేజీల లిక్విడ్ గంజాయిని సీజ్ చేసి అతని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు.

## షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్లు కల్పించాలి..

చింతపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి దుర్గా దాస్ఉయికేకి వినతి పత్రం అందజేసి నట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, చింతపల్లి ఎంపీపీ కోరపు అనూష దేవి తెలిపారు. పంచాయతీటు పార్లమెంట్ సెమినార్‌కి వెల్లిన జడ్పీ చైర్ పర్సన్ చింతపల్లి ఎంపీపీ రాజ్ భవన్‌లో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా బుధవారం జెడ్పీ చైర్పర్సన్ ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకొని వెళ్ళి నట్టు తెలిపారు. ప్రధానంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జీవో నెంబర్ 3 అమలులో ఉన్న సమయంలో ఉపాధ్యాయ నియమాకాలు ఇతర ఉద్యోగాల భర్తీలో షెడ్యూల్డ్ ప్రాంతంలో శతశాతం ఆదివాసీ యువతకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. మూడేళ్ల క్రితం జీవో నెంబర్ త్రీని రద్దు చేయడంతో ఆదివాసి యువత నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటున్నారు చెప్పడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడంతో పాటు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రత్యామ్నాయ చట్టం తీసుకురావాలని కోరడం జరిగిందని దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు

రాజవొమ్మంగి, జనవరి 8, ప్రభాతవార్త



10 తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాజవొమ్మంగి వెంకటేశ్వరస్వామి, జడ్డంగి శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీలు తెలిపారు. రాజవొమ్మంగి ఆలయంలో ఆరోజున ఉదయం ఐదు గంటలు నుండి వెంకటేశ్వరస్వామి వారికి అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనము, లక్ష తులసి పూజ కలదన్నారు. సాయంత్రము 6గంటలు నుండి వివిద ఆధ్యాత్మిక కార్యక్రమాలు కలవన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ఆలయ కమిటీ ఫోన్ నెంబర్లు 94411 42933, 9441385848ని సంప్రదించాలని కోరుతున్నారు.

## కాఫీ గింజల కొనుగోలు ప్రారంభం..

చింతపల్లి, జనవరి 8, ప్రభాతవార్త



సబ్ డివిజన్ పరిధిలో కాఫీ గింజలు కొనుగోలు ప్రారంభించినట్లు గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు తెలిపారు. బుధవారం లంబసింగి గ్రామంలో జి.సి.సి. అధికారులు రైతుల నుంచి కాఫీ గింజలకొనుగోలును ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా డివిజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఈ ఏడాది సబ్ డివిజన్ పరిధిలో కాఫీ దిగుబడులు రావడం ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం కాఫీ గింజలను రైతులు విక్రయానికి సిద్ధం చేయడంతో జి.సి.సి. కొనుగోలు చేస్తుందన్నారు. జిసిసి ద్వారా గిరిజన రైతులకు గరిష్ట ధరలు అందిస్తున్నట్టు తెలిపారు కిలో పార్సిమెంట్ రూ.320. చెర్రీ 170 రూపాయలు. రెబస్ట 100 రూపాయల ధరలుగా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు .రైతుల నుంచి కాఫీ గింజలు కొనుగోలు చేసిన వెంటనే నగదును అందజేస్తున్నమన్నారు. గిరిజన రైతులు కాఫీ గింజలను జిసిసి ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. జి.సి.సి. ఖచ్చితమైన తూనిక యంత్రాల ద్వారా గింజలను కొనుగోలు చేస్తుందన్నారు ప్రైవేటు వ్యక్తులు తూనికల్లో మోసాలు చేసే అవకాశం ఉందన్నారు .అలాగే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోరాదన్నారు. అలాగే జి.సి.సి. ఉద్యోగులు రైతుల గృహాల వద్దకు వచ్చి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్నారని రైతులు జి.సి.సి .సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మెన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామారావు ,ప్రధాన కార్యదర్శి నెహ్రూ బాబు,సేల్స్మెన్లు పాల్గొన్నారు.

## పిల్లలకు పునాది స్థాయిలోనే అద్భుతమైన విద్యాబోధన జరగాలి

అరకులోయ, జనవరి 8, ప్రభాతవార్త



విద్యార్థిని విద్యార్థులకు పునాది స్థాయిలోనే అద్భుతమైన విద్యా బోధన జరగాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ స్వామి నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వామి నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మేళాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పునాది స్థాయిలోనే అద్భుతమైన విద్యాబోధన జరగాలని, ఇక్కడ ఏ విదంగా టిఎల్ఎం తయారు చేసారో అదే విదంగా పాఠశాల స్థాయిలో అమలు పరుస్తారని, అప్పుడే మనం అనుకున్న రీతిలో పిల్లలు ఎదుగుతారని చెప్పారు. ఆ రీతిగా శిక్షణ పొంది పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంఓ భాస్కరరావు, ఎంఈ ఓ భారతి రత్నం, ప్రథం జిల్లా కో- ఆర్డినేటర్ వి.వెంకన్న, సీఎంఓ, ఎం జి ప్రకాష్, ఏ పిఓ పాత్రుడు, జి సి డి ఓ సూర్యకుమారి, కె పి పి , డి ఆర్ పి లు, సి ఆర్ పీలు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు స్వాగతం పలికిన గంటా



విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త

ప్రధాని నరేంద్ర మెఆదీ సభలో పాల్గొనడానికి బుధవారం విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. గంటాతో పాటు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సీఎం ప్రోగ్రామం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్ తో కలిసి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.విశాఖలో ప్రధాని మోదీ బహిరంగ సభలో పాల్గొనేందుకు బుధవారం విశాఖ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జనసేన పార్టీ నేతలు కోన తాతారావు, పీవీఎస్ఎన్ రాజు, అంగ దుర్గా ప్రశాంతి, పి.ఉషా కిరణ్, పేడాడ రామ్మోహన్, బోడపాటి శివదత్, బి.శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు స్వాగతం పలికారు. నోవాటెల్ దగ్గర పార్టీ నేతలు పంచకర్ల సందీప్, కళ్యాణం శివ శ్రీనివాస్, తోట సత్యనారాయణలతోపాటు బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు.

## మోడీ సభకు బయలుదేరిన కూటమి నాయకులు



అగనంపూడి, జనవరి, 08, ప్రభాతవార్త

విశాఖపట్నం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రధానమంత్రి నరేంద్రమెఆడీ భారీ బహిరంగ సభకు 85వ వార్డు కూటమి నాయకులు భారీగా తరలి వెళ్ళారు. ముందుగా బస్సులను జెండా ప్రారంభించిన వార్డు అధ్యక్షులు కార్పొరేటర్ వరలక్ష్మీ ప్రసాద్, గవర సోమశేఖర్, కర్రీ దశంద్ర అనంతరం మాట్లాడుతూ మనందరం రాష్ట్ర అభివృద్ధి కి కూటమి పెద్దలు సహాకారం ఎంతో అవసరం అన్నారు. నేడు ఆ అభివృద్ధి పనులకుశంకుస్దాపన చేయడం శుభపరిణామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చందు రమేష్ మంగరాజు, పాములు వసంత్ ,కడవల రమణ, కత్తి తిలక్, కోసూరు తాతారావు, పలక అచ్యుత్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రేపు పెందుర్తి సబ్‌స్టేషన్ పరిధికి విద్యుత్ అంతరాయం

మధురవాడ, జనవరి, 08, ప్రభాతవార్త

పెందుర్తి సబ్ స్టేషన్ పరిధికి 33/11కెవి కి సంబందించి శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 11కెవి రాంపురం ఫీడర్, నిర్వహణ, చెట్ల కొమ్మల నరికివేత పనిని చేపట్టాలని ప్రతిపాదించబడిరది క్రింద ప్రాంతాల్కెన మెస్ లేఅవుట్ పార్వతినగర్, శ్రమశక్తి నగర్, 1, 2, 3 ఎఫ్‌సిఐ గోడౌన్ చలామాజి అపార్ట్మెంట్స్ గంటసాల కళామందిర్ గాయిత్రీమాత టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదు అని కావున అచ్చుటి ప్రజలు సహకరించాలని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ జోన్ 3 పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రధాని రోడ్ షోలో పాల్గొన్న సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

### సిఎం, డిప్యూటీ సిఎం నినాదాలు పలికిన సౌత్ శ్రేణులు

### ప్రధాని సమావేశానికి భారీగా తరలివచ్చిన దక్షిణ నియోజవర్గ కూటమి శ్రేణులు

### సౌత్ నియోజకవర్గానికి కేటాయించిన బాక్స్ లలో కిక్కిరిసిన జన సందోహం

### 11 నుంచి 17 వరకు బాక్స్ లను నిరంతరం పర్యవేక్షించిన ఎమ్మెల్యే వంశీ



విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త

విశాఖ విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ కి, సిఎం చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రోడ్ షో లో కూటమి శ్రేణులతో ఘన స్వాగతం పలికారు. కూటమి శ్రేణులకు రోడ్ షో విజయవంతం కావడానికి నిరంతరం సౌత్ కు కేటాయించిన బాక్సులు వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణ పర్యవేక్షించారు. రోడ్ షో లో ప్రధాని కి మోడీ కి , సిఎం చంద్రబాబు నాయుడు , గౌరవ ఉప మ్యాఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కి రోడ్ షోలో అభివాదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించి, భారీ ప్రాజెక్టులు కు శంకుస్థాపన చేసిన నరేంద్ర మోడీ కి , సిఎం కి, డిప్యూటీ సిఎం కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడుకి తూర్పు కాపు సంఘం నివాళులు



జగదాంబ, జనవరి, 08, ప్రభాతవార్త

మాజీ మంత్రివర్యులు గొర్లె శ్రీరాములు నాయుడు 20వ వర్ధంతి సందర్భముగా విశాఖలో ఉత్తరాంధ్ర తూర్పుకాపు సంఘ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రాపటానికి ఘన నివాళులు అర్పించారు. గొర్లె శ్రీరాములు నాయుడు తూర్పుకాపులను బీసీ డి లో చేర్పించిన మహా నేత అని, నేటి తరం నాయకులకు ఆయన మార్గదర్శకమన్నారు. ఆయన జీవితం ఆదర్శవంతమని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్‌గా, సెంట్రల్ బ్యాంకు చ్కెర్మన్గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేసారన్నారు. అలాగే తూర్పుకాపు సామాజిక వర్గానికి బిసి డి రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర తూర్పు కాపు అధ్యక్షులు, గొర్లె శ్రీనివాస నాయుడు సింహాచలం వరహా దేవరాయ తూర్పుకాపు సంఘం కార్యదర్శి లోగిస గణేష్, ఉత్తరాంధ్ర కార్యదర్శి బలగ సుధాకర్, విశాఖపట్నం జిల్లా కళ్యాణం గోపి పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్.



## కాకినాడలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూం ప్రారంభం





విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త

కాకినాడలోని పులవర్తివారి వీధి యునియన్ బ్యాంక్ ప్రక్కన వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూము అంగరంగ వైభవంగా ప్రారంభించబడిరది. ముఖ్య అతిదిగా కాకినాడ పార్లమెంట్ లోక్‌సభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రత్యేక అతిదిగా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ ఆధారిటీ చ్కెర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసారు. షోరూము భూస్వామి, పాబోలు బాబురావు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో జ్యూయలర్స్ చ్కెర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, తుని షోరూము భూస్వామి గ్రంధినారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం సోము దుర్గాప్రసాద్ మెఉదటి కొనుగోలును చేశారు. వైశ్యరాజుజ్యూయలర్స్ మేనేజింగ్ డ్కెరెక్టర్ శ్కెశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన కాకినాడులో ప్రారంభించాలని అనుకున్నాము అన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ గా అన్ని రకాల 22కెటి బంగారు ఆభరణాలును క్యాస్ యుపిఐ, ఈ ట్రాన్స్‌ఫర్‌ల ద్వారా ప్లాట్ 6శాతం తరుగుకే ఆభరణాలును పొందవచ్చు అన్నారు. అలాగే సాదారణ వెండి వస్తువులపై తరుగు లేదు మజూరి లేదు. జిఎస్‌టి ని కూడా మీ తరుపున మీమే చెల్లిస్తాము అని అన్నారు. అదనం గా కేజీ వెండి వస్తువుల కొనుగోలు పై కేజికి 10వేలు వరకు తగ్గింపు వుంది, ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ప్రతి ఒక్కరుఆ షోరూముకి విచ్చేసి మా ప్రత్యేకమైన డిజ్కెనరీ కలక్షనులు ఎంపిక చేసుకొని ఈ ఆఫర్ ని వినియెఆగించవలసిందిగా కోరారు. ఈకార్యక్రమంలో సంస్ధ డ్కెరెక్టర్లు వైశ్యరాజు నరేష్‌రాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజు, పి వెంకట నాగ సూర్య పున్నయ్య, పి వెంకట సింహాచలం, గుల్లపూడి నందు, పేకెటి ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 9నుంచి 16 వరకు శిల్పారామం లో సంక్రాతి సంబరాలు

మధురవాడ, జనవరి, 08, ప్రభాతవార్త

శిల్పారామం విశాఖ నందు సంక్రాంతి సంబరాలు 2025 లో భాగంగా ఈనెల 9నుంచి 16 వరకు ముగ్గులు , గాలిపటాలు ఎగురువేయు పోటీలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. ఈనెల 9వ తారీఖు ఉదయం ముగ్గులు పోటీలు నిర్వహించబడును , 10వ తారీఖు ఉదయం గాలిపటాలు ఎగురవేయుట పోటీలు జరుగును అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 15వ తేదీ న బహుమతి ప్రధానం జరుగునని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 11న నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ వారిచే ప్రత్యేక శాస్త్రీయ జానపద నృత్యాలు ప్రదర్శించబడును. 12న కళారాధన మ్యూజిక్ డ్యాన్స్ 13న సరస్వతి నృత్యకళామందిరం వారిచే సిని జానపదశాస్త్రీయ నృత్యం, 14న సిద్ధేంద్రయెఆగి నాట్యాలయం వారిచే ప్రత్యేక నృత్య ప్రదర్శన, 15న జోష్‌డ్యాన్స్‌య అకాడమి వారిచే సంక్రాంతి ప్రత్యేక డాన్యులు, 16న మీనాక్షికూచిపూడి డాన్స్ అసోసియేషన్ యం కె ఫోక్ డ్యాన్స్ నృత్యాలు ప్రదర్శించబడునని తెలిపారు.

# పూర్తిగా శిథిలమైన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం

### ఊడిపడ్డ పెచ్చులు - తృటిలో తప్పిన ప్రమాదం భయాందోళనలో కార్యాలయ సిబ్బంది





ఆనందపురం, జనవరి, 08, ప్రభాతవార్త

ఆనందపురం మండల వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలమై రేపో మాపో కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో అక్కడ కార్యాలయ సిబ్బంది తీవ్ర భయాందోళన గురవుతూ విధులను నిర్వహిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాలను రెండంతస్తులుగా నిర్మించారు. క్రింది నిర్మించిన గదిని గోడౌన్ గాను మొదటి అంతస్తును అధికారుల కార్యాలయం గాను వినియోగిస్తున్నారు. కాగా నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో నిర్మించిన కొంతకాలానికే మొదటి అంతస్తు పూర్తిగా పాడయింది. దీంతో అధికారులు క్రింది ఉన్న గోడౌన్ లోనే ఒక మూలన కార్యాలయ విధులను నిర్వహిస్తూ వస్తున్నారు. కాగా ఐదేళ్ల క్రితమే భవనాలు పూర్తిగా పాడై బీటల వారి పెచ్చులు ఊడి వర్షం పడితే పూర్తిగా కారిపోతోంది. దీంతో విత్తనాలు, ఎరువులు తడిసి పూర్తిగా పాడవుతున్నాయి. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు కార్యాలయ భవనం పూర్తిగా నానిపోయింది. క్రింది ఉన్న గది స్లాబ్, పోర్టుకో వద్ద పెచ్చులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో విధులలో ఉన్న సిబ్బంది ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అలాగే పై అంతస్థుకు వెళ్లడానికి ఏర్పాటు చేసిన మెట్లు చాలా వరకు పాడై పెద్ద పెద్ద పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో సిబ్బంది ఆందోళన గురై బితుకు బితుకు మంటూ విధులు నిర్వహిస్తున్నారు.





**వేములవలసలో తాత్కాలికంగా కార్యాలయం నిర్వహణ**

వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో వేములవలస రైతు సేవా కేంద్రంలో తాత్కాలికంగా సేవలను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయా ధికారి సంధ్యా రత్న ప్రభ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియ జేసి మరమ్మతులు అయినా చేపట్టాలని, కొత్త భవనాలు అయినా నిర్మించాలని కోరామని ఆమె చెప్పారు.

# పాలకుల నిర్లక్ష్యం వల్ల లక్ష్యం నెరవేరని బొత్సపేట మంచినీటి ట్యాంకు

పద్మనాభం, జనవరి, 08, ప్రభాతవార్త



గత పాలకులు నిర్లక్ష్యం వల్ల మండలంలో బొత్సపేట గ్రామంలో లక్షల రూపాయలతో నిర్మించిన మంచినీటి పథకం లక్ష్యం నెరవేరలేదు. దీంతో గ్రామ ప్రజలకు ఏసీజన్నైనా తాగునీటి కరువైంది. అయితే టీడీపీ ప్రభుత్వం హయామాలో అప్పటి ఎమ్మెల్యే, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చొరవతో గ్రామ ప్రజలు దాహార్తిని తీర్చడానికి లక్షల రూపాయలతో ఈ మంచినీటి పథకంను నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ట్యాంకును పట్టించుకోలేదు. ఐదు సంవత్సరాలలో మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు దీని ఊసెత్తలేదు.దీంతో ఈ ట్యాంకు నేటి వరకు నిరుపయోగంగా ఉంది. మంచినీటికి ప్రజలు గ్రామ నాయకుల ఇళ్లలలోకి వెల్లవలసి వస్తుంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ ట్యాం కును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులు అరెస్ట్

విశాఖపట్నం, జనవరి, 08, ప్రభాతవార్త



ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్బంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ ఆపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో మద్దిలపాలెం జంక్షన్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు, ఈ సందర్బంగా పోలీస్ వారు అరెస్ట్ చేసి ఎం వి పి పోలీస్ స్టేషన్ కి తరలించారు, అరెస్ట్ అయిన వారిలో జాతీయ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ మరియు ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ మమతా నాగిరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కాండవ గాయత్రి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి పినమాల శివ కుమార్ , విశాఖ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లిపిల్లి సతీష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# జైలులో కలకలం రేపుతున్న సెల్ ఫోన్లు

### జైలు అధికారులు తనిఖీల్లో గంగా బ్లాక్ లో మరో సెల్ఫోన్ లభ్యం





ఆరిలోవ, జనవరి, 08, ప్రభాతవార్త

విశాఖ కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్లు కలకలం రేపుతున్నాయి. వరుసగా సెల్ఫోన్లో బయటపడటంతో జైల్ అధికారులకు అసలు జైలు లోపలకు సెల్ ఫోన్లు ఎలా చేరుతున్నాయో అని తలలు పట్టుకుంటున్నారు . రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత మూడు రోజుల క్రితం జైలు పర్యవేక్షణ అధికారులతో కలిసి సెల్ఫోన్లో ఎలా లోపలకి వస్తున్నాయని, అసలు జైల్లో ఏం జరుగుతుంది అని క్షుణ్ణంగా జైలు లోపల పరిశీలించి ఇకపై నిషేధించిన వస్తువులు జైలు లోపులకు చేరకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామంటూ చెప్పిన విషయం తెలిసిందే. కానీ మంత్రి సందర్శించిన మూడు రోజులకే బుధవారం నిర్వహించిన తనిఖీల్లో గంగ బ్లాక్ లో ఓ కీప్యాడ్ ఫోను లభ్యమవ్వడం జైలు అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు రోజురోజుకు తనిఖీలు ముమ్మరం చేసి అణువణువు గాలించడంతో జైల్లో సెల్ఫోన్ బాగోతాలు ఒక్కొకటిగా బయటపడుతున్నాయని తెలుస్తుంది. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందజేసి విచారణ జరుపుతున్నట్లు జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు తెలిపారు.

## రెడ్డిపల్లి, శేరీఖండ గ్రామాల మంచినీరు, రోడ్డు సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు.

పద్మనాభం, జనవరి, 08, ప్రభాతవార్త



మండలంలో రెడ్డిపల్లి, శేరీఖండం గ్రామాలలో నెలకొన్న రోడ్డు, మంచినీటి సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీసారు. బుదవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కె.రామబాబు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రాంబాబు, సర్పంచ్ చిన్నారావు,శ్రీను, మాట్లాడుతూ రెడ్డిపల్లి రోడ్డు అసంపూర్తిగా వదిలేయడం వల్ల గ్రామ ప్రజలతో పాటు ప్రయాణికులు గత మూడు సంవత్సరాల నుండి నానా అవస్థలు పడుతున్నారని వారు అవేదన వ్యక్తం చేసారు. అలాగే రోడ్డు వేసినపుడు మంచినీటి పైపులైను తవ్వేయడంతో రెండు గ్రామాలకు తాగునీరు కరవయ్యిందని వారు నిలదీసారు. అలాగే రేవిడి,అయినాడ గ్రామాల రోడ్డు ఊసెత్తక పోవడం శోచనీయమని వారు అన్నారు. నిధులు లేకపోయనపుడు రెడ్డిపల్లి రోడ్డు వేస్తామని హామీ ఎలాగిచ్చారని వారు ఆర్ అండ్ బి శాఖ ఎ ఈ శైలజను నిలదీసారు. రోడ్డు మరమ్మత్తులు చేస్తారని ఆమె అన్నారు. అయితే కొత్తగా వ్యాపిస్తున్న వైరస్ పై ఆందోళన చెందకుండా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని పి.హెచ్.సి. వైద్యాదికారిని స్వప్న అన్నారు. అసంపూర్తిగా ఉన్న బొత్సపేట అంగనవాడీ భవనం పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మండల పరిషత్ నుండి ఇవ్వనున్నట్లు ఎంపీపీ అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మండల పరిషత్ నుండి మూడు లక్షల రూపాయలను ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు. పొట్నూరు గ్రామంలో గంజాయిని పలువురు విక్రయిస్తున్నారని ఇదే గ్రామానికి చెందిన మజ్జి శ్రీను సభ దృష్టికి తీసుకొచ్చారు.దీనిపై చర్యలు చేపట్టాలని ఆయన పోలీసులను కోరారు. అలాగే గ్రామంలో మద్యం బెల్టు షాపులు ఎక్కువగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ గిరిబాబు గైర్హజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్.ఎంపీపీ. పాల్గొన్నారు



## ఆరిలోవ నుంచి ప్రధాని సభకు తరలివెళ్లిన కూటమి శ్రేణులు



ఆరిలోవ, జనవరి, 08, ప్రభాతవార్త

విశాఖలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు తూర్పు నియోజకవర్గం ఆరిలోవ నుండి కూటమి శ్రేణులు తో పాటు మహిళలుపెద్ద సంఖ్యలో తరలివెల్లారు. వార్డ్ టిడిపి ఇన్చార్జిలు ఆయే ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందంటూ కూటమి జెండాలు ఊపి బస్సులలో, ఆటోలలో తరలి వెళ్లారు. నేతలతో కలిసి ఆయా బస్సుల్లో వెళ్తున్న వారికి దగ్గరుండి ఆహార పదార్థాలు ఇతర సౌకర్యాలు కల్పించారు.

# సిమ్మెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఆనందపురం, జనవరి, 08, ప్రభాతవార్త

మండలంలోని తర్లువాడలో నిర్మించనున్న సిమ్మెంట్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేసారు. ఇందుకోసం రూ.10 లక్షల మండలపరిషత్ నిధులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి ఆర్ బి నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు, తాత్రాజు అప్పారావు , బంకు రాజు, ఎం రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

ఆనందపురం, జనవరి, 08, ప్రభాతవార్త



మండలంలోని గంభీరం పైడా కాలేజి ఆవరణ లో వేంచేసి ఉన్న శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10 న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త పైడా కృష్ణ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అత్యంత పవిత్ర మైన వైకుంఠ ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా భక్తులకు ఉ.5.30 గంటలు నుంచి శ్రీ శరణ్య వేంకటేశ్వర స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం కల్పించడంతో పాటు ఆరు రకాల ప్రసాదాలను భక్తులకు అందజేస్తామని తెలిపారు. ఆ రోజు స్వామి వారిని సంపూర్ణ వజ్ర కవచం లో దర్శించుకొని, శ్రీ వారి దివ్య మంగళ ఆశీస్సులు పొంద వలసిందిగా ఆలయ ధర్మకర్తలు శ్రీ పైడా కృష్ణ ప్రసాద్ దంపతులు ఈ సందర్భంగా కోరారు.

## అపుస్మా జోన్ -1 అధ్యక్షులుగా ఎం. వి. రావు

ఆరిలోవ, జనవరి, 08, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం సంఘం ( అపుస్మా ) జూన్ - 1 అధ్యక్షునిగా మల్లపురెడ్డి వెంకట్రావు (ఎం. వి. రావు ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన అపుస్మా రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో విశాఖపట్నం ఆరిలోవ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అనకాపల్లి, విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతిపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు జోన్ -1 పరిధిలో వస్తాయని ఎం. వి. రావు తెలిపారు.




విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని మర్యాద పూర్వకంగా కలిసిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు (విజయనగరం, ప్రభాతవార్త ప్రతినిధి)

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి



**శృంగవరపుకోట, జనవరి 8 ప్రభాతవార్త :**

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని మూలబొడ్డవర గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిఆర్ఒ పాల్గొని మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం ఒకప్పుడు మండల, జిల్లాస్థాయి అధికారులు చుట్టూ తిరిగేవారని ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలో అధికారులే మీ ముందుకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. రైతులు తమ భూముల హక్కులను పొందాలంటే రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసి ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. అలాగే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేసి దరఖాస్తు దారునికి రశీదు ఇవ్వాలని అందువల్ల ప్రజలు రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, తహశీల్దార్ ఎం.అరుణ కుమారి, ఎంపిపి ఎస్.సోమేశ్వరరావు, జనసేనపార్టీ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఐ.శ్రీనురాజు, గ్రామ వైస్ సర్పంచ్ ఆడారి అప్పారావు, గ్రామ పెద్దలు బి.మురళిరాజు, డి.సన్యాసిదేముడు, కె.సత్యనారాయణ, కేత వీరన్న, పంచాయతీ, రెవెన్యూ సచివాలయం సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు బంగారం, వెండి పతకాలు

**పాచిపెంట, జనవరి 8 ప్రభాతవార్త**



పాచిపెంట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో అండర్ 20, బాయ్స్ క్రాస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 6కె ఎంలో రెండవస్థానంలో గెలిపొందినందుకు వెండి పతకం లభించింది. వెస్ట్ గోదావరి జిల్లా తణుకులో 59వ ఆంధ్రప్రదేశ్ క్లాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రధమ, ద్వితియ స్థానాలలో కైవసం చేసుకున్న క్రీడాకారులకు పాచిపెంట గ్రామస్తులతో పాటు క్రీడల్లో ఈ స్థాయికి ఎదగానికి కారుకులైన కోచ్ నేతేటి శేఖర్ అభినందనలు తెలియజేశారు. కోచ్ శేఖర్, తోటి క్రీడాకారులు వీరికి అభినందనలు తెలిపారు.

## ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



**చీపురుపల్లి, జనవరి 8 ప్రభాతవార్త :**

మండల కేంద్రం నుంచి లావేరు ప్రదాన రహదారిలో నిత్యం జరుగుతున్న రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని చీపురుపల్లి ఎస్.ఐ ఎల్.దామోదరరావు వివరించారు. ఈ మేరకు బుధవారం నాడు చర్యలలో భాగంగా చీపురుపల్లి మండలం రావివలస సెంటర్ నుంచి వెంకటాపురం వరకు ప్రదాన రహదారి మలుపుల వద్ద ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే విధంగా తుప్పలను తొలగిస్తున్నామన్నారు. ఆర్.అండ.బి అధికారులు, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రొక్లెయిన్ అన్న ఏరాప్టఉ చేసివి చర్యలు చేపట్టమన్నారు. రానున్న సంక్రాంతి వేడుకల దృష్ట్యా ఈ రహదారిలో ఎక్కువగా రాకపోకలు సాగే అవకాశం ఉన్నందున ప్రమాదకరమైన మలుపుల వద్ద తుప్పలు తొలగిస్తామని ఈ సందర్భంగా ఎస్.ఐ వివరించారు. వాహనచోదకులు కూడా హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని ఈ సందర్భంగా సూచించారు. మితిమీరిన వేగాలతో ఏ ఒక్కరూ వాహనాలు నడుపకూడదన్నారు. వాహనాలు నడిపే వద్ద సరైన రికార్డులు ఉండాలని ఆయన సూచించారు. ప్రత్యేకించి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## నక్కలపేటలో రక్షిత మంచినీటి కొళాయి ప్రారంభం

**గుర్ల, జనవరి 8 ప్రభాతవార్త**



మండలంలోని పాలవలస మధుర నక్కలపేటలో రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇంటింటికి కొళాయిలను జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వల్లూరు రాము 10వ వార్డు మెంబర్ పల్ల సన్యాసమ్మ, మాజీ సర్పంచ్ పొట్నూరు అచ్చంనాయుడు, పెద్దలు రౌతు రామునాయుడు, పెద్దమజ్జి అప్పలనాయుడు, నక్కలపేట గ్రామ ప్రజలు అందరూ పాల్గొన్నారు.

## పంచ భూతాలను కాపాడుకోవాలి

**గరుగుబిల్లి, జనవరి 8 ప్రభాతవార్త**



తోటపల్లి జట్టు ట్రస్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 30 మంది నీటి నేస్తంలకు ఆజీమ్ ప్రేమ్ జీ పౌండేషన్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో రెండు రోజులు శిక్షణ క్యాక్రమంలో ముగింపులో భాగంగా మాట్లాడటం జరిగింది. ప్రకృతి ప్రసాదించిన పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, భూమి ఆకాశం, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సకల జీవరాసులు మునుగడ ఆనందదాయకంగా సాగించడానికి, అన్ని రకాల పోషకాలు కలిగిన పంటలపై పుష్కలంగా లభించాలన్న అందుకు ప్రతి ఒక్కరూ కూడా పంచభూతాలకు హానికరం చేసే కార్యక్రమాలు ఎవరూ చేయరాదని ఈ శిక్షణలో నేర్చుకున్న అంశలు గ్రామాల్లోని నీటి వనరులను గుర్తించి వారి ప్రాధాన్యత క్రమాన్ని పెరిగేటట్లు ప్రణాళికలు తయారు చేసే ఆచరించి అందరికీ ఉపయోగపడేలా చేయాలని సూచించడం జరిగింది. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబందకుడు పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించినచో భూమిపై జీవించే సకల జీవరాశులు అనేక రకమైన పంటలు పశుపక్షాదులు ఆనందాయంగా ఉండటంతో పాటు రుతువులు సకాలంలో రావడం వల్ల రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పలు పంటలు పండించడంతో పాటు, తక్కువ పెట్టుబడతో ఎక్కువ దిగుబడులు సాధించడం తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం పొందడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించడం వినియోగించడం వల్ల ఆరోగ్య కుటుంబ ఆహార భద్రత సాధించడం జరుగుతుందన్నారు. వినియోగదారులు కూడా ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగం వల్ల వారి ఆరోగ్యాలు కూడా పరోక్షంగా దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రోసోర్స్ పర్సన్ ఎ.మహేష్, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్ కో డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, జట్టు ఫీల్డ్ కోఆర్డినేటర్స్, రెండు మండలాలకు చెందిన నీటి నేస్తం కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఎం మోడి సభకు ఎల్.కోట మండలం నుంచి తరలి వెళ్ళిన మహిళలు

**లక్కవరపుకోట, జనవరి 8 ప్రభాతవార్త**



విశాఖపట్నం ఆంధ్రయూనివర్సిటీ గ్రౌండ్‌లో భారత ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ సభకు ఎల్.కోట మండలం ఉంచి 1242 మంది డ్వాక్రా మహిళలు తరలి వెళ్ళినట్లు మహిళా సమాఖ్య ఏపీఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జరిగిన ఈ సభలో పాల్గొనేందుకు బయలు దేరిన మహిళల కోసం మండలానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో సాధారణ ప్రయాణీకులకు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. అలాగే టీడీపీ జనసేన బిజెపి పార్టీల నుంచి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు ఎల్.కోట నుంచి తరలి వెళ్ళారు.

## పట్టణాభివృద్ధికి పట్టించుకోని పాలకవర్గం



**సాలూరు, జనవరి 8, ప్రభాతవార్త**

సాలూరు పట్టణ అభివృద్ధి విషయంలో మున్సిపల్ పాలకవర్గం అలాగే అధికార పార్టీ నాయకత్వం చిత్తశుద్ధితో పని చేయకపోవడం వల్ల సమస్యలు రోజురోజుకు పెరిగిపతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఎన్.వై.నాయుడు విమర్శించారు. బుధవారం విలేకర్లల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ లైబ్రరీ ఇంకా ప్రభుత్వ ఐటిఐలు సంవత్సరాలు తరబడి అద్దె భవనంలో ఉండటానికి పాలవర్గాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. అంతేకాకుండా అనేక సందరాభల్లో భవనాలు నిర్మాణానికి నిధులు విడుదలైన స్థలాలు ఇవ్వలేని స్థితిలో పాలకులు ఉన్నారని ఆక్షేపించారు. రైతుబజార్ నిర్మాణం జరిగి పిచ్చి మొక్కలు బహిర్భూమి, ఇతర జంతువులు ఆ స్థలంలో ఆశ్రయం పొందుతున్నా పలు విషయాలపై స్పందించారు. సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఈశ్వరరావు, ప్రసాద్, కల్యాణ్ పాల్గొన్నారు.

## న్యాయవాది డాక్టర్ మజ్జికి ఘన సత్కారం

**గరివిడి, జనవరి 8 ప్రభాతవార్త**



గరివిడికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది డాక్టర్ మజ్జి సూరిబాబుకి అమరావతికి చెందిన అభయ హ్యూమన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం జరిగింది. సొసైటీ ప్రతినిధులు డాక్టర్ మజ్జిని దుశ్శాలువతో సత్కరించి పుష్పమాలంకృతులను చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అభయ ఆనవసేవా సంస్థ ప్రతినిదులు పలువురు పాల్గొన్నారు.



## కౌలు రైతులకు రుణాలు

**రామభద్రపురం, జనవరి 8 ప్రభాతవార్త**

మండలంలోని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయ అధికారిణి వెంకటయ్య తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది 542 మంది కౌలు రైతులకు రుణాలు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికి అర్హత ఉన్నవారికి పేర్లు బ్యాంకులకు అందించామని తెలిపారు. ఈ ఏడాది 4,500 మెట్రిక్ టన్నులు దాన్యం కొనుగోలు చేశామని అన్నారు. రైతులకు 24 గంటల్లో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పద్మనాభ కొండలరావు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**దత్తిరాజేరు, జనవరి 8 ప్రభాతవార్త**



బాల్యవివాహాలు అరికట్టే స్త్రీలను మంచి మార్గంలో నడిపించడం కిశోర్ వికాసం అనేది కౌమర దశలో ఉన్న ఆడవారికి ఆత్మ విశ్వాసాన్ని పెంచడానికి వారికి మంచి అవకాశం అందించడానికి వారి బావ వ్యక్తీకరణ స్థిరపరచడాఇకి చేపట్టే కార్యక్రమమే కిశోర్ వికాసం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపిడివో వై.వి రాజేంద్రప్రసాద్ అన్నారు. సిడిపివో నాగమణి ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుళు అంగన్వాడీ కార్యకర్తలు ఎఎన్‌ఎంలు మహిళా పోలీసులతో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ కౌమార బాల బాలికలు సమస్యలను అర్థం చేసుకుని వారిని మంచి మార్గంలో నడిపించాలని కౌమర బాలికల సంఘాలు గ్రూపులను తయారు చేయాలన్నారు. పంచాయతీ అధికారి వాణిశ్రీ, సూపర్‌వైజర్లు శ్యామలత, అపర్ణ, రాణి, భవాని పాల్గొన్నారు.

## జాతరలో అంగడుగులకు వేలం



**మక్కువ, జనవరి 8 ప్రభాతవార్త**

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో పలు అంగడుగులకు పార్కింగ్ స్టాండ్‌లకు సంబందించి వేలంపాట బుధవారం శంబర గ్రామ సచివాలయంలో ఈవోపిఆర్‌డి దేవ కుమార్, స్థానిక పంచాయతీ సెక్రటరీ గణేష్‌లు నిర్వహించారు. సింహచానికి చెందిన రాపర్తి రవికుమార్ ఈ ఏడాది లక్షా రెండువేల రూపాయలు వేలం పాట పాడుకున్నారు. ఈవోపిఆర్‌డి పత్రికలను వేలంపాటలో పాల్గొనాలనుకునే వాళ్ళు 230 వేలు అని ప్రకటన ఇవ్వగా వేలంపాట సమయంలో ఐదు వేలు సరిపోతుందని అనడం ఒకంత పలువురుని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇరవైల వేలు రూపాయలని కొంతమంది పాల్గొనలేదని ఐదు వేలు అంటేనే మరికొందరు పాల్గొనేవారమని పలువురు అనుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

## జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

**చీపురుపల్లి, జనవరి 8 ప్రభాతవార్త**



రాష్ట్రంలో విజయనగరంలో జిల్లా అన్ని రంగాల్లో ఎంతోకాలంగా నిర్లక్ష్యానికి గురైందని జిల్లాలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కాం చూపే వజదంగా దృష్టి సారించాలని తెలుగేదేశం పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కోరారు. బుధవారం ఆయన విశాఖపట్నంలో తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో అలాగే చీపురుపల్లి నియోజకవర్గంలో అధిక శాతం పరిశ్రమలు మూతపడి ఉన్నాయని తద్వారా కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆయన వివరించారు. అంతేకాకుండా జిల్లాలో నెలకొన్న వివిధ రంగాలలో గల సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని కిమిడి లోకేష్‌ను కోరారు.



## పేద విద్యార్థికి సిరిసహస్ర ఆర్థిక సాయం

**విజయనగరం, జనవరి 8 ప్రభాతవార్త**

జిల్లాలో మెరకముడిదాం మండలంలో ఎం.గదబవలస గ్రామానికి చెందిన దీపికకు చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర ఆర్థిక సాయం చేశారు. దీపిక విశాఖలో మల్కాపురం సెంటు ఆనమ్స్ కళాశాల ఆఫ్ నర్సింగ్‌లో సీటు వచ్చింది. అందులో చదువుకోవడానికి ఫీజు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సిరిసహస్ర మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో చదుకుంటే మంచి ఫలితం వస్తుందనా న్నరు. ఆడపిల్ల ఇంటికి వెలుగని అందువల్ల ఆ దిశగా ఆలోచించి చదువుకోవాలన్నారు. మెరిట్ విద్యార్థులకు సాయం చేసేందుకు తమ సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతిభను ప్రోత్సహించడమే తమ సంస్థ ధ్యేయమని చెప్పారు.



## ఎవరి కోసం ఈ రోడ్డు వేశారు

**లక్కవరపుకోట, జనవరి 8 ప్రభాతవార్త**

మండలంలోని కోనమసివానిపాలెం గ్రామంలో ఊరుకి శివారు ఎస్.కాలనీని ఆనుకుని 86 మీటర్ల సిమ్మెంటు రోడ్డుని 3.5 లక్షలు ఉపాధి హామీ నిధులను ఖర్చు పెట్టి అధికారులు వేశారు. అయితే ఈ రోడ్డు దేనికోసం ఎవరిక ఉపయోగపడుతుందని వేశారో అర్థం కావడం లేదు అటువైపుగా ఎటువంటి ఇళ్లు గాని రైతులకు సంబందించిన పాకలు గాని లేవు ఈ అప్రోచ రోడ్డు ఇలా ఎందుకు వేశారని మండల ఏఈ వీరలక్ష్మిని అడుగుగా గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం వేసినట్లు చెబుతున్నారు. ఎవరు ఏ తీర్మానం చేసి ఖర్చు పెట్టే నిధులు ద్వారా చేసే పనులు ప్రజలకు ఉపయోగపడాలి గాని ఎంరో ఒకరికి పనికి వచ్చేలా ఎవరికో ఒకరికి లాభం చేకూర్చడం కోసం చేయకూడదు. ప్రభుత్వం గ్రామంలోని ఎక్కువ మంది ప్రజలకు పనికి వచ్చే పనులే చేపట్టామని చెబుతున్నా పెడచెవిన పెట్టే ఇలా నిధులను వృదా చేస్తున్నారని వమిర్శ వస్తుంది. ముఖ్యంగా సిమ్మెంటు రోడ్డులు అనేవి గ్రామంలో లోప వేస్తారు. గ్రామానికి వెలుపల వేయాలని లేదు ఇలా ఎక్కడబడితే అక్కడ నిబంధనలకు విరుద్దంగా అభివృద్ధి పనుల పేరుతో ప్రజాసొమ్మును ఖర్చు చేస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తునానరు. ఇకనైన పనులకు పంచాయతీ తీర్మానం చేసేప్పుడు సభ్యులు ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేయాలి తప్పితే పార్టీల నాయకులకు ఇంకెవరికో లబ్ది చేకూర్చేలా చేయకూడదని ప్రజలు సూచిస్తున్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 Glorious years వార్త

## పెద్ద పోలమాంబ అంపకోత్సవం

### చిన పోలమాంబ చానప చాటింపు



**మక్కువ, జనవరి 8 ప్రభాతవార్త**

శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అమ్మవారి అంపకోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. బంగారు పూతతో అలంకరించిన అమ్మవారి ఘటాలను మంగళవారం రాత్రి తెల్లవారులు తీరువీధులు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారి ఘటాలను యాత్ర స్థలానికి చేరుకున్నారు. బుదవారం చిన పోలమాంబ అమ్మవారి గ్రామంలోని తీసుకుని వచ్చేందుకు చానప చాటింపు వేయించారు.

## కోడిపందాలు జూదం నిర్వహిస్తే చర్యలు : సిఐ

**శృంగవరపుకోట, జనవరి 8 ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పొట్టేళ్ల పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ. వి.నారాయణమూర్తి తెలిపారు. మండలంలో అన్ని ప్రాంతాల్లో పందాలు నిర్వహిస్తే గట్టి నిఘా ఉంచుతామన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగ వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ వి.ఎస్.మూర్తి హెచ్చరించారు.

## పంట మార్పిడి విధానంతో పలు లాభాలు



**గరుగుబిల్లి, జనవరి 8 ప్రభాతవార్త**

మండలంలోని పిట్టల మెట్ట గ్రామంలో రెడ్డి లక్ష్మినాయుడు వ్యవసాయ క్షేత్రంలో భాగంగా రబీలో పలు పంటలు పరిశీలన చయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరి పంట అయిన తరువాత రవి సీజన్లో ఆర్డీఎస్‌లో బాగంగా ప్రదాన పంట పెసర విత్తనాల 80శాతం 20 శాతం అంతర పంటలైన కొమ్ము శెనగ, తోటకూర, గొంగూర, కట్టేజనులు, ముల్లంగి, బెండ చిక్కుడు తదితర విత్తనాలు వేయడం ఇప్పుడు అవి పెరిగి పెద్దవి అయి కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతో పాటు మిగిలిన పరిమాణం అమ్మడం జరుగుతంఉదని, పంటలలో వైవిద్యం పెంపొందించడం జరుగుతుందని భూమిని పచ్చగా ఉంచడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంటుందని ప్రతి ఒక్కరూ పంట మార్పిడి విధానం పాటించడం వల్ల పంటలు దిగుబడితో పాటు ప్రకృతిని, భూఆతను పరిరక్షించడడం జరుగుతుందని జిల్లాలోని 15 మండలాల్లో ఈ విధమైన క్యాక్రమాలు చేపట్టడం జరుగుతుందనా న్నరు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆర్.లక్ష్మనాయుడు, డి.వెంకట్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 10న నవోదయ మోడల్ టెస్ట్

**గజపతినగరం, జనవరి 8 ప్రభాతవార్త**

స్థానిక హర్షవర్ధన హై స్కూల్లో ఈ నెల 10వ తేదీన శుక్రవారం జిల్లాస్థాయి నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ వైకుంఠం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ టెస్టకు హాజరవ్వాలని ఆనుకునే విద్యార్థులు, తమ పేర్లను పాఠశాలకు నేరుగా వచ్చి 9133635599కి ఫోన్ చేసిగాని రిజిస్ట్రేషన్‌ను ఖరారు చేసుకోవాలని పేర్కొన్నారు.

## ప్రధాన మంత్రి సభకు తరలి వెళ్లిన కూటమి నాయకులు

**నెల్లిమర్ల, జనవరి 8 ప్రభాతవార్త**



విశాఖలో బుధవారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు నెల్లిమర్ల మండలం, నగర పంచాయితీ నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. నగర పంచాయితీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు సుమారు 18 బస్సులతో పాటు కార్లు, ఇతర వాహనాలతో తరలి వెళ్లారు. ఈ వాహన శ్రేణిని నెల్లిమర్లలో ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ తదితరులు జెండా ఊపి లాంఛనంగా ప్రారంబించారు. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన బంగార్రాజు, రవిశేఖర్‌లతో పాటు కడగల ఆనంద్‌కుమార్, చనమల్లు వెంకటరమణ, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, బంగారు సరోజిని, బయిరెడ్డి నాగేశ్వరరావు, బయిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, బంగారు భాను ప్రకాష్, అలాగే జరజాపుపేట నుంచి అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, కాళ్ల రాజశేఖర్, నల్లి బంగారు చంద్రశేఖర్, తుమ్మ వెంకటరమణ, అవనాపు మురళీకృష్ణ, పాండ్రంకి సత్యనారాయణ తరలి వెళ్లారు.

## 10న నవోదయ మోడల్ టెస్ట్

**గజపతినగరం, జనవరి 8 ప్రభాతవార్త**

స్థానిక హర్షవర్ధన హైస్కూల్‌లో ఈ నెల 10న శుక్రవారం జిల్లా స్థాయి నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ వైకుంఠం ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్దులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్‌టెస్ట్‌కు హాజరవ్వాలనుకునే విద్యార్దులు తమపేర్లను పాఠశాలకు నేరుగా వచ్చి గాని, 9133635599 నంబరుకు ఫోన్ చేసి గాని తమ పేర్లను రిజి స్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు


కెనరా బ్యాంక్ Canara Bank
సాలూరు బ్రాంచ్ (1393)
డి.నెం.30-28, వార్డు నెం.24, మున్సిపల్ ఆఫీసు ప్రక్కన, జైపూర్ రోడ్డు, సాలూరు-535591

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు:
(1). శ్రీ పున్నన శ్రీనివాసరావు, తండ్రి: కోటేశ్వర రావు, రామ కాలనీ, సాలూరు, పార్వతీపురం మన్యం, ఆంధ్రప్రదేశ్-535591.
డియర్ సర్/మేడమ్,

విషయం: సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ శ్రీ పున్నన శ్రీనివాసరావు వారిని బకాయి రూ. 12,35,373.86/- (అక్షరాల పన్నెండు లక్షల ముప్పై ఐదు వేల మూడు వందల డబ్బై మూడు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు) మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్, సాలూరు బ్రాంచ్ అధీకృత అధికారి తేది 28.02.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది. 06.05.2024 న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఈనాడు (తెలుగు) & డెక్కన్ క్రానికల్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.09.05.2024 న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. 28.02.2024 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి రూ. 12,35,373.86/- (అక్షరాల పన్నెండు లక్షల ముప్పై ఐదు వేల మూడు వందల డబ్బై మూడు రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటి. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 24-12-2024, ప్రదేశం:సాలూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# ఆన్ ది జాబ్ ట్రైనింగ్ విద్యార్థులకు కీలకం

## డీవీఈవో శివ్వాల తవిటినాయుడు



శ్రీకాకుళం, జనవరి, 8, ప్రభాతవార్త

వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థా యిలో శిక్షణ (ఆన్ ద జాబ్ ట్రైనింగ్) ఎంతో ఉపయోగపడుతుందని శ్రీకాకుళం ఇంటర్మీడియట్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి (డీవీఈవో) శివ్వాల తవిటి నాయుడు అన్నారు. బుధవారం వృత్తి విద్య కోర్సుల అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విద్యార్థులకు శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న ఒకరోజు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోన్న అక్షయపాత్ర ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సరుకుల సరఫరా, వివిధ రకాల ఆహార వంటల తయారీ విధానం, పంపిణీ, అకౌంటింగ్ పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై సంస్థ మేనేజర్ వెంకటరాజు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ సూచనల మేరకు, ఇంఛార్జి ప్రిన్సిపాల్ వదనగిరి ఆదేశాలతో శ్రీకాకుళంలో విద్యార్థులకు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించామని, అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు. డీవీఈవో తవిటినాయుడుతో పాటు జిల్లా ఏజీఎంఏ, లైబ్రేరియన్ తాతారావు అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# డిగ్రీ, జూనియర్ కళాశాల రక్షణ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు

సోంపేట, జనవరి 8 ప్రభాతవార్త



బారువ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహాకూటమి నాయకులు, విద్యార్థులు, జూనియర్, డిగ్రీ కళాశాల మరియు హైస్కూల్ సిబ్బంది, బారువ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బారువలో ఉన్న మూడు విద్యాసంస్థలు ప్రహరీ గోడలు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు గ్రామానికి చెందిన టీడీపీ నేత మద్దు కుమార్ తెలిపారు. జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ మరియు ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యులు బెందాళం అశోక్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ సంబంధిత డిపార్ట్‌మెంట్ వారిని పిలిచి బారువ డిగ్రీ కళాశాలకు సుమారు రూ.75 లక్షలు, జూనియర్ కళాశాలకు సుమారు రూ.35లక్షలు, హైస్కూల్‌కు సుమారు రూ.29 లక్షలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ తీర్మానాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెంటనే నిధులు మంజూరు చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# తనుశ్రీకి ఆశీస్సులు అందజేసిన ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం, జనవరి 8 ప్రభాతవార్త



శెట్టి జనార్దన, విజయశ్రీల ముద్దుల కుమార్తె తనుశ్రీకి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తమ ఆశీస్సులు అందజేశారు. బుధవారం పాలకొండలోని ఒక ప్రైవేట్ కళ్యాణమండపంలో రజస్వల ఫంక్షన్‌కు హాజరై చిన్నారిని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలంటూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో వీరఘట్టం, వంగ ఎంపీపీలు దమలపాటి వెంకటరమణనాయుడు, ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ, సీనియర్ వైకాపా నేత పాలవలస ధవలేశ్వరరావు, కడగల వెంకటరమణ, కడగల దామోదరరావు, మత్స వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షులు ఖండాపు హరిబాబు, బుజ్జి తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో ఎన్డీఏ పాలనతో ప్రజారంజక పాలన

## కాలింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని



ఆముదాలవలస, జనవరి 8 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఎన్డీఏ పాలనతో ప్రజారంజక పాలన అందుతుందని రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచనలతో బుధవారం తొగరాం గ్రామంలో బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఈ సభ ద్వారా విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల కోట్లకు పైగా అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 2047 వికసిత భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి మోడీ, సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. వీరి సంస్కరణలతో పేదలక లబ్ధి కలుగుతుందని అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా కార్యకర్తలతో అన్నారు.

# చెత్త వేస్తే జరిమానా : సర్పంచ్ రామచంద్రరావు

ఆముదాలవలస, జనవరి 8 ప్రభాతవార్త



కట్టాచార్యులపేట పంచాయతీలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా వేస్తామని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. బుధవారం గ్రామంలో చెత్త వేస్తే జరిమానా విధించబడుతుందని బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం వల్ల పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో పాటు ప్రజలు పలు వ్యాధులు పడే అవకాశాలు ఉన్నాయని వాటి నివారణకు గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెత్తను వారికి కేటాయించిన డబ్బాల్లో వేయవలెనని, పారిశుధ్య కార్మికులు వచ్చి ఆ చెత్తను ఇతర ప్రాంతాలకు తరలిస్తారని తెలిపారు. ఈ బోర్డులను చూసిన వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే ప్రతి గ్రామంలో ఉంటే బాగుంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.

# గ్రిక్స్‌పోటీల్లో సెయింట్ క్లారిట్ విద్యార్థుల ప్రతిభ

నరసన్నపేట, జనవరి 8 ప్రభాతవార్త



నియోజకవర్గస్థాయిలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు పోలాకి మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 77వ గ్రిక్స్ పోటీలలో స్థానిక నరసన్నపేట సెయింట్ క్లారెట్ స్కూల్ విద్యార్థులు పాల్గొని వారి సత్తా చాటారు. ఈ పోటీల్లో బాలికలలో కూన హారిక 100 మీటర్ల పరుగుపందెం (సీనియర్)3 వస్థానంలో 200 మీటర్ల పరుగుపందెం (జూనియర్) తర్ర ఝాన్సీ, 3వ స్థానంలో లాంగ్‌జంప్‌లో (సీనియర్ కూన హారిక 2వస్థానంలో, వాన విద్యశ్రీ (జూనియర్) 3వ స్థానంలో నిలిచారు. జావెలిన్ (జూనియర్) ఉప్పాడ శ్రీనిధి మొదటి స్థానంలో బమ్మిడి భాగ్యలక్ష్మి 3వ స్థానంలో నిలిచారు. అదే విధంగా 100మీటర్ల పరుగు పందెం (సీనియర్)లో అంబటి అచల్ 2వ స్థానంలో నిలిచాడు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జేమ్స్, ప్రిన్సిపాల్ ఫాదర్ బాలకుమార్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ శబూ, పీఈటీ డిపార్ట్‌మెంట్, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# జాతీయ స్థాయికి ఎంపికైన సంతబొమ్మాళి సైన్స్ ప్రాజెక్ట్

సంతబొమ్మాళి, జనవరి 8 ప్రభాతవార్త



మండల కేంద్రం సంతబొమ్మాళి ఎంజెపిబిసిడబ్ల్యుఆర్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'సస్టైనబల్ రైన్ వాటర్ మేనేజ్‌మెంట్ ఎగ్జిబిట్' ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైందని ప్రిన్సిపాల్ ఎం.కృష్ణ తెలిపారు. విజయవాడలో బుధవారం రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరిగిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో శ్రీకాకుళం జిల్లా తరపున రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులు అంపోలు దీపక్, అంజంగి శివ హరీష్‌లను, గైడ్ టీచర్ ఆరంగి సుధను పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రశంసించారు. ప్రపంచమంతా త్రాగునీరు లభించక ఇబ్బంది పడుతున్న తరుణంలో మా ప్రాజెక్ట్ ఒక చక్కని సమాధానంగా ప్రోటోటైప్ మోడల్ పని చేస్తూ వర్షపునీటిని సక్రమంగా నిల్వ చేసి వాటిని అనేక విధాలుగా సద్వినియోగం చేయడంలో ఈ మోడల్ సహాయపడుతుందని ఆయన అన్నారు.

# జిల్లాలో ఎన్పీసీఐఎల్ 'ఆటమ్ ఆన్ వీల్స్' మొబైల్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



టెక్కలి, జనవరి 8 ప్రభాతవార్త

న్యూక్లియర్ ఎనర్జీ యొక్క ఉపయోగం మరియు సామాజిక ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి మరియు వారిని విద్యావంతులను చేయ డానికి, శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల వద్ద బుధవారం 2024న 'ఆటమ్ ఆన్ వీల్స్' కింద ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారం కింద ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక మొబైల్ ఎగ్జిబిషన్ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ప్యానెళ్లు, ఎస్ఈడీ టీవీ, ఆడియో వీడియో ప్రొజెక్షన్ సిస్టం, కరపత్రాలు మొదలైన వాటి ద్వారా 39000 మందికి పైగా వ్యక్తులకు అణుశక్తి యొక్క వివిధ వినియోగాలు గురించి సమాచారం అవగాహన కల్పించారు. ఈ మొబైల్ ఎగ్జిబిషన్ శ్రీకాకుళం జిల్లాలోని 11 కంటే ఎక్కువ మండలాల్లోని 80 గ్రామాలు, పాఠశాలలు, మార్కెట్లు, కమ్యూనిటీ సెంటర్లు, పంచాయతీ భవనాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ మొబైల్ ఎగ్జిబిషన్ పాఠశాల విద్యార్థులు, మహిళలు, యువకులు, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు, ఆసుపత్రులు, ఇతర సంస్థల ఉద్యోగులు ప్రజా చైతన్య యాత్రలో మంచి భాగస్వామ్యం లభించింది. ఈ ప్రత్యేక ప్రజా అవగాహన ప్రచారంలో భాగంగా అణుశక్తి మరియు భద్రతకు సంబంధించిన శాస్త్రీయ అంశంపై అనేక విద్య /యానిమేషన్ చిత్రాలను కూడా ప్రదర్శించారు. అణుశక్తికి సంబంధించిన వివిధ విషయాలపై సృజనాత్మక కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహ కల్పించారు. రానున్న రెండు నెలల్లో ఈ మొబైల్ వాహనం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని మిగిలిన మండలాలను కవర్ చేస్తుందని, అనేక గ్రామాల ప్రజలకు దశల వారీగా అవగాహన కల్పిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

# ముగిసిన రెవెన్యూ సదస్సులు

రేగిడి, జనవరి 8 ప్రభాతవార్త





భూసమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు చక్కని వేదికలుగా నిలిచాయని స్థానిక తహశీల్దార్ ఎన్.చిన్నారావు అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం, చాటాయివలస గ్రామాలతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులంతా ఒకచోట అందుబాటులో ఉండడం వల్ల సమస్యలు పరిష్కారం త్వరితగతిన జరిగాయని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ రెవెన్యూ సమస్యలు నిర్వహించడం మంచి ఆలోచన అని అన్నారు. ఈ రెవెన్యూ సమస్యల్లో వచ్చిన భూ సమస్యలు ఉన్నవారు వారికి సమస్యలు తీర్చే దిశగా అడుగులు వేయడం జరిగిందని తెలిపారు. ఇంకా సమస్య ఉన్నవారు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన వారికి కూడా భూసమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేయడం జరుగుతుందని అన్నారు. పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, వీఆర్వో రామకృష్ణ, దొర, సచివాలయ సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ మురళి, సర్వేయర్లు, సర్పంచ్‌లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంపీవీ వైరస్‌కి ప్రత్యేక ఐసోలేషన్ వార్డ్

సీతంపేట, జనవరి 8 ప్రభాతవార్త



స్థానిక ఏరియా ఆసుపత్రిలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా హెచ్ఎంపీవీ వైరస్‌కి ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని అదే విధంగా ప్రత్యేక వార్డుకు అవసరమైన బెడ్స్ అందుబాటులో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీటికి ప్రత్యేక మందులు ఏమి లేవని సాధారణంగా జలుబు, దగ్గు, తలనొప్పి వంటి మందులే వీటిని వినియోగించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. వీటికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వైరస్ లక్షణాలు అనుమానాలు ఏమైనా ఉంటే వారికి అవసరమైన పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రక్తహీనత సాధారణ వ్యాధిగ్రస్తులు వైద్యం అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# 'వార్త' పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ కోదండరావు

సంతబొమ్మాళి, జనవరి 8 ప్రభాతవార్త



సంచలన వార్తలు సమహారం వార్త దినపత్రిక నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సాయి వినీత్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ చాపర కోదండరావు బుధవారం ఆవిష్కరించారు. డాక్టర్ మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా వెలుగులోకి తెచ్చి ప్రజల పక్షాన నిలిచేది వార్త పత్రిక అని ఆయన అన్నారు. 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వార్తపత్రిక ప్రజల గుండెల్లో చినస్థాయిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి వినీత్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేరుశెనగలో అంతరపంటగా మొక్కజొన్న



సంతబొమ్మాళి, జనవరి 8 ప్రభాతవార్త

రబీ వేరుశెనగలో అంతరపంటగా మొక్కజొన్న సాగు చేయడం లాభదాయక మని సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో రబీ పంట కాలంలో ఆరుతడి పంటగా వేరుశెనగ సాగు చేస్తోన్న గ్రామాలన్నీ వాణిజ్య పరంగా ప్రాధాన్యత గల మొక్కజొన్న పంట సాగుకు కూడా పూర్తి అనుకూలమని అన్నారు. అంతరపంటగా వేరుశెనగలో ప్రతి 7 వరుసలకు ఒక వరుస మొక్కజొన్న విత్తనాలను తూర్పు పడమరలుగా విత్తుకోవాలని రెండు పంటలూ సుమారుగా ఒకేసారి కోతకు వస్తాయని తెలిపారు. అంతరపంటగా మొక్కజొన్న సాగుతో 30% పైబడి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు బాలక సాయికిశోర్, రైతులు పాల్గొన్నారు.

# జాడుపూడిలో బరంపురం ట్రైన్‌కు హాల్టు కల్పించండి

ఇచ్ఛాపురం, జనవరి 8 ప్రభాతవార్త



జాడుపూడి రైల్వేస్టేషన్‌లో బరంపురం– విశాఖపట్నం ట్రైన్‌కు హాల్టు కల్పించాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జెడ్ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస్ రంగా రౌళో కోరారు. ఖుర్దా రోడ్డు డివిజనల్ రైల్వే మేనేజర్ హర్భజన్ సింగ్ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి విన్నవించారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో షిఫ్ట్ పద్ధతిలో రిజర్వేషన్ కౌంటర్‌ను రెండవ పూట కూడా సేవలు కొనసాగించాలని కోరారు. రైల్వే సీనియర్ డిసిఎం ఏఈఎన్‌లతో కలిసి నూతనంగా నిర్మిస్తున్న రైల్వే నిర్మాణాలను పరిశీలించారు. రత్తకన్న ఎల్‌సి గేట్ వద్ద ప్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

# తూర్పుకాపు జాతి కీర్తిపతాకాన్ని ఎగురవేసిన మహానేత శ్రీరాములునాయుడు

సంతకవిటి, జనవరి 8 ప్రభాతవార్త



తూర్పుకాపు జాతి ఆణి ముత్యం.. మాజీ మంత్రి.. మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షుడు, తూర్పుకాపులకు బీసీ డీలో చేర్చి జాతిని ఉద్ధరించి, రాష్ట్రంలో తగిన గుర్తింపు, గౌరవం తెచ్చిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నేత స్వర్గీయ గొర్లె శ్రీరాములునాయుడు 20వ వర్ధంతి సందర్భంగా సంతకవిటి మండలం తూర్పు కాపు సంక్షేమ సంఘం ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏ.సత్యనారాయణ, జిల్లా నాయకులు దాసరి దుర్గాప్రసాద్‌నాయుడు, మండల నాయకులు శ్రీనివాసరావు, బాలరాజు, మజ్జి కోటి, జయరాం ప్రసాదరావు, శంకరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం వార్త

# బెల్లుపడ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

ఇచ్ఛాపురం, జనవరి 8 ప్రభాతవార్త



బెల్లుపడ మున్సిపల్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం నీలాచలం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యూష, శివానంద్, దేవి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు ఆత్మీయ పరామర్శ

ఆముదాలవలస, జనవరి 8 ప్రభాతవార్త



ఇటీవల మరణించిన వారి కుటుంబాలను బుధవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఆ సమయంలో కుమారుని శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లో ఉండడం వలన పరామర్శించలేక పోయారు. పొందూరు వైస్ ఎంపీపీ భర్త కాకర్ల రాజారావు ఇటీవల మృతి చెందారు. కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన గావిడి వాసుదేవరావు కుమారుడు ఇటీవల భోగాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబాలను తమ్మినేని సీతారాం పరామర్శించారు. అదే విధంగా శ్రీకాకుళం బెండిపేటకు చెందిన వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్ని ధనుంజయరావు సోదరుడు మృతి చెందాడు. వారిని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి.సత్యనారాయణ, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపీపీ ప్రతినిధి వండాన సురపునాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, పట్టణ పార్టీ అధ్యక్షులు గాదు నాగరాజు, జిల్లా చేనేత సంఘ అధ్యక్షులు బట్ట సత్యనారాయణ, సర్పంచ్‌లు చింతాడ ప్రసాద్, పప్పల రాధాకృష్ణ, బొడ్డేపల్లి రమణ నాయకులు, బొడ్డేపల్లి ప్రసాద్, గోనపు కృష్ణ, కానేపు శ్రీదేవి, అల్లంశెట్టి గిరి, దున్న రామకృష్ణ, బొడ్డేపల్లి జనార్ధనరావు, పైడి రాజగోపాల్, ఇప్పిలి రామారావు, అనకాపల్లి రామకృష్ణ తదితర వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన పోటీతత్వం అలవర్చుకోవాలి

## జెడ్పీ చైర్మన్ పిరియా విజయ సాయిరాజ్



కవిటి, జనవరి 8 ప్రభాతవార్త

క్రమశిక్షణతో కూడిన పోటీతత్వం చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని జెడ్పీ చైర్మన్ విజయ సాయిరాజ్ అన్నారు. బుధవారం మండల వరక పంచాయతీ నర్తుపుట్టుగ గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను జెడ్పీ చైర్మన్ విజయసాయిరాజ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ నేటి రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పోటీతత్వం ఉండాలని అన్నారు. మంచి ఉన్నత స్థానంలో ఉండాలంటే పోటీతత్వం అవసరమని అన్నారు. గెలుపు ఓటమిలు గెలుపు కానీ భావించాలని తెలిపారు. నేతలు నర్తు శివాజీ, సర్పంచ్ ప్రతినిధి శ్రీకాంత్ పురియ, గ్రామపెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ చిల్డ్రన్ హోంలను సందర్శించిన జిల్లా పర్యవేక్షణ కమిటీ

కొత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త



కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న కొత్తూరు, హిరమండలం మండలా లకు చెందిన చిల్డ్రన్ హోంలను జిల్లా పర్యవేక్షణ కమిటీ బుధవారం పర్యవేక్షిం చింది. ఈ మేరకు కొత్తూరు మండలం క్లూనీ, హిరమండలానికి చెందిన గ్రీన్ చిల్డ్రన్ హోంల పర్యవేక్షణలో భాగంగా ప్రస్తుతం ఆయా హోంల పనితీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలు గురించి నిశితంగా పరిశీలించినట్లు తెలిసింది. రెండు మండలాలకు చెందిన ఈ రెండు హోంలు బాలల న్యాయచట్టం–2015 ప్రకారం చిల్డ్రన్ హోం రిజిస్ట్రేషన్ కొరకు ధరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఈ పర్యవేక్షణ జరిగింది. సదరు రెండు హోంలను జిల్లా కమిటీ పర్యవేక్షించింది. కొత్తూరుకు చెందిన క్లూనీ చిల్డ్రన్ హోం పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల జిల్లా కమిటీ సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే హిరమండలం గ్రీన్ చిల్డ్రన్ హోంలో డాక్యుమెంట్స్ మరింత మెరుగుపర్చుకోవాలని సూచించినట్లు తెలిసింది. పర్యవేక్షణ అనంతరం చిల్డ్రన్ హోంల పనితీరు యాజమాన్యం, డాక్యుమెంట్స్ నిర్వహణ, మౌలిక వసతులు తదితర అంశాలపై తుది నివేదికను జిల్లా కలెక్టర్‌కు పర్యవేక్షణ కమిటీ అందిస్తుందన్నారు. తదుపరి తుది నివేదికను జువనల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జిల్లా కలెక్టర్ రికమండేషన్ ప్రకారం జారీ చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం మెట్టూరు బిట్ 1 అనాధ ఆశ్రమంను జిల్లా కమిటీ సందర్శించగా పిల్లలకు పండగ సెలవుల సందర్భంగా ఆశ్రమం లాక్ చేసి ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ టీమ్ కన్వీనర్ బి.వి.రవికుమార్, జిల్లా పర్యవేక్షణ అధికారి కో కన్వీనర్ కె.వి.రమణ, టీమ్ సభ్యులు యు.విమలకుమారి (సీడీపీఓ కొత్తూరు ప్రాజెక్ట్) ఎం.మల్లేశ్వరరావు (ప్రొటెక్షన్ అధికారి) ఐ.లక్ష్మీనాయుడు (ప్రొటెక్షన్ ఆఫీసర్), టి.లక్ష్మణరావు, ఎల్‌సిపిఓ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

# ఎంజీఆర్ ఆధ్వర్యంలో మోదీ సభకు పోటెత్తిన ఎన్డీయే కూటమి నేతలు

కొత్తూరు, జనవరి 8 ప్రభాతవార్త

పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు విశాఖపట్నం విచ్చేయుచున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. ఈ మేరకు నియోజకవర్గం నుంచి ప్రధాని మోడీ సమావేశానికి 10 బస్సులు, 165 కారుల్లో సుమారు 2500 మందికి పైగా తరలి వెళ్లినట్లు ఎమ్మెల్యే ఎంజీఆర్ వర్గాల సమాచారం. కార్యక్రమంలో కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, బిజెపి వ్రేణులు, జనసేన శ్రేణులు, పార్టీల శ్రేయోభిలాషులు పెద్దఎత్తున హాజరవ్వడం విశేషం.



# అంధత్వం దాటి ఉద్యోగాలు సాధించి..

అన్నీ సవ్యంగా ఉన్నా.. భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది అనేవారే ఎక్కువ! కానీ వీళ్లు.. చూపులేదు. అయినా ఎదగాలని సంకల్పించు కున్నారు. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించడమే కాదు ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతున్నారు.

**జ్వరం జీవితాన్ని మార్చింది: సంధ్య ........**

ఈమెది హైదరాబాద్ తండ్రి పదకొండేళ్లకే చనిపోయారు. తల్లి రైల్వేశాఖలో ట్రాక్మన్, ఇంటర్ వరకూ సంధ్య మామూలు అమ్మాయే తరవాతే బ్రెయిన్ ఫీవర్ రావడంతో కోమాలోకి వెళ్లారు. మూన్నెళ్లు ఆసుపత్రికే పరిమితమయ్యారు. ఆరోగ్యం కుదుట



పడినా కంటిచూపును కోల్పోయారు. అనుకోని అంధకారం ఆమెను కుంగ దీసింది. ఆ సమయంలో తోటివిద్యార్థి రాజు ఆమెలో ధైర్యం నింపారు. తరవాత జీవిత భాగస్వామిగా తోడు నిలిచారు. ఆయన ప్రోత్సాహంతో దూరవిద్యలో డిగ్రీ, ఓయూ నుంచి ఎంఏ తెలుగు పూర్తిచేశారు. గత ఫిబ్రవరిలో తెలంగాణ హైకోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. దాంతోపాటు గురుకుల డీఎల్ (డిగ్రీ లెక్చరర్) పరీక్ష రాసి ఉద్యోగాన్ని సాధించారు. దీంతో హైకోర్టులో ఉద్యోగానికి రాజీనామా చేసి మహబూబ్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఇవేకాదు, గ్రూప్4 సాధించి, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సంధ్యకి ఇద్దరమ్మాయిలు. చూపు కోల్పోయాక ఇంకేం చేయలేననుకున్నా కానీ పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. ఉద్యోగం సంపాదించాక సమాజంలో ఎంతో గౌరవాన్ని పొందుతున్నా అంటారు సంధ్య.

**ఒకరికొకరు తోడుగా..: జి. వరలక్ష్మి**



వరలక్ష్మి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉంద్యాల. ఆమెకు పుట్టుకతోనే చూపులేదు. మొదట్నుంచీ అంధుల పాఠశాలలో చదువుకున్నారు. ఉస్మానియా మహిళా కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. తన కాళ్లపై తాను నిలబడాలన్నది వరలక్ష్మి లక్ష్యం. రోజుకు 10 గంటల చొప్పున డీఎస్సీకి సిద్ధమయ్యారు. గత ఏడాది స్పెషల్ డీఎస్సీ రాసి, తొలి ప్రయత్నంలోనే కొలువు సాధించారు. ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లాలోని నూరారంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఈమెది ప్రేమ వివాహం. భర్త రవీందర్కి చూపులేదు. ఆయన వరిగిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్ పనిచేస్తున్నారు. సహాధ్యాయులైన వీళ్లు ఒకరికొకరు తోడుగా నిలిచారు. ప్రోత్సహించుకుంటూ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు.



**ఆన్‌లైన్‌లో చదివి....: ఈడిగి అనిత**

ఈమెది నారాయణపేట జిల్లాలోని మల్రెడ్డిపల్లి, ఐదేళ్లప్పుడు అనిత కంటికేదో సమస్య వచ్చింది. దాంతో చూపు తగ్గుతూ వచ్చింది. ఎన్ని ఆసుపత్రులకు తిరిగినా ప్రయోజనం లేదు. చివరకు చూపు దూరమైంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మహబూబ్‌నగర్లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఆపై హైదరాబాద్లో డీఎడ్, డిగ్రీ, ఆంధ్రా యూనివర్సిటీలో పొలిటికల్. సైన్స్లో ఎంఏ చేశారు. 2020లో నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా చేరారు. తర్వాత మహబూబ్‌పగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. అక్కడ విధులు నిర్వర్తిస్తూనే ఉపాధ్యాయ కొలువు కోసం సిద్ధమయ్యారు. గతఏడాది డీఎస్సీ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ప్రస్తుతం నారాయణపేట జిల్లాకేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్నారు. 'ఉపాధ్యాయురాలిని కావాలన్నది చిన్నప్పటి కల. చూపు కోల్పోయినా దాన్ని సాకారం చేసుకున్నందుకు ఆనందంగా ఉందంటారు అనిత. □

## తిరుప్పావై

### 25వ పాశురము



ఒరుత్తి మగనాయ్ ప్పిఱన్దు
ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తువళర
తరిక్కిలానాగి త్తాన్ తీంగు నిన్నైన్ద
కరుత్తై ప్పిళైప్పిత్తు కఞ్జన్
వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱ నెడుమాలే! ఉన్నై
అరుత్తిత్తువన్దోమ్ పఱై
తరుతియాకిల్,
తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్
యాంబాడి
వరుత్తముమ్ తీరు మకిళ్ న్దేలో
రెమ్బావాయ్.


కృష్ణుడు దేవకి కుమారుడై పుట్టి అదేరాత్రి యశోదకు బిడ్డడై పెరిగినాడు. కంసుడు చెడు ఆలోచనతో నీకు కీడు తలపెట్టగా అతని ఆలోచనను వ్యర్థము చేసి, నిన్ను ఆశ్రయించిన వానికి మేలుచేయువాడా నిన్ను కోరటానికి వచ్చాను. శిపరళి యను వాయిద్యమును మాకు ఇమ్ము. లక్ష్మీ మదేవికి పొందిన ఐశ్వర్యము, చరిత్ర పాటలుగా గానము చేసి శ్రమను తీర్చుకొని ఆనందిస్తున్నాము.

ఫలం: "సత్ సంతాన ప్రాప్తి"

# బ్లౌజుకి త్రీడీ పూలందం..

## ఫ్యాషన్ ఫ్యాషన్







జడ లేదా ముడిలో ఒదిగే పువ్వులు అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేస్తాయన్నది తెలిసిందే. అందుకే ఆ పూల డిజైన్లను దుస్తులమీదకీ తెచ్చేస్తుంటారు డిజైనర్లు. పెయింటింగుల్లోనూ ఎంబ్రాయిడరీలోనూ పూలను చొప్పిస్తుంటారు. అక్కడికీ చాలదనుకున్నారేమో.. ఆ పూలకు 3డీ ఎఫెక్ట్‌ను జోడించి మరీ బ్లౌజుల్ని డిజైన్ చేస్తున్నారిప్పుడు. సుతిమెత్తగా ఉండే నెట్, జార్జెట్, నైలాన్ ఫ్యాబ్రిక్కులతో గులాబీ, తామర, లిల్లీ వంటి పూలను తయారుచేసి బ్లవుజులమీదా చేతులపైనా ప్రత్యేకంగా అటాచ్ చేస్తున్నారు. దాంతో రిసెప్షన్ వేడుకలకు ఆధునికంగా తయారవ్వాలనుకునే పెళ్లికూతుళ్ల ఈ త్రీడీ ఎంబ్రాయిడరీ పూల జాకెట్ల అందానికి ముగ్ధులై మనసు పారేసుకుంటున్నారు. మరి మీకూ నచ్చాయా?











## రంగవల్లి



18 చుక్కలు
6 వరుసలు
6 వరకు



- దీప్తి
చైతన్య హిల్స్, హైదరాబాద్



17 చుక్కలు
3 వరసలు
ఇటు అటు వదిలి
3 వరకు



- స్వాతి
మనికొండ, హైదరాబాద్

**ముగ్గులకు ఆహ్వానం**

**మా చిరునామా** : ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
e mail
cheli@vaartha.com

# వివేకం కల్పించి ధైర్యం నింపండి..

## వ్యథ



ఎస్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

ప్రశ్న: మా అమ్మాయి ప్రవర్తనలో అనూహ్య మార్పులు వచ్చాయి. ఉన్నత లక్ష్యాన్ని విస్మరించి విచిత్రంగా ప్రవర్తిస్తోంది. ఐఐటిలో సీటు సాధించాలన్న పట్టుదల గాలికి వదిలేసింది. చదువంటే భయపడుతున్నది. ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటోంది. కాలేజీ హాస్టల్ నుంచి వచ్చేసి, ఇంట్లో తన గదికే పరిమితమయ్యింది. నిద్ర ఆహారాలకు దూరమయ్యింది. రెండుసార్లు ఎడమ చేతి మణికట్టు వద్ద బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. మా పెద్దబ్బాయి ఐఐటిలో చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నవాడు ఐఐఎంలో ఎంబిఏ పూర్తి చేసి బెంగళూరులో ఓ కంపెనీలో మేనేజర్‌గా ఉన్నారు. తన అన్నలు ఇద్దరి లాగే తానూ ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ఇంటర్‌లో ఎంపిసి గ్రూపు తీసుకున్నది. మంచి కళాశాల అయితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చని హైదరాబాద్‌లోని పేరున్న కాలేజి ఎంచుకున్నది. తన స్నేహితురాళ్ళు కొందరు అక్కడే చదువుతున్నారు. మొదటి ఏడాది అన్ని సబ్జెక్టులు పాస్ అయినప్పటికి మొత్తం కలిపి 80 శాతం మార్కులు వచ్చాయి. తన స్నేహితురాళ్ల ఇద్దరికి 90 శాతం మార్కులు వచ్చాయి. మరి కొందరికి 95శాతం, అంతకుపైగా వచ్చాయి. దీనితో మా అమ్మాయిలో భయం ఆత్మన్యూనతా భావం తలెత్తింది. తనకు ఐఐటిలో సీటు వచ్చే అవకాశం ఉండదన్న ప్రతికూల భావం బలపడింది. దీనితో కొంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వచ్చింది. రాను రాను మార్కులు తగ్గడంతో వీక్లి టెస్టులు అంటేనే ఒంట్లో వణుకు ప్రారంభం అయ్యింది. నెల క్రితం తన రూములో ఒంటరిగా ఉన్నప్పుడు బ్లేడుతో మణికట్టు వద్ద కోసుకుని కళ్ళు తిరిగి పడిపోయింది. తరువాత గదిలోకి వచ్చిన స్నేహితురాలు వార్డెన్‌కు చెప్పి చికిత్స చేయించింది. ప్రిన్సిపాల్ మా అమ్మాయి పరిస్థితిని గమనించి కౌన్సెలింగ్ చేయిస్తే మంచిదని మాకు సలహా చెప్పారు. అయితే మేము ఎంత చెప్పినా వినకుండా ఇంటికి వచ్చేసింది. వారం క్రితం మరొక సారి బ్లేడుతో కోసుకున్నది ఈ దశలో ఆమెకు ధైర్యం కలిగించి కాలేజీకి పంపే మార్గం చెప్పండి.

- ఒక సోదరి, కడప



జవాబు : అమ్మా మీ అమ్మాయి బాగా భయపడి డిమోటివేట్ (తిరోగమనం) అయ్యింది. సహజంగా ఉన్నత లక్ష్యాలు ఉన్నవారిలో ప్రేరణలోపాటు అంతర్లీనంగా భయం కూడ ఉంటుంది. కొంతమంది స్వయం ప్రేరణతో భయాన్ని జయించి ముందుకు వెళతాయి. మరికొద్ది మంది అనవసర భయాలను పెంచుకుని ఒత్తిడికి గురవుతుంటారు. పోటీ ఎదురయినపుడు, నెగ్గేందుకు అవసరమైన సామర్థ్యం నైపుణాలను మెరుగుపరచు కోవాలి. అయితే అందుకు తగిన వసతులు లేక పోయినా పరిస్థితులు అనుకూలించక పోయినా భయం ఆవహిస్తుంది. కేవలం ఉన్నత లక్ష్యం ఎంచుకుంటే సరిపోదు. అందుకు అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకోవాలి. కొన్ని లోపాల వల్ల సామర్థ్యం క్షీణిస్తుంది. ఆ దశలో మరింత ఒత్తిడికి గురై కృంగి పోతారు. ఇతరులతో పోల్చుకుని ఆత్మన్యూనతకు గురవుతారు. తాము ఎందుకు పనికిరామన్న ప్రతికూల భావన పెంచుకుంటారు. నిద్ర ఆహారాలకు దూరమై డిప్రెషన్‌కు లోనై ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు. ప్రస్తుతం మీ అమ్మాయి డిప్రేషన్‌లో ఉన్నట్టు భావించాలి. తక్షణం సరైన కౌన్సెలింగ్ లేదా చికిత్స అందించండి. చదువులో వెనుక బాటుకు కారణాలు గుర్తించి సరిదిద్దండి. ఐఐటి కాకుంటే ప్రత్యామ్నాయాలు చూపి ధైర్యం చెప్పండి. జీవితం అంటే ఐఐటి మాత్రమే కాదన్న వివేకం కల్పించండి. తన తెలివితేటలు, సామర్థ్యాలకు అనుగుణంగా ఎదిగే మార్గాలు చూపండి. □

# నువ్వుల లడ్డు విరగకుండా !




నువ్వులు, పల్లీలతో చేసిన లడ్డూలు పిల్లలకు బలమని, ఇంట్లో పెట్టమని అంటున్నారు. వాటిని ఏ పద్ధతిలో చేస్తే మంచిదో తెలుసుకుందాం..

లడ్డూలు చలికాలంలో ఆరోగ్యాన్నీ, రుచినీ కూడా ఇస్తాయి. వీటిలో క్యాల్షియం, ఐరన్, పొటాషియం, పీచు ఉంటాయి కాబట్టి పిల్లల ఆరోగ్యానికి చాలా మంచిది. వీటి కోసం పావు కప్పు పల్లీలు, మూడోవంతు కప్పు తెల్ల నువ్వులు, పావు కప్పు కొబ్బరిపొడి, అర కప్పు బెల్లం తురుము, పావుచెంచ యాలకులపొడి, రెండు చెంచాల నెయ్యి తీసుకోవాలి. మందపాటి అడుగున్న కడాయిలో మొదట నువ్వులు, తర్వాత పల్లీలు దొరగా వేయించుకోవాలి. వాటిని చల్లారనిచ్చి.. ఈ లోపు కొబ్బరిపొడిని బంగారు రంగు వచ్చేంతవరకూ వేయించుకోవాలి. పల్లీల పొట్టు తీసి బరకగా మిక్సీ పట్టుకోవాలి. ఒక పాత్రలో యాలకుల పొడి, పల్లీల పొడి, నువ్వులు వేసి కలపాలి. స్టౌపై కడాయి పెట్టి దానిలో బెల్లం తురుము వేసి నాలుగు చెంచాల నీళ్ల పోసుకోవాలి. బెల్లం పూర్తిగా కరిగే సమయానికి నువ్వులు, పల్లీలు, కొబ్బరి, యాలకులపొడి వేసుకొని బాగా కలపాలి. చేతికి నెయ్యి రాసుకుని లడ్డూలు చుట్టుకోవడమే. లడ్డూలు పొడిగా రాలిపోతుంటే మరొక్కసారి మొత్తం మిశ్రమాన్ని పొయ్యిమీద పెట్టండి. పాకం ముదిరి చక్కని లడ్డూలు వస్తాయి. నువ్వులు మరీ ఎక్కువ కాకుండా రంగు మారేంతవరకూ వేయిస్తే చాలు. కాసిని వేయించిన జీడిపప్పు పలుకులు కలిపినా కూడా కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. □

# సాయి సాయం

ఆధ్యాత్మికం

సాయిబాబా భక్తులకు సాయం చేస్తాడన్నది అందరకు విదితమే. అయితే ఏ రకంగా చేస్తారో, ఊహకు అందదు. నానా సాహెబ్ చందోర్కరుకు భిల్లుని రూపంలో నీటిని ఇచ్చాడు, బాలారాం మన్కడ్‌కు పల్లెటూరి రైతు రూపంలో టికెట్టు ఇచ్చాడు. దేంగ్లే పొలంలో, సాయి తన రూపంలోనే కనబడి బిడ్డను వర్షం బారి నుండి కాపాడాడు. అలా ఎన్నో, ఎన్నెన్నో! మహా సమాధి అనంతరం? అది 1956వ సంవత్సరంలో ఎస్.ఎస్.సి. పరీక్షలు చివరి రోజు తరువాత జరిగిన సంఘటన అంటే స్కూలు సెలవులలో జరిగినది. ఒక విద్యార్థి ఎస్.ఎస్.సి. చివరి పరీక్ష వ్రాసాడు. జ్వరం వచ్చింది. అతనికి తండ్రి లేడు. జ్వరంలోనే గడ్డ లేచింది. అయినా అది తగ్గింది. కానీ కాళ్లు చచ్చుబడ్డాయి. నడవలేకపోతున్నాడు. అతని తల్లి కలవరపడ్డది. వైద్యం చేయించింది. డబ్బు ఖర్చు అయింది గాని వ్యాధి తగ్గలేదు. ఎవరో షిరిడీ సాయినాథుని మహత్మం గూర్చి తెలిపారు.



ఆమెలో ఆశ జనించింది. ఆశతో బాటుగా భక్తి కూడా మొదలైంది. ఆ తల్లి, కుమారులు ప్రయాసతో షిరిడీ చేరుకున్నారు. ఆమె కుమారుని బాబా మహాసమాధి దగ్గరకు తీసుకుపోతానంటే అతడు రానన్నాడు .కారణం సాయిపైన భక్తి లేక కాదు. తనను ఎవరో మోసుకుంటూ తీసుకువెళ్లాలి. అది అతనికి నచ్చలేదు. అందరూ నవ్వుతారని అతని బాధ. ఆమె ఒంటరిగానే సమాధి మందిరానికి, ద్వారకామాయికి వెళ్లి బాబాను వేడుకుంది. రెండవ రోజు కూడా అంతే. మూడవ రోజు కూడా అతను రానన్నాడు. ఆమె కాకడ ఆరతికి వెళ్లి ఎంతో ఆర్తితో వచ్చింది. మరల సమాధి మందిరం దగ్గరకు పోయి సాయిని కన్నీటితో ప్రార్థించింది. వెనుకకు తిరిగి చూచింది. ఒక స్తంభాన్ని పట్టుకుని నిల్చున్న కుమారుడు కనిపించాడు. ఆమె ఆశ్యర్య పోయింది. కుమారుడు తనను సమాధి మందిరములోనికి తెచ్చాడని చెప్పాడు. అది సాయి లీలే అనుకున్నది ఆమె. కుమారునికి ఊతమిస్తూ సాయికి నమస్కారం చేయించింది.

మెల్ల మెల్లగా ఒక నెల తిరిగేసరికి తన కాళ్ళ మీద నిలబడి నడవసాగాడు కుర్రవాడు. ఆ రోజు ఏప్రిల్ 29. ఇది భక్తికిసాయి ఇచ్చే ప్రతిఫలం. □

- యం.పి.సాయినాథ్

# ఫుల్ హ్యాపీ మూవీ 'షష్టిపూర్తి'



రూపేష్ కథానాయకుడిగా మా ఆయి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన సినిమా షష్టిపూర్తి. నట కిరీటి డా.రాజేంద్ర ప్రసాద్, రెండు సార్లు జాతీయ ఉత్తమ నటి పురస్కారం గెలుచుకున్న అర్చన ఇందులో ప్రధాన తారాగణం. క్లాసిక్ ఫిల్మ్ లేడీస్ టైలర్ విడుదలైన 38 ఏళ్ళ తర్వాత వాళ్ళిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. ఆకాంక్షా సింగ్ ఇందులో రూపేష్ సరసన కథానాయికగా నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. రూపేష్ చౌదరి నిర్మాత. ఈ చిత్ర గ్లింప్స్‌ని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో టీమ్ విడుదల చేసింది. ఈ సందర్భంగా నట కిరీటీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, షష్టిపూర్తి ఈ అదృష్టం నా ఒక్కడికేనా.. లేదంటే ఇంకెవరికైనా ఉందా? మీడియా వాళ్లని మీడియా మిత్రులు అని అనను. దాదాపు వారు కూడా నాతో పాటు 40, 30 సంవత్సరాలుగా ట్రావెల్ చేస్తున్నారు. అందుకే మీడియా సోదరులు అని అంటాను. వారంతా నాపై చూపిస్తున్న ప్రేమ చూస్తుంటే.. ఆ భగవంతుడు నాకిచ్చిన అదృష్టం అని అనుకుంటాను. దేవుళ్లందరికీ పాద నమస్కారాలు అని అన్నారు. నటి అర్చన మాట్లాతుతూ, చాలా చాలా గ్యాప్ తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. మా ఆయి ప్రొడక్షన్ ప్రొడ్యూసర్ రూపేష్ చౌదరి మరియు డైరెక్టర్ పవన్ ప్రభ వీళ్లిద్దరూ కలిసి నాకు ఈ సినిమా ప్రపోజ్ చేసినప్పుడు.. సినిమా పేరు ఏంటి? అని అడిగాను. 'షష్టిపూర్తి' అని అన్నారు. నేను ఎవరితో యాక్ట్ చేయబోతున్నాను అని అడిగాను. వన్ ఆఫ్ ద వెరీ వెరీ ఇంపార్టెంట్ యాక్టర్ ఇన్ ఇండియన్ సినిమా అని చెప్పాలి.. రాజేంద్ర ప్రసాద్ గారి గురించి. రాజేంద్ర ప్రసాద్ చేసినటువంటి తమిళ సినిమాలు హీరోగా మీరెవరు చూసి ఉండరు బహుశా. నాకు ఇంత గొప్ప వెల్‌కమ్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్యూ అని అన్నారు. హీరో రూపేష్ మాట్లాడుతూ, షష్టిపూర్తి నా మొదటి సినిమా. ఈ సినిమా గురించి ఇక్కడున్న అందరూ చెప్పారు. 'షష్టిపూర్తి' సినిమాను అందరూ ఆదరిస్తారని, అందరి ఆశీస్సులు మాకు ఉంటాయని కోరుకుంటున్నాను.. థ్యాంక్యూ అని తెలిపారు. చిత్ర దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ, నేను చాలా మందికి థ్యాంక్స్ కార్డు చెప్పాలి. నాకు ఇంతమంచి సాంకేతిక నిపుణులను ఇచ్చిన నిర్మాత రూపేష్‌కి థ్యాంక్యూ. ఐ లవ్ యు ఫరెవర్. నా సెకండ్ థ్యాంక్స్.. రాజేంద్రప్రసాద్‌కి, అర్చనమ్మకి. ఎందుకంటే, ఈ సినిమాలో వారు పవర్ ప్యాక్‌డ్ పెర్ఫార్మెన్స్‌తో సినిమాను ఎక్కడికో తీసుకెళ్లారు. స్క్రీన్ మీద వాళ్లని చూస్తున్నంతసేపు.. రెప్ప కూడా వేయలేరు. నేను ప్రామిస్ చేసి చెబుతున్నాను అన్నారు. గీత రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడుతూ, కొన్ని సినిమాలు కొందరి జీవితానికి ప్రత్యేకంగా నిలిచిపోతాయి. అలా నాకు 'ఆ నలుగురు'.. ఇప్పుడు 'షష్టిపూర్తి' సినిమా. ఉదయ్ నందనవనం అనే దర్శకుడు ఈ యూనిట్ స్నేహితుడు. నాకు కూడా అతను స్నేహితుడు. ఈ సినిమా ప్రారంభం అవకముందే ఆయన కాల్ చేసి.. పాటల గురించి మాట్లాడడానికి రమ్మంటే వాళ్ల ఆఫీస్‌కి వెళ్లాను. నాకు అప్పటికే పవన్‌తో పరిచయం ఉంది. రూపేష్ కూడా అప్పుడే పరిచయం అయ్యాడు. సినిమా పేరు 'షష్టిపూర్తి'. ఇళయరాజాగారు సంగీతం అందిస్తున్నారు. మీరు టైటిల్ సాంగ్ రాయాలని చెప్పారు. హీరోకి, దర్శకుడికి, నిర్మాతకి ఇదే మొదటి సినిమా. వీళ్లేమో ఇళయరాజా పేరు చెబుతు న్నారు. ఇది అయ్యే పని కాదులే అని అనుమానించా అన్నారు.

# 12న 'డాకు మహారాజ్' విడుదల

వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస భారీ విజయాలతో దూసుకు పోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, ఈ సంక్రాంతికి మరో వైవిధ్యభరితమైన చిత్రం డాకు మహారాజ్‌తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. డాకు మహారాజ్ చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. విడుదల తేదీ దగ్గర పడటంతో ప్రచార కార్యక్రమాలలో మరింత జోరు పెంచిన చిత్ర బృందం, తాజాగా పాత్రికేయుల సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకుడు బాబీ కొల్లి, కథానాయికలు ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ పాల్గొని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, జనవరి 9న అనంతపురంలో భారీ ప్రీ ఈలీజ్ ఈవెంట్‌ని ప్లాన్ చేశాం. డాకు మహారాజ్ సినిమాని తెలుగునాట కావాల్సినన్ని థియేటర్లలో భారీగా విడుదల చేస్తున్నాం. యూఎస్‌లో కూడా భారీ స్థాయిలోనే విడుదల ఉంటుంది. అక్కడ బుకింగ్స్ బాగున్నాయి. తెలుగుతో పాటు తమిళ్ లోనూ జనవరి 12న విడుదలవుతోంది. డాకు మహారాజ్‌తో ఈ సంక్రాంతికి ఘన విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు బాగుంటాయి. ఈ సినిమా నేను చూసి నమ్మకంగా చెబుతున్నాను. డాకు మహారాజ్ చిత్రం అసలు నిరాశ పరచదు. బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది అన్నారు.దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, మొదటి నుంచి బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో, ప్రతి విషయంలో వైవిధ్యం చూపిస్తూ ఎంతో జాగ్రత్తగా ఈ సినిమాని రూపొందించాం. ప్రచార చిత్రాలకు బాలకృష్ణ అభిమానులు, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. దాంతో సినిమా విజయం పట్ల మాకు మరింత నమ్మకం పెరిగింది. అలాగే డాకు మహారాజ్ చిత్రం రాబోయేరోజుల్లో పలు సినిమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని బలంగా నమ్ముతున్నాను. బాలకృష్ణ అభిమానులకు ఒక మెమరబుల్ ఫిల్మ్ ఇవ్వాలనేది నాగవంశీ డ్రీమ్. అందుకు తగ్గట్టుగానే సరికొత్తగా ఉండేలా, ఒక మంచి సినిమాని తీశాము. ఇందులో ఐదుయాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. ప్రతి సీక్వెన్స్ అభిమానులకు ఎంతో హై ఇస్తుంది. యాక్షన్‌తో పాటు మంచి వినోదం, హత్తుకునే భావోద్వేగాలతో కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈసినిమా ఉంటుంది అన్నారు. కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ, ఈరోజు నాకు చాలా చాలా సంతోషంగా ఉంది. ట్రైలర్‌కు ఇంతటి అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీరు మా సినిమాపై చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. సంక్రాంతి కానుకగా జనవరి 12న థియేటర్లలో విడుదలవుతున్న ఈ సినిమాని మీకు ఎప్పుడెప్పుడు చూపిస్తామా అని ఎంతగానో ఎదురు చూస్తున్నాం.



# 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' బర్త్ డే పీక్

రాకింగ్ స్టార్ యష్.. కె.జి.యఫ్ ఫ్రాంచైజీ చిత్రాలతో గ్లోబల్ రేంజ్ స్టార్ డమ్‌ను సొంతం చేసుకున్న కథానాయకుడు. బుధవారం (జనవరి 8న) యష్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ ప్రేక్షకులకు ఆయన లేటెస్ట్ సెన్సేషనల్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' నుంచి 'బర్త్ డే పీక్' అంటూ గ్లింప్స్ రూపంలో ట్రీట్‌ను విడుదల చేశారు. ఈ వీడియోను గమనిస్తే యష్ స్టైలిష్ లుక్‌తో కనిపిస్తున్నారు. రొటీన్‌కు భిన్నంగా బోల్డ్ కంటెంట్‌తో



సినిమా కథను వెండితెరపై ఆవిష్కరించే విధానంలో హద్దులను చెరిపేసేలా బర్త్ డే పీక్ ఉంది. యష్ గడ్డంతో పెడోరా, సూట్ డ్రెస్ వేసుకుని సిగార్ కాలుస్తూ స్టైలిష్‌గా కనిపిస్తూ క్లబ్‌లోకి ఎంట్రీ ఇవ్వటాన్ని, క్లబ్‌లోని ప్రతీ ఒక్కరి దృష్టిని యష్ ఆకర్షించటాన్ని గమనించవచ్చు. ఆయన క్లబ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న తీరు వావ్ అనేలా మరో డిఫ రెంట్ అవతార్‌లో రాకింగ్ స్టార్ మెప్పించటం ఖాయంగా అనిపిస్తోంది. బోల్డ్‌గా, రెచ్చగొట్టే మూమెంట్స్‌తో నిండిన ఈ గ్లింప్స్ ప్రేక్షకులను మత్తుతో కూడిన ఆకర్షణీయ మైన, హద్దులు దాటిన ప్రపంచంలోకి ఆహ్వానిస్తుంది. సినిమా ఓ డిఫ రెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌నిస్తుందనటంలో సందేహం లేదు. టాక్సిక్ సినిమా గురించి, రాకింగ్ స్టార్ యష్ గురించి డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' సినిమా రొటీన్‌కు భిన్నంగా తెరకెక్కించిన సినిమా. గ్లింప్స్ చూస్తుంటేనే మనలో తెలియని ఓ డిఫరెంట్ ఫీలింగ్ కలుగుతుంది.

# పుష్ప-2 ది రూల్ రీలోడెడ్ వెర్షన్

ఇండియన్ బాక్సాఫీస్‌పై పుష్ప రాజ్ రూల్ సరికొత్తఅధ్యాయం.. మరో చరిత్రను సృష్టించిన సంగతి తెలిసిందే. కేవలం 32 రోజుల్లోనే భారతీయసినీ చరిత్రలోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా, ఇండియన్ నంబర్‌వన్ ఫిల్మ్‌గా పుష్ప2 దిరూల్ నిలిచిన సంగతి తెలిసిందే. అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం, భారతీయులు గర్వించదగ్గ చిత్రం బాహుబలి2 వసూళ్లను పుష్ప2 అధిగమించిన విషయం తెలిసిందే. ఇక పుష్ప2 ది రూల్ మరోసారి ఇండియా వైడ్‌గా హాట్ టాపిక్‌గా మారింది. జనవరి 11 నుంచి పుష్ప2 రీ లోడెడ్ వెర్షన్.. పుష్ప2కు మరో ఇరవై నిమిషాల పవర్‌ఫుల్ ఫుటెజ్‌ను యాడ్ చేస్తున్నారు. ది వైల్డ్‌ఫైర్ మరింత ఎక్స్‌ట్రా ఫైరీగా మారబోతుంది. ఈ విషయాన్ని అధికారికంగా మంగళవారం ప్రకటించారు మేకర్స్.ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందిన పుష్ప2 ది రూల్..ఈ సన్సేషన్ కాంబినేషన్‌లో అత్యున్నత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ సుకుమార్ రైటింగ్ సంస్థతో కలిసి ఈ ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ సినిమాను నిర్మించింది. విడుదలకు ముందే ప్రీ రిలీజ్ బిజినెస్‌లో ఇండియాలో సరికొత్త రికార్డును నెలకొల్పిన ఈ చిత్రం సినిమా విడుదల రోజు ప్రీమియర్స్ నుంచే సన్సేషనల్ బ్లాకబస్టర్ అందుకుంది. అల్లు అర్జున్ నట విశ్వరూపంకు, సుకుమార్ వరల్డ్ క్లాస్ టేకింగ్.. ప్రపంచ సినీ ప్రేమికులు ఫీదా అయిపోయారు. ముఖ్యంగా ఇండియాలో ఈ చిత్రం సృష్టించిన రికార్డుల పరంపరకు ఆకాశమే హద్దుగా ఉంది. సినిమా తొలిరోజు నుంచే 32రోజు వరకు వసూళ్లలో



వరుసగాఇండియా ఆల్‌టైమ్ రికార్డులు సృష్టించిన తాజాగా ఈ చిత్రం కేవలం 32 రోజుల్లో 1831 కోట్లు వసూలు చేసి ఇండియా చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఒక రికార్డు ప్రకటించేలోపే మరో కొత్త రికార్డును పుష్ప2 సాధించి రికార్డుల సాధించడంలో కూడా ఓ రికార్డును క్రియేట్ చేసింది. ఈ చిత్రం యావత్ భారతీయ సినీ పరిశ్రమను సంభ్రమశ్చర్యాలకు గురి చేస్తుంది. రష్మిక మందన్నా నాయికగా నటించిన ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన బాణీలను అందించాడు. కూబా ఫోటోగ్రఫీ సినిమాకు వన్నెతెచ్చింది. ఈచిత్రం సాధించిన, సాధిస్తున్న వసూళ్లతో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇండియా నంబర్‌వన్ హీరోగా అందరూ కొనియాడుతున్నారు. దర్శకుడు సుకుమార్ కూడా భారతదేశం గర్వించదగ్గ దర్శకుడిగా టాప్ పొజిషన్‌లో ఉన్నాడు.





# 'స్పై థ్రిల్లర్ జి2'లో వామికా గబ్బి

అడివి శేష్ హై ఆక్టేన్ స్పై థ్రిల్లర్ బి2తో అలరించబోతు న్నారు. ఇది పాత్‌బ్రేకింగ్ హిట్ గూడచారికి సీక్వెల్. బి2 ఇప్పటి వరకు అడివి శేష్ అత్యంత ప్రతిష్టాత్మకమైన హైబడ్జెట్ చిత్రం మాత్రమే కాకుండా ఇండియన్ స్పై థ్రిల్లర్ ల్యాండ్‌స్కేప్‌లో మోస్ట్ ఇంపార్టెంట్ ప్రాజెక్టలలో ఒకటి. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం స్పై థ్రిల్లర్ ఒక సినిమాటిక్ మాస్టర్ పీస్ అవుతుందని హామీ ఇచ్చింది. ఈ ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా యాక్షన్ ఫ్రాంచైజీలో ఇమ్రాన్ హష్మీతో పాటు వామికా గబ్బి చేరారు. ఈ పవర్‌హౌస్ తారాగణంతో, బి2 ట్రూ పాన్‌ఇండియా మూవీ రూపొందుతోంది. వామికా, అడివి శేష్ సరసన లీడ్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర స్పై ప్రపంచానికి ఫ్రెష్ డైనమిక్ లేయర్‌ని యాడ్ చేస్తోంది. ఇటీవల అడివి శేష్‌తో యూరోపియన్ షూటింగ్ షెడ్యూల్‌ను ముగించిన వామికా ఈ చిత్రం గురించి ఉత్సాహంగా ఉన్నారు. "బి2 అద్భుతమైన ప్రయాణంలో భాగం కావడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. మొదటి చిత్రం చెప్పుకోదగ్గ బెంచ్‌మార్క్‌ని సెట్ చేసింది, ఈ



ప్రపంచంలోకి అడుగు పెట్టడం ఆనందంగా, సవాలుగా ఉంటుంది. ప్రతిభావంతులైన తారాగణం, టీంతో కలిసి పనిచేయడం నాకు స్ఫూర్తినిస్తుంది అన్నారు. అడివి శేష్, వామికా గబ్బి, ఇమ్రాన్ హష్మీతో పాటు మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు షాలిని కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీ యాక్షన్, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ డ్రామాతో సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని ప్రామిస్ చేస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై టి జి విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన జి 2 తెలుగు, హిందీ, తమిళం, కన్నడ మలయాళం పాన్‌ఇండియన్ విడుదల కానుంది. పవర్‌హౌస్ తారా గణం, స్పై థ్రిల్లర్ స్టయిల్‌ని రీడిఫైన్ చేయనున్న బి2 నిస్సందేహంగా అత్యంత ఎదురు చూస్తున్న చిత్రాలలో ఒకటి. బి2 త్వరలో పెద్ద స్క్రీన్స్‌కి రావడానికి సిద్ధమవుమవుతోంది.

# 'సంక్రాంతికి వస్తున్నాం'లో నాది డిఫరెంట్ క్యారెక్టర్

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్‌లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. జనవరి 14న సంక్రాంతికి వస్తున్నాం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేకరుల సమావేశంలో విశేషాల్ని పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్ట్‌లో ఎలా వచ్చారు? ఈ మూవీ జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?**

సుడల్ వెబ్ సిరిస్ షూటింగ్‌లో వున్నప్పుడు డైరెక్టర్ అనిల్ రావిపూడి గారి నుంచి కాల్ వచ్చింది. ఓ క్యారెక్టర్‌కి లుక్ టెస్ట్ చేయాలని అన్నారు. నేను చాలా సర్ ప్రైజ్ అయ్యాను. ఆయన సినిమాలన్నీ చూశాను. ఇందులో నా క్యారెక్టర్‌కి ఒక యాస వుంది. ఆ యాసతో పాటు ఆ లుక్ టెస్ట్ కోసం హైదరాబాద్ వచ్చాను. ఓ డైలాగ్ ఇచ్చారు. రెండు లైన్స్ చెప్పగానే చాలని చెప్పి స్క్రిప్ట్‌ని నరేట్ చేశారు. నరేషన్‌లో పడిపడి నవ్వుకున్నాను. నా కెరీర్‌లో ఇంత ఎంజాయ్ చేసి విన్న స్క్రిప్ట్ ఇదే. భాగ్యం క్యారెక్టర్ కోసం చాలా వెదికారు. ఆ పాత్ర నాకు దక్కడం ఆనందంగా వుంది. ఇప్పటివరకూ చాలా సినిమాలు చేశాను. సంక్రాంతికి వస్తున్నాం నాకు చాలా స్పెషల్. గోదారి గట్టు పాట అందరికీ రీచ్ అయ్యింది. నేను ఎయిర్ పోర్ట్ లో కనిపిస్తే ప్రతి ఒక్కరూ నాతో ఫోటో తీసుకుంటున్నారు. అది ఆ పాటకి వచ్చిన రీచ్. ఆ సాంగ్ ఒక వైల్డ్ ఫైర్ లా పాకింది. తెలుగులో నాకు ఇప్పటివరకూ సరైన డ్యూయెట్ సాంగ్ పడలేదు. ఆ లోటు గోదారి గట్టు పాటతో తీరింది. వెంకటేష్ గారు లాంటి బిగ్ హీరోతో ఇంత అద్భుతమైన సాంగ్ చేయడం అది ఇంత వైరల్ హిట్ కావడం ఆనందంగా వుంది. అలాగే సినిమాలో పాటన్నీ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. పాటలు హిట్ అయితే సగం పాసైపోయినట్లే. ట్రైలర్ ఆ అంచనాలని మరింతగా పెంచింది. ఇది అందరూ ఎంజాయ్ చేసే సినిమా.

**వెంకటేష్‌తో యాక్ట్ చేయడం ఎలా అనిపించింది?**

బిగినింగ్ లో చాలా భయం వేసింది. ఎందుకంటే భాగ్యం.. మామూలు క్యారెక్టర్ కాదు. కత్తిమీద సాములాంటి క్యారెక్టర్. కొంచెం బ్యాలెన్స్ తప్పినా కష్టమే. ఇంతకుముందు ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు. ఆడియన్స్ చుస్తున్నప్పుడు జాలి పుట్టే క్యారెక్టర్. చాలా క్రూసియాల్ రోల్. కాస్త శ్రుతిమించిన ఓవర్ డోస్ అయిపోతుంది. భాగ్యం పాత్రని అర్థం చేసుకోవడానికి నాకు పదిరోజులు పట్టింది. వెంకీ ఎమోషన్స్ అన్నీ నేచురల్‌గా వుంటాయి. ఆయన టైమింగ్ అద్భుతం. ఆయనతో కలసి యాక్ట్ చేయడం మామూలు విషయం కాదు. అయితే ఆయన చాలా ఎంకరేజ్ చేసేవారు. భాగ్యం క్యారెక్టర్‌లో అదరగొడుతున్నావ్ అని మెచ్చుకునేవారు. కానీ డైలాగులు ఇచ్చేటప్పుడు టెన్షన్ వచ్చేసేది. చేతులు వణికేవి. ఒకసారి ఫీవర్ కూడా వచ్చింది(నవ్వుతూ). వెంకీ, అనిల్ సపోర్ట్ మర్చిపోలేను. వెంకీ చాలా పాజిటివ్‌గా వుంటారు. వండర్ ఫుల్ పర్సన్. భాగ్యం లాంటి క్యారెక్టర్ ఐదారేళ్ళుగా తెలుగు సినిమాల్లో చూడలేదు. చాలా ఫ్రెష్ రోల్. ఇలాంటి ఫ్యామిలీ ఫీల్ గుడ్ సినిమా వచ్చి చాలా రోజులైయింది. అందరూ కనెక్ట్ చేసుకునే సినిమా ఇది. అనిల్ చాలా క్రియేటివ్‌గా ఈ కథని చెప్పారు.





**మీనాక్షిచౌదరితో యాక్ట్ చేయడం గురించి?**

మీనాక్షి చాలా సింపుల్. తనకి నాకు దగ్గర పోలికలు. డాక్టర్ చదువుకుంది. కష్టపడి పైకి వచ్చింది. తను చాలా స్వీట్. తనకి నాకు మంచి ఫ్రెండ్షిప్ ఏర్పడింది. మీను సాంగ్‌లో తప్పితే.. వెంకటేష్ నేను మీనాక్షి ముగ్గురూ సినిమా అంతా ట్రావెల్ అవుతాం. మా ముగ్గురిని చూడాల్సిందే. ఇందులో వెంకీది మా ఇద్దరి మధ్య నలిగిపోయే క్యారెక్టర్.


**దిల్ రాజు నిర్మాణంలో చేయడం ఎలా అనిపించింది?**

దిల్ రాజు, శిరీష్‌బ్యానర్‌లో వర్క్ చేయడం నైస్ ఎక్స్‌పీరియన్స్.

**మీ కథల ఎంపిక ఎలా వుంటుంది?** సినిమాలో చేసే అవకాశం అందరికీ రాదు. అదొక అదృష్టం. భిన్నమైన కథలు చెప్పడానికి సినిమా గొప్ప వేదిక. నా వరకూ డిఫరెంట్ రోల్స్ చేయడానికి ఇష్టపడతాను.

# 'నాగబంధం' ప్రీ లుక్ రిలీజ్

పాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా ప్రతిష్టాత్మకమైన, లార్జ్ లెవల్ ప్రాజెక్ట్ నాగబంధంతో తన క్రాఫ్ట్‌ని ఎలివేట్ చేస్తున్నారు. అభిషేక్ దర్శకత్వం వహించడమే కాకుండా కథ, స్క్రీన్‌ప్లేకు తన క్రియేటివ్ టచ్‌ని అందించారు, ఇది ఒక ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుంది. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్ఐకె స్టూడియోస్‌పై కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో యాక్షన్ మూవీ పెదకాపుతో ఆకట్టుకున్న విరాట్ కర్ణ లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రం తారక్ సినిమాస్ సహ నిర్మాణంలో లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా ఈ హై బడ్జెట్ ప్రాజెక్ట్‌ను సగర్వంగా ప్రజెంట్ చేస్తున్నారు.మేకర్స్ ప్రీలుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు, హీరో పురాతన ఆలయం పెద్ద తలుపు ముందు నిలబడి ఉన్నట్లు కనిపిస్తుంది. తలుపు కొద్దిగా తెరుచుకున్నందున, లోపల నుండి కాంతి ప్రసరిస్తుంది, ప్రాజెక్ట్ గొప్పతనాన్ని సూచిస్తుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13న రుద్రను పరిచయం చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. నాగబంధంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుండి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో అభిషేక్ నామా గ్రిప్పింగ్ స్క్రిప్ట్‌ను రాశారు. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టిసారించి, భారత దేశంలోని 108 విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని నాగబంధం అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. సినిమా ఇంట్రో వీడియో ఇప్పటికే ప్రేక్షకులను ఆశ్చర్య పరిచింది, మంత్రముగ్దులను చేసే ప్రపంచంలోని గ్లింప్స్ అందిస్తుంది. కెజిఎఫ్ ఫేం అవినాష్ అఘోరా పాత్రలో నటిస్తున్నాడు. గొప్ప విజన్‌తో, నాగబంధం అసాధారణమైన నిర్మాణ విలువలు, అత్యాధునిక విఎఫ్ఎక్స్ హై ఆక్టేన్ అద్వంచరకి ప్రామిస్ చేస్తోంది. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పని చేస్తున్నారు, అభే సంగీత దర్శకుడు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాయగా, సంతోష్ కామిరెడ్డి ఎడిటర్. అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న నాగబంధం 2025లో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో పాన్ ఇండియా విడుదలకు సిద్ధంగా వుంది. తారాగణం: విరాట్ కర్ణ, నభా నటేష్, ఈశ్వర్య మీనన్, జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ సాంకేతిక సిబ్బంది:బ్యానర్: ఎన్ఐకె స్టూడియోస్ అభిషేక్ పిక్చర్స్, సమర్పణ: లక్ష్మి ఐరా, దేవాన్ష్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అభిషేక్ నామా, నిర్మాత: కిషోర్ అన్నపురెడ్డి సహ నిర్మాత: తారక్ సినిమాస్.





# ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్..
# భారత్ నుండి బరిలో 21 మంది
## అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లు రాక

**ఢిల్లీ:** భారత్‌లో జరిగే అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఇండియా ఓపెన్ ఈసారి స్టార్ ఆటగాళ్లతో కళకళలాడనుంది. ఈనెల 14 నుంచి 19 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో భారత్ నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 21 మంది క్రీడాకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పివి సింధు, లక్ష్యసేన్‌తో పాటు, పారిస్ ఒలింపిక్ చాంపియన్స్ డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సన్, దక్షిణ కొరియాకు చెందిన అన్ సెయంగ్, ప్రపంచ నంబర్ వన్ చైనాకు చెందిన షియుకి వంటి అంతర్జాతీయ స్టార్లు ఇందులో భాగం కానున్నారు.

భారత్ నుంచి పురుషుల సింగిల్స్‌లో ముగ్గురు, మహిళల సింగిల్స్‌లో నలుగురు, పురుషుల డబుల్స్‌లో రెండు జోడీలు, మహిళల డబుల్స్‌లో 8 జంటలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 4 జోడీలు ఈ టోర్నీలో ఆడనున్నాయి. ఈ ఏడాది పురుషుల సింగిల్స్‌లో టాప్-20 నుంచి 18 మంది, మహిళల సింగిల్స్‌లో టాప్-20 నుంచి 14 మంది ఈ టోర్నీలో ఆడనున్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత ఆటగాళ్ల జాబితాలో పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్, మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ్, ఆకర్షి కశ్యప్, పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, సాయి ప్రతీక్-పృథ్వీరాయ్.

మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో, రుతుపర్ణ-శ్వేతపర్ణ, మానస రావత్-గాయత్రి రావత్, అశ్విని భట్-శిఖా గౌతమ్, సాక్షి-అపూర్వ, సానియా సికందర్-రష్మీ గణేశ్, మృణ్మయి దేశ్‌పాండే-ప్రేరణ అల్వేకర్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో, సతీశ్ కుమార్-ఆద్య వరియత్, రోహన్ కపూర్-రుత్వికక శివాని, అశిత్ సూర్య-అమృత ఉన్నారు.



## మలేసియా ఓపెన్‌లో.. గాయత్రి, ట్రెసా జోడీ శుభారంభం

**ఢిల్లీ:** మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్- 1000టోర్నీలో తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. కౌలాలంపూర్‌లో ప్రారంభమైన ఓపెన్ వరల్డ్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూ సుకెళ్లగా, పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ నవంబర్ వన్ లక్ష్యసేన్ తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 21-10, 21- 10తో థాయ్‌లాండ్‌కు చెందిన ఓర్నిచా-సుకీత్త జోడీపై విజయం సాధించింది. 30 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆద్యంతం భారత జంట ఆధిపత్యం కనబరిచింది. రెండో గేమ్‌లో స్కోరు 11-9 వద్ద గాయత్రి-ట్రెసా ఒక్కసారిగా విజృంభించి వరుసగా ఎనిమిది పాయింట్లు గెలిచి 19-9తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఒక పాయింట్ ప్రత్యర్థి జంట నెగ్గినా, ఆ వెంటనే భారత జోడీ రెండు పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్యసేన్ 14-21, 7-21తో చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్ చేతిలో ఓడిపోయాడు.

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో బుమ్రా
## మెరుగుపడిన రిషబ్ ర్యాంక్



**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) విడుదల చేసిన టెస్ట్ రేటింగ్‌లో బౌలింగ్ విభాగంలో టీమ్ టీమ్ ఇండియా పేసు గుర్రం జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలోను, బ్యాటింగ్‌లో వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ తనస్థానాన్ని మెరుగుపరచుకోగా, ఆల్ రౌండర్లలో టీమిండియా ఆటగాడు రవీంద్ర జడేజా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బౌలింగ్‌లో బుమ్రా కెరీర్ టెస్ట్ రేటింగ్ 908 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. ఆస్ట్రేలియా సారథి కమిన్స్, దక్షిణాఫ్రికా పేసర్ రబాడ తలో స్థానం మెరుగు పరచుకుని రెండు, మూడు స్థానాలకు చేరారు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగిన చివరిటెస్ట్‌లో 10వికెట్లు తీసిన ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ ఏకంగా 29 స్థానాలు మెరుగు పరచుకుని 10వ ప్లేస్‌కు చేరాడు. జింబాబ్వేతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 11 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన ఆఫ్ఘనిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 54వ స్థానానికి ఎగబాకాడు. భారత్ నుండి బుమ్రాతో పాటు, రవీంద్ర జడేజా టాప్ 10బౌలర్ల జాబితాలో ఉన్నారు. జడ్డూ 9వ స్థానానికి ఎగబాకాడు.ఆసీస్‌తోజరిగిన చివరి టెస్ట్‌లో అద్భుతంగా రాణించిన భారత్ పేసర్ ప్రసిద్ద్ కృష్ణ 42 స్థానాలు మెరుగు పరచుకుని 93వ ప్లేస్‌కు చేరాడు. ఇకబ్యాటింగ్ విభాగంలో భారత్‌నుండి రిషబ్ పంత్‌తో పాటు, యశస్వీ జైస్వాల్‌టాప్10లో ఉన్నాడు.జైస్వార్4వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ ఆటగాళ్లు జో రూట్, హ్యారీ బ్రూక్ మొదటి 2 స్థానాల్లో కొనసాగుతుండగా, న్యూజిలాండ్ మాజీ సారథి కేన్ విలియమ్సన్, ఆసిస్ విధ్వంసకర బ్యాటర్ ట్రవిస్ హెడ్ 3, 5 స్థానాల్లో నిలిచారు. తాజాగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబాబవుమా 3స్థానాలు మెరుగుపరచుకుని 6వ ప్లేస్‌కు చేరుకున్నాడు. లంక ప్లేయర్ కమిందు మెండిస్ ఒక స్థానం పెరిగి 7వ ప్లేస్‌లో ఉన్నాడు. భారత్‌తో జరిగిన చివరి టెస్ట్‌లో ఆశించినంతగా రాణించ లేకపోయిన ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఒక స్థానం కోల్పోయి 8వ ప్లేస్‌కు పడిపోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీలు చేసిన పాక్ మాజీ కెప్టెన్ బాబర అజమ్ 5 స్థానాలు మెరుగుపరచుకుని 12వ ప్లేస్‌కు ఎగబాకాడు. కాగా ఆల్ రౌండర్ల ర్యాకింగ్స్‌లో టీమిండియా స్టార్ రవీంద్ర జడేజా అగ్ర స్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా ఆటగాడు మార్కో జన్సెన్ 2 స్థానాలు మెరుగు పరచుకుని 2వ ప్లేస్‌కు చేరాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీ కోసం..
# టీమిండియా రెడీ
### ఈ టీమ్‌లో వీరు ఔట్.. స్క్వాడ్‌లో యువ ఆటగాళ్ల ప్లేస్



**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టోర్నమెంట్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి రంగం సిద్ధమైంది. పాకిస్తాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. 8 జట్ల మధ్య జరగనున్న ఈ టోర్నీ 8 ఏళ్ల తర్వాత తిరిగి రాబోతోంది. ఈ టోర్నీకి టీమిండియాలో ఎవరు ఉంటారు, ఎవరిని పక్కనపెడతారనేదానిపై సెలక్టర్లు దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రాలకు అవకాశం దక్కడం దాదాపు ఖాయం. అదే సమయంలో, కొంతమంది యువ ఆటగాళ్లు కూడా ఈసారి జట్టులో భాగమయ్యే రేసులో ఉన్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ భారత జట్టును ఎంపిక చేస్తోంది. ఈ టోర్నీలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రా వంటి దిగ్గజ ఆటగాళ్లకు అవకాశం దక్కడం ఖాయం. ఈ ఆటగాళ్లు ఇటీవలి కాలంలో వన్డే ఫార్మాట్‌లో అద్భుతంగా రాణించారు. అదే సమయంలో, రోహిత్‌తో ఓపెనింగ్ చేయడానికి శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్‌లను జట్టులో ఉంచవచ్చు. జైస్వాల్‌ఇంకా భారత్ తరపున వన్డేల్లో అరంగేట్రం చేయలేదు. కానీ, అతని ఇటీవలి ఫామ్ చాలా బలంగా కనిపిస్తోంది. రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా కూడా సెలక్టర్ల మొదటి ఎంపిక కానున్నారు. ఈ జట్టులో బ్యాకప్ వికెట్ కీపర్‌గా కూడా సంజూ శాంసన్‌ని చూడొచ్చు.శ్రేయాస్ అయ్యర్, నితీష్‌కుమార్ నుంచి ఎవరైనా ఒక ఆటగాడిని ఎంచుకోవచ్చు. శ్రేయాస్ అయ్యర్‌కు వన్డే ప్రపంచకప్‌లో ఆకట్టుకున్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా పర్యటనలో నితీష్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. వీరితో పాటు అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలను కూడా ఆల్ రౌండర్లుగా జట్టులోకి తీసుకోవచ్చు. జస్ప్రీత్ బుమ్రాతో పాటు మహ్మద్ సిరాజ్‌కు కూడా అవకాశం దక్కడం దాదాపు ఖాయం. అదే సమయంలో, వన్డే ప్రపంచ కప్ 2023 నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న మహ్మద్ షమీని కూడా జట్టులో చేర్చవచ్చు. వీరే కాకుండా జట్టులోని నాలుగో ఫాస్ట్ బౌలర్‌గా అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్‌కు కూడా చోటు దక్కవచ్చు. కాగా ఈ నెల 12 లోగా అన్ని జట్లు తమ తాత్కాలిక బృందాన్ని ఐసీసీకి సమర్పించాల్సి ఉంటుంది. మొత్తం 8 జట్లు తమ తాత్కాలిక జట్టును సమర్పించాలి. ఆయా దేశాల క్రికెట్ బోర్డులు ఫిబ్రవరి 13 వరకు జట్టులో మార్పులు చేయవచ్చు. సమర్పించిన జట్టును ఫిబ్రవరి 13న మాత్రమే ఐసీసీ విడుదల చేస్తుంది. అయితే, జనవరి 12 నాటికి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం భారత జట్టును ప్రకటించవచ్చు.



# న్యూజిలాండ్‌దే వన్డే సిరీస్

**హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. హ్యామిల్టన్ వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో గెలుపొందింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 9 వికెట్ల నష్టానికి 255 పరుగులు చేసింది. ఓపెనర్ రచిన్ రవీంద్ర (63 బంతుల్లో 79, 9 ఫోర్లు, సిక్స్) మెరుపు అర్ధ శతకం బాదగా, వన్ డౌన్ బ్యాటర్ మార్క్ చాప్మన్ (52 బంతుల్లో 62, 5 ఫోర్లు, 2 సిక్సర్లు) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. డారిల్ మిచెల్ (38), గ్లెన్ ఫిలిప్స్ (22), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (20) ఓ మోస్తరు స్కోర్లు చేయగా, విల్ యంగ్ 16, టామ్ లాథమ్ 1, నాథన్ స్మిత్ 0, మ్యాట్ హెన్రీ 1, విలియమ్ ఓరూర్కీ 3 పరుగులు (నాటౌట్) చేశారు. ఈ మ్యాచ్‌లో లంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. 35 ఓవర్‌లో ఆఖరి రెండు బంతులకు వరుసగా రెండు వికెట్లు తీసిన తీక్షణ, ఆ తర్వాత 37వ ఓవర్ తొలి బంతికి మరో వికెట్ పడగొట్టి వన్డేల్లో తన తొలి హ్యాట్రిక్‌ను నమోదు చేశాడు. మిచెల్ సాంట్నర్‌ను తొలుత ఔట్ చేసిన తీక్షణ, ఆ తర్వాత వరుసగా నాథన్ స్మిత్, మ్యాట్ హెన్రీని ఔట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 ఓవర్లు వేసిన తీక్షణ, 44 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. తీక్షణతో పాటు హసరంగ (2), ఎషాన్ మలింగ (1), అశిత ఫెర్నాండో(1) వికెట్లు తీశారు.అనంతరం 256 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. కమిందు మెండిస్ (64), జనిత్ లియనాగే (22) ఆదుకునే ప్రయత్నం చేశారు. లియనాగే 16వ ఓవర్ ఆఖరి బంతికి ఔట్ కావడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. చమిందు విక్రమసింఘే (17) క్రీజ్లో నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. అనంతరం వచ్చిన ఆటగాళ్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా శ్రీలంక 30.2 ఓవర్లలో 142 పరుగులకే చాప చుట్టేసింది. లంక ఇన్నింగ్స్‌లో నిస్సంక 1, అవిష్క ఫెర్నాండో 10, కుసాల్ మెండిస్ 2, అసలంక 4, హసరంగ 1, తీక్షణ 6, మలింగ 4 పరుగులు చేసి ఔటయ్యారు. కివీస్ పేసర్ విలియమ్ ఓరూర్కీ కీలకమైన కమిందు మెండిస్ వికెట్ పడగొట్టడంతో పాటు, ఇద్దరు చివరి వరుస ఆటగాళ్లను పెవిలియన్‌కు పంపాడు. జేకబ్ డఫీ 2 వికెట్లు పడగొట్టగా, మ్యాట్ హెన్రీ, నాథన్ స్మిత్, మిచెల్ సాంట్నర్ తలో వికెట్ తీశారు. కాగా, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ తొలి వన్డేలోనూ విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య నామమాత్రపు చివరి వన్డే ఈ నెల 11న ఆక్లాండ్‌లో జరుగనుంది.

## వాణిజ్యం


# ఓలాకు సెబి వార్నింగ్



**ముంబై, జనవరి 8:** సాధారణంగా కంపెనీకి సంబంధించిన అన్ని ప్రణాళికలను ముందుగా ఎక్స్ఛేంజీలకు వెల్లడించాల్సి ఉంటుంది. కానీ ఓలా ఎలక్ట్రిక్ సిఇఒ భవీష్ అగర్వాల్ తన రిటైల్ స్టోర్ల కంపెనీ 4 రెట్లు పెంచు తున్నట్లు ఎక్స్ వేదికగా ప్రారంభించింది. కస్టమర్లకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 800 స్టోర్ల సంఖ్యను 4000కు పెంచనున్నాం అని 2024 డిసెంబర్ 2 ఉదయం 9.58 గంటలకు సోషల్ మీడియా వేదికగా ఏర్పాటు చేయబడింది. అయితే స్టాక్ఛేంజీలకు ఈసమాచారం మధ్యాహ్నం 1:36 గంటల నుంచి 1:41గంటలకు అందిందని సెబి ప్రకటించింది. రెగ్యులేటర్ నియమాల ప్రకారం, స్టాక్‌లో నమోదిత సంస్థలకు సంబంధించిన అన్ని ఈవెంట్‌లు లేదా ఇతర సందర్భాల్లో ఏదైనా బహిర్గతం చేసే ముందు స్టాక్ ఎక్స్ఛేంజీలకు వివరాలు అందించాల్సి ఉంటుంది. కానీ ఓలా మాత్రం మొదట బహిర్గతం చేసి ఆ తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీ లకు తెలిపిందని సెబీ ప్యాకేజీ. నిబంధనలు పాటించడంలో ఓలా విఫలమైందని, ఈ నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించారు. సంస్థ ఓలాకు హెచ్చరిక లేఖ నియంత్రణ జారీ చేసింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించింది. సెబిలేఖపై ఓలా స్పందించింది. హెచ్చరిక కారణంగా ఎలాంటి ఆర్థికపరమైన చిక్కులు ఉండవని సూచిస్తున్నాయి. ఈ వివరణతో షేర్లు కాస్త కోలుకున్నాయి.

## జిందాల్ ఒక్కో షేరుకు 4 షేర్లు

**ముంబై, జనవరి 8:** మరికొద్ది రోజుల్లో దేశీయ స్టాక్ మార్కెట్లలో కార్పొరేట్ లిస్టెడ్ కంపెనీలు తమ మూడు త్రైమాసిక ఫలితాలను ప్రకటించటానికి సిద్ధంఅవుతున్నాయి. ఈ క్రమంలో చాలా మంది చూరుకుగా ఉండే ట్రేడర్లు అవి అందించే బోనస్ షేర్లు, డివిడెండ్లను అందిపుచ్చుకునేందుకు ఆసక్తిగా ట్రేడింగ్ ప్లాన్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో జిందాల్ గ్రూప్ కంపెనీ అయిన జిందాల్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ తన పెట్టుబడిదారులకు పెద్ద శుభవార్తను ప్రకటించింది. సంక్రాంతికి మరోవారం రోజులు మిగిలి ఉండగానే కంపెనీ ఇన్వెస్టర్లకు పెద్ద బహుమతిని ప్రకటించింది. పెట్టుబడిదారులకు 4:1 రేషియోలో బోనస్ షేర్లను అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. ఈవార్తలో ఇంట్రాడేలో స్మాల్ క్యాప్ కంపెనీ షేర్లు దాదాపు 5 శాతానికి పైగా లాభపడ్డాయి. ఈ క్రమంలో కంపెనీ షేర్లు తమ 52 వారాల గరిష్ఠ ధర రూ.463.9ని తాకాయి. దీంతో గడచిన ఏడాది కాలంలో కంపెనీ షేర్లు తమ ఇన్వెస్టర్లకు 47 శాతానికి పైగా భారీ రాబడిని అందించింది. కంపెనీ ఉచితంగా అర్హులైన ఇన్వెస్టర్లకు షేర్లను భారీగానే ఇస్తోంది. ఇన్వె




స్టర్లు హోల్డ్ చేస్తున్న ప్రతి షేరుకు అదనంగా 4 షేర్లను అందించాలని ప్రస్తుతం నిర్ణయించింది. ఈనెల 7న జరిగిన బోర్డు మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకోబడింది. దీనికి సంబంధించి రికార్డు తేదీని త్వరలోనే ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అలాగే అర్హులైన పెట్టుబడిదారుల డీమ్యాట్ ఖాతాల్లో బోనస్ షేర్లను మార్చి6, 2025నాటికి జమ చేయబడతాయని పేర్కొంది. దీనికోసం అర్హత పొందాలని భావించే ఇన్వెస్టర్లు త్వరలో కంపెనీ ప్రకటించే రికార్డు తేదీ నాటికి వారి డీమ్యాట్ ఖాతాలో షేర్లను కలిగిఉండి కంపెనీ పుస్తకాల్లో షేర్ హోల్డర్‌గా ఉండాల్సి ఉంటుంది. వాస్తవానికి జిందాల్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ రూ.18,000 కోట్ల బీసీ జిందాల్ గ్రూప్‌లో భాగం.

## ఫ్యాక్ట్ చెకింగ్ నిలిపేసిన మెటా

**వాషింగ్టన్, జనవరి 8:** మెటా గ్రూప్ తన ఆన్‌లైన్ సర్వీసులైన ఫేస్‌బుక్, థ్రెడ్స్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో ఫ్యాక్ట్ చెకింగ్‌కు సంబంధించి కీలక నిర్ణ యం తీసుకుంది. ఇకపై వీటిల్లోని థర్డ్ పార్టీ ఫ్యాక్ట్ చెకింగ్ ప్రోగ్రాము నిలిపినట్లు ప్రకటించారు. బదులుగా దీనికి కంపెనీ కమ్యూనిటీ నోట్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేసింది. కమ్యూనిటీ నోట్స్ అంటే కమ్యూనిటీ ఆధారిత వ్యవస్థ వల్ల తప్పుదోవ పట్టించే పోస్టులను కట్టడి చేయవచ్చని మెటా తెలిపింది. ఇప్పటికే ఈ వ్యవస్థను ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో వాడుతున్నట్లు తెలుస్తుంది. ట్రంప్ త్వరలో అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టనున్న తరుణంలో మెటా ఈ ఫ్యాక్ట్ చేపడుతున్న సదుపాయాన్ని నిలిపివేస్తున్న నిర్ణయం పట్ల కంపెనీపై ఎలాంటి ప్రభావం పడుతుందో చూడాలని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే ప్రధాన కంపెనీలు కొత్త ప్రదుత్వం పట్ల అభిమానాన్ని చూరగొనడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మార్పుపై ట్రంప్ అధికారులకు మెటా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్ షిప్ అధినేత, ట్రంప్ చిరకాల మిత్రుడు డానా వైట్‌ను మెటా బోర్డులో చేర్చుకున్నట్లు కంపెనీ సిఇఒ మార్క్ జుకర్బర్గ్ ఇప్పటికి ప్రకటించారు. కఠిన నిర్ణయాలు తప్పవు రాబోయే రోజుల్లో అమెరికాలో మార్పు రావాలని ఆశిస్తున్నట్లు మార్క్ చెప్పారు. అందరూ స్వేచ్ఛగా భావ వ్యక్తీకరణ చేయాలని చెప్పారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తుంది. దాంతో కంపెనీలు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల మార్క్ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి నెటిజన్ల మిశ్రమంగా ఉంది. ఇప్పటివరకు మెటా అనుసరించిన ఫ్యాక్ట్ చెకింగ్ విధానంతో ఇటీవల అధికారంలోకి వచ్చిన కన్జర్వేటివ్‌పార్టీ నేతలను అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నట్లు గతంలో భావించారు. ట్రంప్ అధికారంలోకి వస్తే మెటాకు వ్యతిరేకంగా తీసుకునే అవకాశం ఉంటుందని భావించి ముందుగానే మార్క్ ఈ మార్పులు చేశారని కొందరు అభిప్రాయపడుతున్నారు. కన్జర్వేటివ్ మిత్రపక్షాలు ఈ నిర్ణయాన్ని స్వాగతించాయి. అయితే అనేక డిజిటల్ హక్కుల సంఘాలు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. కంపెనీ తీసుకున్న నిర్ణయంతో తప్పుడు సమాచారం మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి.



## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జనవరి 8:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం మార్కెట్ ప్రారంభంలోనే నష్టాల్లోకి జారుకున్నసూచీలు ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. ఐటి ఎఫ్‌ఎంసిజి, గ్యాస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో చివరికి సెన్సెక్స్ 50 పాయింట్లు నష్టపోయి 78,148.49 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ చివరకు 18 పాయింట్లు నష్టపోయి 23,688 పాయింట్ల వద్ద నిలిచింది. అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టి, సన్‌ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఎన్‌టిపిసి వంటి షేర్లు నష్టపోయాయి. టిసిఎస్, రిలయన్స్ఇండస్ట్రీస్, ఐటిసి, ఏసియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మారుతిసుజుకి వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 77.72 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,667.30 డాలర్ల వద్ద కొనసాగింది.

## ఓపెన్ ఎఐ సిఇఒపై సోదరి సంచలన ఆరోపణలు

**వాషింగ్టన్, జనవరి 8:** ఓపెన్ ఐఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ (ఓపెన్‌ఏఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మన్)పై సంబంధిత వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దాదాపు పదేళ్లపాటు సామ్ ఆల్ట్ మన్ తనను ఆసక్తిగా వేధించినట్లు (లైంగిక వేధింపుల ఆరోపణలు) ఆయన సోదరి గుర్తింపు. ఈ మేరకు మిస్సోరీ డిస్ట్రిక్ కోర్టులో దావా వేశారు. తనకు మూడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచే ఆ దారుణాలను అనుభవించానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మిస్సోరీ క్లేటన్‌లోని మా ఇంట్లో నాకు వేధింపులు ఎదురయ్యాయి. నాకు మూడేళ్లు ఉన్నప్పుడు సామ్‌కు పన్నెండేళ్లు. అప్పటి నుంచే వేధింపులు ఎదుర్కొన్నారు. 1997 నుంచి 2006 వరకు అతడు నాపై దారుణంగా వేధింపులకు పాల్పడ్డాడు. చాలాసార్లు వేధింపులను ఎదుర్కోవలసి వచ్చింది. భవిష్యత్తులోనూ కొనసాగుతుందేమో అని సామ్ సోదరి తన దావాలో పేర్కొన్నారు. ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌పై ఆమె గతంలోనూ ఓసారి ఎక్స్ వేదికగా ఈ ఆరోపణలు చేశారు. అయితే, ఈ సారి మాత్రం కోర్టును ఆశ్రయించారు. దీంతో సామ్ ఆల్ట్ మన్ విచారణను ఎదుర్కోవాల్సి ఉందే. అయితే, వేధింపుల ఆరోపణలను ఖండిస్తూ సామ్ ఆల్ట్‌మన్, ఆయన తల్లి, సోదరులు సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. సామ్ సోదరి మానసిక స్థితి సరిగా లేదు. ఆమె ఆరోగ్యంపై మేం చాలా ఆందోళన చేస్తున్నాం. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారిని జాగ్రత్తగా చూసుకోవడం చాలా కష్టం. ఆమెకు అండగా ఉండేందుకు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. ఆర్థికంగా సాయం చేసినప్పటికీ.. ఇంకా డబ్బుకోసం డిమాండ్ చేస్తున్నాం. తండ్రి ఆస్తిని అక్రమంగా ఆక్రమించి సొంత కుటుంబసభ్యులపైనే ఆరోపణలకు దిగింది. ఈ పరిస్థితుల్లో, మా కుటుంబగోప్యతను



గౌరవించాలని ప్రతి ఒక్కరికీ కావాలి. ఆమెకు మానసిక ప్రశాంతత చేకూరాలని ప్రార్థిస్తున్నాం. ఆమె వ్యక్తిగత గోప్యతపై దృష్ట్యా మేం దీనిపై బహిరంగంగా స్పందించొద్దని అనుకున్నాం. కానీ ఇప్పుడు కోర్టుకు వెళ్లడంతో ఈ ప్రకటన విడుదల చేయాల్సి వచ్చిందని సామ్ కుటుంబం ప్రకటనలో పేర్కొంది.

## లియో డ్రైఫ్రూట్స్ ఐపిఒ షురూ

**ముంబై, జనవరి 8:** స్టాక్ మార్కెట్లో జాబితా అయిన లియో డ్రైఫ్రూట్స్ అండ్ స్పైసెస్ కంపెనీ బీఎస్ఈ ఎస్ఎమ్ఈ కేటగిరీలో వచ్చిన ఐపీవో 30.77శాతం ప్రీమియం ధర వద్ద లిస్ట్ కావటంతో పెట్టుబడిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కో షేరు రూ.68 రేటు వద్ద మార్కెట్లోకి గ్రాండ్ ఎంట్రీని నమోదు చేశాయి. దీంతో ప్రస్తుతం కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.116.29 కోట్లుగా కొనసాగుతోంది. వాస్తవానికి కంపెనీ తాజా ఐపీవోద్వారా దేశీయస్టాక్‌మార్కెట్ల నుంచి రూ.25.12 కోట్లను సమీకరించింది. ఇందుకోసం 48.30 లక్షల తాజా ఈక్విటీ షేర్లను విక్రయించింది. లియో డ్రైఫ్రూట్స్ అండ్ స్పైసెస్ కంపెనీ తన ఐపీవోను సాధారణ ఇన్వెస్టర్లకోసం జనవరి 1 నుంచి జనవరి 3 వరకు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉంచింది. కంపెనీ తన ఐపీవో ప్రైస్ బ్యాండ్ ధరను రూ.5152గా నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇదేక్రమంలో లాట్ పరిమాణాన్ని 2000 షేర్లుగా నిర్ణయించటంతో పెట్టుబడిదారులు కనీసం రూ.1,04,000 పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఐపీవో ప్రక్రియలో భాగంగా కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.6.88 కోట్లను సమీకరించింది. ఐపీవోకి ముందు కంపెనీలో ప్రమోటర్ల వాటా 52.21శాతంగా ఉండగా ప్రస్తుతం 38.11 శాతానికి తగ్గింది. మహారాష్ట్ర కేంద్రంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్న కంపెనీ తాజా ఐపీవో ద్వారా సమీకరిస్తున్న మొత్తాన్ని ప్రధానంగా వర్కింగ్ కేపిటల్ అవసరా లతో పాటు బ్రాండింగ్, అడ్వర్టైజింగ్ అండ్ మార్కెటింగ్ అవసరాలతో పాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించాలని నిర్ణయించింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.